23-05Pg1exHMNWJQE 1 ONG_23-05Pg1exHMNWJQE.qxd 23/May/26 12:26 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM ఒంగోలు : fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 112 పేజీలు: 12 వెల: 6.50

## ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ నిరాకరణ
2లో

## వచ్చే నెలలో సింగపూర్ పర్యటనకు చంద్రబాబు, లోకేష్



## 24 రాజ్యసభ సీట్లకు జూన్ 18న పోలింగ్

ఎపి నుంచి అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వానీ, సానా సతీష్ సీట్లు ఖాళీ
2లో
దేవగౌడ, ఖర్గే, దిగ్విజయ్ సింగ్ కూడా రిటైర్
మొత్తం 10 రాష్ట్రాలలో జరగనున్న ఎన్నికలు



## ఐఎఎస్‌ల పిల్లలకూ ఇంకా రిజర్వేషన్లా?

ఉన్నత స్థానాలకు చేరిన కుటుంబాలు కోటా ఆశించడమేమిటి?
సమాజంలోని చివరి వ్యక్తికీ రిజర్వేషన్ ఫలాలు అందాలి
జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యలు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు
9లో



## సంచలనం సృష్టించిన ఐపిఎల్ ఉప్పల్ మ్యాచ్
ఆటలో

55 పరుగుల తేడాతో బెంగళూరుపై హైదరాబాద్ ఘన విజయం



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్

## ఇండో-సైప్రస్ వ్యూహాత్మక దౌత్యం

ప్రధాని మోడీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్ ద్వైపాక్షిక చర్చలు

**న్యూఢిల్లీ,మే 22:** భారత్, సైప్రస్ దేశాల దౌత్య సంబంధాలలో సరికొత్త అధ్యాయం ప్రారంభం అయిందని, రెండుదేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న స్నేహ బంధాన్ని మరింత ఉన్నతమైన వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్ పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడా లిడ్స్‌తో ప్రధాని మోడీ ప్రతినిధుల స్థాయి చర్చలు >>2

# ఎండ నిప్పులు






శుక్రవారం రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

హీట్‌వేవ్‌పై రాష్ట్రమంతా అప్రమత్తం
తీవ్రత అధికంగా ఉన్న చోట సెలవులు
ఉదయం 11 నుంచి సాయంత్రం 4గం. దాకా ప్రజలు బయటకు రావొద్దని సిఎం చంద్రబాబు సూచన

ఎన్టీఆర్‌జిల్లా నందిగామ: 44.7⁰
పల్నాడుజిల్లా పిడుగురాళ్ల: 43.8⁰
మన్యం జిల్లా సాలూరు: 42.4⁰

వడగాడ్పుల నుంచి రక్షణకు జాగ్రత్తలు

**విజయవాడ మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచిం చారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థి తులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్‌వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించు కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా >>2

## పోస్టాఫీసులో కుచ్చు'టోపీ'

### రూ.2కోట్ల సొమ్ము స్వాహా

నూజివీడులో ఓ పోస్టల్ ఉద్యోగి అరెస్టు



ఆందోళనలో ప్రజలు

**నూజివీడు, మే 22 ప్రభాతవార్త:** పోస్ట్ ఆఫీస్‌లో రూ.రెండు కోట్ల మేర ప్రజల సొమ్ము గోల్మాల్ జరగటంతో ఒక పోస్టల్ ఉద్యోగి కటకటాల పాలైన సంఘటన నూజివీడులో జరిగింది. కుటుంబ అవసరాలకు పిల్లల చదువు, అమ్మాయిల వివాహాలు, ఇతర భవిష్యత్తు అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పోస్ట్ ఆఫీస్‌లో ఎంతో నమ్మకంతో ప్రజలు దాచుకున్న డబ్బులు ఒక ఉద్యోగి కైంకర్యం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. సుకన్య సమృద్ధి యోజన పథకం, ఆర్. డి( రికరింగ్ డిపాజిట్), పి.ఎల్.ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) (టీ.డీ)టర్మ్ డిపాజిట్ , సీనియర్ సిటిజన్స్ , ఇతర పథకాలు పేరుతో వచ్చిన డబ్బులను కొంతమంది ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించి ప్రజల నెత్తిన నిప్పులు పోశారు. పాస్‌పుస్తకాలలో ప్రభుత్వ ముద్ర ఉన్నంతవరకే ప్రభుత్వ గ్యారెంటీ లేని వాటికి ప్రజలకు ఒక్క రూపాయి కూడా తిరిగి రాదు. కొంతమంది దొంగ తపాలా ఉద్యోగుల స్వార్థ బుద్ధితో ప్రజలు దాచుకున్న డబ్బులను తపాలశాఖకు జమ చేయకుండా వారు రియల్ ఎస్టేట్ స్టేట్ వ్యాపారం, ఇతర అవసరాలకు వినియో గించుకుని ప్రజల నెత్తిన శటగోపం పెట్టారు. ఈ సమస్య ప్రస్తుతానికే వచ్చినది కాదు. పోస్టల్ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి కూడా జరుగుతున్న సంఘటనలో కోకొల్లలు. అవినీతికి పాల్పడిన సిబ్బందిని మరల పోస్టింగ్ ఇవ్వడం, కఠినమైన శిక్షలు లేకపోవడంవలన వారి చేతివాటానికి ఎదురులేకుండా పోయింది. వారు దోచుకున్న డబ్బులలో కొంత మొత్తం పోస్టల్ ఉన్నతాధికారులకు లంచం ఇస్తే చాలు వారు కొన్ని నెలల తర్వాత ప్రజల్లో డబ్బులు దోచుకున్న దొంగ ఉద్యోగులకు మరలా పోస్టింగ్ ఇస్తారు. గ్రామీణ ప్రాంతాలలో పోస్ట్ ఆఫీస్‌లో ఆన్లైన్ లేకపోవడం మాన్యువల్‌గా ఖాతా పుస్తకాలలో పెన్నుతో రాయడం ఇంకా కొన సాగుతూనే ఉంది. ప్రైవేటు బ్యాంకులు కూడా ఆన్లైన్లో పనిచేస్తుంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న తపాలా శాఖ మాత్రం ఇంకా గ్రామీణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పూర్తిగా కాలేదు. సిబ్బంది బదిలీ అయి, మరో ఉద్యోగి వచ్చినప్పుడు ఈ స్కాములు బయటపడుతున్నాయి. మీ ఖాతాలో గత ఏడాది, రెండేళ్ల నుంచి బకాయిలు ఉన్నాయని వారు చెప్పడంతో ఖాతాదారులు ఒక్కసారిగా కంగుతింటున్నారు. ఇదేమిటి తాము ప్రతి నెల జమ చేస్తూనే ఉన్నామని వారు చెప్తున్నారు. ఇదే విధంగా గుడివాడ పోస్టల్ డివిజన్ పరిధిలోని నూజివీడు సబ్ పోస్టఆఫీస్‌లో అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్ >>2

# సోలార్ వెలుగుల సర్కార్



శుక్రవారం టి.కొండూరులో సౌరవిద్యుత్ ప్రాజెక్టును జ్యోతి నప్రజ్వలనతో నప్రారంభిస్తున్న మంత్రి లోకేష్. చిత్రంలో మంత్రులు సవిత, గొట్టిపాటి

జీరో బడ్జెట్, నేచురల్ ఫార్మింగ్ చంద్రబాబు లక్ష్యం
క్లీన్ ఎనర్జీని ఎగుమతి చేస్తాం
సేంద్రియ సాగువైపు రైతుల అడుగులు
టి.కొండూరులో సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి లోకేష్

**జమ్మలమడుగు మే 22 ప్రభాతవార్త:** ఈరోజు కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3వేలకోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ రికార్డ్ టైమ్‌లో SAEL ప్రాజెక్ట్ పూర్తిఅయింది. ఇది స్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయం. మీ సహకారం వల్లనే ఈ ప్రాజెక్ట్ 11 నెలల్లో పూర్తి అయింది. రాష్ట్రం మొతం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈరోజు ఇతర నియోజకవర్గాల వాళ్ళు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికి ముఖ్యమైన మూడు కారణాలున్నాయి. అవి ఏంటంటే మొదటిది బ్రాండ్ సీబీఎన్. పెట్టుబడిదారులు ఇప్పుడు మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం? అని అడుగుతున్నారు. ఎందుకంటే, ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. >>2



## హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా

పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లింగ్ వాహనాలు ప్రారంభించిన హోంమంత్రి అనిత

**విశాఖపట్నం, మే 22 ప్రభాతవార్త:** హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా పథకంను ఏపి రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ప్రారం భించారు. విశాఖ నగర పోలీసు కమిషనరేట్ లో కార్యక్రమం నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో, నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రత కోసం దేశంలోనే తొలి వినూత్న సంక్షేమ కార్యక్రమంగా సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేశారు. విధి నిర్వహణలో హోంగార్డులు అధిక ఒత్తిడి, >>2

## సైకిల్‌పై మంత్రి నిమ్మల, పల్లా

'నో వెహికల్‌డే' సందర్భంగా 18 కి.మీ సైకిల్ తొక్కిన మంత్రి
పాలకొల్లు నుంచి విజయవాడకు రైల్లోనే..



శుక్రవారం నో వెహికల్ డే సందర్భంగా టిడిపి కేంద్ర కార్యాలయానికి ఒకే సైకిల్‌పై వెళ్తున్న మంత్రి నిమ్మల, పార్టీ అధ్యక్షుడు పల్లా

**విజయవాడ,మే 22,ప్రభాతవార్తప్రతినిధి:** 'నో వెహికల్‌డే' పిలుపును జలవనరుల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అంకిత భావంతో అనుసరిస్తున్నారు. 'నో వెహికల్‌డే' రెండో వారం సందర్భంగా శుక్రవారం పాలకొల్లు నుంచి విజయవాడ వరకు మంత్రి నిమ్మల రామానాయుడు రైలులో ప్రయాణించారు. అక్కడ నుంచి తానే కాకుండా టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సైకిల్‌పై ఎక్కించుకుని ఏకంగా తెలుగుదేశం కేంద్ర కార్యాలయం వరకు తొక్కారు. శుక్రవారం నర్సాపురం నుంచి విజయవాడకు వచ్చే రైలులో పాలకొల్లు స్టాప్‌లో ఎటువంటి ఆర్భాటం లేకుండా ఎక్కారు. ట్రైన్‌లో ఎటువంటి హంగామా లేకుండా సాధారణ ప్రయాణికులతో కలిసి విజయవాడకు మంత్రి చేరుకున్నారు. విజయవాడ శాటిలైట్ రామవరప్పాడు రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడ నుంచి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సైకిల్‌పై వెళ్లారు. >>2



## యుపిలో బస్సు ప్రమాదం

యాత్రకు వెళ్లిన నరసరావుపేట, చిలకలూరిపేట టీచర్స్ మిత్ర బృందం

బస్సు డ్రైవర్, గైడ్ మృతి
పలువురు టీచర్లకు గాయాలు

**నరసరావుపేట క్రైమ్,మే 22 ప్రభాతవార్త:** నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి యాత్రకు వెళ్లిన ఉపాధ్యాయులు, వారి మిత్రల బస్సు శుక్రవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నైమిశారణ్యం వద్ద ప్రమాదానికి గురయ్యింది. పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు ఆ బృందం ఈ పర్యటనకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, పర్యాటక గైడ్ మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న 50 మంది >>2



శుక్రవారం గోల్డ్‌మైన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

# ఇక బంగారం పంట

వచ్చేనెల జొన్నగిరి గోల్డ్‌మైన్ ప్రారంభం
ఈ యేడాది 600 కిలోలు, వచ్చే యేడాది 1,500 కిలోల ఉత్పత్తి
స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు: మంత్రి కొల్లు రవీంద్ర

**కర్నూలు, మే 22, ప్రభాతవార్త :** జొన్నగిరి గోల్డ్ మైన్ త్వరలో వాణిజ్య బంగారం ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను మంత్రి కొల్లు రవీంద్ర, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తున్న జొన్నగిరి బంగారు గనులలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో వచ్చే నెల నుంచే వాణిజ్య స్థాయిలో బంగారం ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశముందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతోందని, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఈఏడాది 600 కిలోల బంగారం, వచ్చే ఏడాది 1,500కిలోల బంగారం ఉత్పత్తిలక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. >>2

# 24 రాజ్యసభ సీట్లకు జూన్ 18న పోలింగ్

**న్యూఢిల్లీ, మే 22:** ఈఏడాది జూన్, జులైలో సభ్యుల పదవీ విరమణ కారణంగా 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు నిర్వహించే ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) శుక్రవారం ప్రకటించింది. ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాలప్రకారం, 10రాష్ట్రాల నుండి ఎన్నికైన 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం జూన్-జులైలో ముగియనుంది. జూన్ 1న ఎన్నికల నోటిఫికేషన్ల జారీ చేయనుండగా, నామినేషన్ల దాఖలుకు చివరితేదీగా జూన్ 8ని నిర్ణయించారు. నామినేషన్ల పరిశీలన జూన్ 9న జరుగుతుంది, అభ్యర్థులు తమ నామినేషన్లను జూన్ 11 వరకు ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉంటుంది. జూన్ 18న ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించబడుతుంది, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ 20నాటికి పూర్తి కావాల్సి ఉంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షిస్తామని కూడా ఇసి తెలిపింది. ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల లోని స్థానాలకు వర్తిస్తాయి. పదవీకాలం ముగియనున్న ప్రముఖ నాయకులలో మధ్యప్రదేశ్ నుండి దిగ్విజయ్ సింగ్, కర్ణాటక నుండి హెచ్.డి. దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే ఉన్నారు. ఆగస్టు 4, 2025 నుంచి ఖాళీగా ఉన్న జార్ఖండ్ నుంచి దివంగత శిబు సొరెన్‌కు చెందిన స్థానానికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అయోధ్య రామిరెడ్డి, పరిమళ నత్వానీ, సానా సతీష్, పిల్లి సుభాష్‌చంద్ర బోస్, రాంభాయ్ హర్జిభాయ్ మొకారియా, జార్జ్ కురియన్, మహారాజా సనజౌబా లీషెంబా, వాన్‌వీరోయ్ ఖర్లుఖీ, నీరజ్ డాంగి, రాజేంద్ర గెహ్లాట్, నబం రెబియా, ఈరన్నా కడాడి, మరియు కె. వనలాల్వేనా, ఇతర సభ్యులు పదవీ విరమణ చేస్తున్నారు.



శుక్రవారం పాలకొల్లు నుంచి విజయవాడకు రైలులో వెళుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు



మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి లోకేష్

# సోలార్ వెలుగుల సర్కార్

>> రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజి నెస్. మేము స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను నమ్ముతాం. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ అందుకు నిదర్శనం. ప్రాజెక్ట్ భూమిపూజ నుండి ప్రారంభోత్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయింది. మూడవది !! డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైంది. పంజాబ్ లీడర్ షిప్ నెట్వర్క్ త్యంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు నిర్వహించగలదా? అనే ప్రశ్న నాలో మెదిలింది. SAEL బృందం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుని, నన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం నా ప్రశ్నకు జవాబు దొరికింది. SAEL బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో గ్రామ స్థలు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసింది. ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కుదిరిన 25ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, సేల్ కోఫౌండర్ డైరెక్టర్ సుఖ్ భీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

**రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాలి:** రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలం పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో సంభాషించారు.

పెనికలపాడుకు చెందిన రైతు ద్వారకానాథ రెడ్డి, ఆయన సోదరుడు రమణారెడ్డిలు గత ఐదేళ్లుగా తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. పంటలు, పశుపోషణ, కోళ్లు, చేపల పెంపకం వంటి వాటిని ఒకదానికొకటి అనుసంధానం చేసి సమీకృత సేంద్రీయ సాగు చేస్తూ స్థిరమైన ఆదాయం అర్జిస్తున్నారు. తమ పొలంలో మామిడి, బత్తాయి, ఉసిరి, కొబ్బరి, చిన్న నిమ్మ, నేరేడు, జామ, మునగ, రామాఫలం, సీతాఫలం పంటల సాగుతో పాటు 250 వరకు నాటుకోళ్ల పెంపకం, 60వరకు పొట్టేళ్లు, చేపల సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి సంభాషించారు.

# ఇక బంగారం పంట

>> జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు. ప్రస్తుతం సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు మైనింగ్ విస్తరించే అవకాశం ఉందన్నారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. రాష్ట్రానికి అవసరమైన బంగారంలో 50 నుంచి 60 శాతం వరకు జొన్నగిరి ప్రాజెక్ట్ ద్వారానే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా బంగారం దిగుమతుల భారం తగ్గి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చన్నారు. జొన్నగిరిని దేశంలోని "గోల్డ్ హబ్"గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. క్వార్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో సరైన ప్రోత్సాహం లేకపోవడంతో జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని తెలిపారు. ఇప్పటికే 300 నుంచి 400 మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం ఉపాధి కోసం వలస వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు గోల్డ్ మైన్ కారణంగా స్థానికంగానే ఉపాధి లభిస్తోందన్నారు. భూసేకరణలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని, గ్రామసభ ఆమోదం తప్పనిసరిగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పర్యావరణ నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయని, దాంతో మరింత పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగిని, డీఎస్పీ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## యుపిలో బస్సు ప్రమాదం

>> ఉపాధ్యాయులు వారి మిత్ర బృందం చిన్న గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఈనెల 20వ తేదీన హైదరాబాద్ నుంచి విమానంలో లక్నో కి చేరుకున్న ఉపాధ్యాయ బృందం శుక్రవారం నైమిశారణ్యం చూసుకున్నారు. అక్కడి నుంచి వారి బస్సు అయోధ్య వెళ్లే సమయంలో ప్రమాదానికి గురి అయ్యింది. యాత్రలకు బయలుదేరిన బృందం లక్నో, నైమిశారణ్యం, అయోధ్య చూసుకొని నేపాల్ వెళ్లాల్సి ఉంది. కాగా ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్ప గాయాలు మినహా, అందరూ సురక్షితం గానే ఉన్నారని మిత్ర బృందంలోని కే.కోటేశ్వరరావు సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. ఉపాధ్యాయ బృందంలోని కుటుంబ సభ్యులు ఎవరు ఆందోళన చెందవద్దని చెప్పారు. దీంతో ఆ బస్సులో ప్రయాణిస్తున్న వారి కుటుంబసభ్యులు, మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అక్కడి ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రమాదానికి గురైన బస్సును భారీక్రేన్లతో బయటకు తీశారు. క్షతగాత్రులైన ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ప్రాథమిక వైద్య సేవలను అందజేశారు. ప్రమాదంలో బస్సు పూర్తిగా దెబ్బతింది.

# పోస్టాఫీసులో కుచ్చు'టోపీ'

>> రాజా రూ. 48 లక్షలు ప్రజల సొమ్మును ప్రజల ఖాతాకు జమ చేయకుండా స్వాహా చేశాడు. ఇటీవల నూజివీడు పోస్ట్ ఆఫీస్ కు పోలీసులు వచ్చి అతన్ని అరెస్టు చేయగా ఈ విషయం వెలుగులోనికి వచ్చింది. కుమార్ రాజా అనే ఉద్యోగి జి.డి.ఎస్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బి .పి.ఎం) గా నందివాడ మండలం నందివాడ గ్రామంలో పనిచేస్తూ ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టాడు. ప్రజల సొమ్ము స్వాహా చేసిన ఈ గజదొంగకు పోస్టల్ ఉన్నత అధికారులు నూజివీడులో పదోన్నతి కూడా కల్పించారు. బి. పి.ఎం స్థాయి నుంచి పోస్టల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించారు. భారీ స్థాయిలో ప్రజల డబ్బులు స్వాహా చేసిన నిందితునికి నూజివీడులో పోస్టింగ్ ఎలా ఇచ్చారనేది ఉన్నతాధికారులు విచారణలో తేలాల్సి ఉంది. నూజివీడు పట్టణంలో కూడా పలువురు ఖాతాదారులకు సంబంధించిన ఆర్ డి పి ఎల్ ఐ, ఇతర ఖాతాలో డబ్బులు కూడా కైంకర్యం జరిగి ఉంటాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్యోగి నూజివీడులో కూడా పనిచేయడంతో నూజివీడు తపాలా కార్యాలయంలో గత నాలుగు నెలల నుంచి జమ చేసిన ప్రజలు ఖాతాలను చెక్ చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిందితుడు పై కఠిన చర్యలు తీసుకుని ప్రజల సొమ్మును తిరిగి ఇప్పించాలని, పోస్టల్ అధికారులు దీనికి బాధ్యత వహించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. గతంలో కూడా రెడ్డిగూడెం, మర్సపూడి, పల్లెర్లమూడీ , చాట్రాయి మండలం, పరిసర ప్రాంతాల్లో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. ఇప్పటికి వాటికి సంబంధించిన రికవరీని అధికారులు చేయలేకపోయారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మెయిల్ వర్సెల్, ఏడాదికి ఒకసారి పోస్టల్ ఏ ఎస్ పి, కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి అయినా పోస్టల్ ఎస్పి గ్రామాలలో ఉన్న ప్రతి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ను సమగ్రంగా తనిఖీలు చేయవలసి ఉన్నది. ఆయా గ్రామాలలో ఉన్న పోస్టల్ ఖాతాలన్నిటిని పరిశీలించి, ప్రజలు జమ చేసిన డబ్బులు పోస్టల్ ఖాతాకు జమ చేస్తున్నది లేనిది పరిశీలించాలి, కానీ అవినీతి అధికారులు సక్రమంగా తనిఖీలు చేయకుండా ఉండటం వలన ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. కొంతమంది అధికారులు గ్రామస్థాయి పోస్ట్ ఆఫీస్ సిబ్బంది వద్ద ముడుపులు తీసుకుని సక్రమంగా తనిఖీలు చేయడం లేదని ఆరోపణ వ్యక్తం అవుతున్నాయి. పోస్ట్మాస్టర్ జనరల్, జిల్లా కలెక్టర్లు స్పందించి సమగ్రంగా విచారణ జరపాలని ఖాతాదారులు కోరుతున్నారు.

**పోస్టల్ ఎస్పీ వివరణ:** ఈ సంఘటనపై గుడివాడ డివిజన్ పరిధి పోస్టల్ ఎస్పీ కృష్ణమూర్తి వివరణ ఇస్తూ జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ తరపున తాము కూడా విచారణ చేస్తున్నామన్నారు.

# హోం గార్డులకు సమగ్ర ఆరోగ్య బీమా

>> ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్నారు. అయితే తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వారి కుటుంబాలు అధిక వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ లోటును పూరించేందుకు విశాఖ నగర పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఈ ఆరోగ్య బీమా పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా ప్రతి హోం గార్డ్ కుటుంబానికి రూ 3 లక్షల బేస్ పాలసీతో పాటు రూ 30 లక్షల టాప్‌అప్ కవరేజ్ అదనంగా రూ 3 లక్షల కాంప్లిమెంటరీ కవరేజ్ కల్పించబడుతోంది. మొత్తం రూ 33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందించబడుతుంది. ఒక్క కుటుంబానికి సంవత్సరానికి గరిష్ఠంగా రూ 10,264 ప్రీమియం ఉండగా, మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రీమియాన్ని పోలీస్ సంక్షేమ నిధి ద్వారా చెల్లించడం జరిగింది. ఈ పథకం ద్వారా మొత్తం 975 కుటుంబాలకు బీమా కల్పించబడగా, సుమారు 3,144 మంది లబ్ధి పొందనున్నారు. ఇందుకోసం సంక్షేమ నిధినుండి రూ 87,97,809 వెచ్చించారు. ఈ పథకానికి సంబంధించి 24 గంటల ప్రత్యేక హెల్ప్‌లైన్, నగదురహిత చికిత్స సదుపాయం, ఆరోగ్య కార్డుల డేటాబేస్ నిర్వహణ, బీమా సంస్థలు ఆసుపత్రులతో సమన్వయం వంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉంచారు. ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్: 7995093606, ఈ మెయిల్: health4police!!gmail. ఈ కార్యక్రమం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత హోం గార్డులు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా పాలసీ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీ తో పాటుగా నగర పోలీసు ఉన్నతాధికారులు, హోం గార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అదే విధముగా దివీస్ యాజమాన్యం (సి ఎస్ ఆర్) కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విశాఖ నగర పోలీసు శాఖకు ఎమర్జెన్సీ హ్యాండ్లిగ్ నిమిత్తం రూపాయలు 19,92,130/ విలువ గల రెండు ఎల్.ఎం.వి ( బోలేరో నియో) వాహనాలను శుక్రవారం మంత్రి నగర పోలీసుశాఖకు అందజేశారు.

# ఎండ నిప్పులు

>> వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పచ్చదనం పెంపుపై దృష్టి:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని, తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇండో-సైప్రస్ వ్యూహాత్మక దౌత్యం

>> జరిపారు. తర్వాత జరిగిన సంయుక్త మీడియా సంక్షిప్తీకరణలో ప్రధాని మాట్లాడుతూ, ఈ నూతన నిర్ణయం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు సరికొత్త ఉత్సాహాన్ని, స్పష్టమైన గమనాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతసైప్రస్ బంధం కాల పరీక్షకు నిలబడిందని, దశాబ్ద కాలంలో సైప్రస్ నుండి భారతదేశానికి వచ్చే పెట్టుబడులు దాదాపు రెండు రెట్లు పెరిగాయని ప్రధాని మోడీ వెల్లడించారు. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రెండు దేశాలకు అనేక కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ఆయన అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఇరు దేశాల మధ్య పెట్టుబడులను మరోసారి రెట్టింపు చేయాలనే అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ప్రధాని ఉద్ఘాటించారు. రక్షణ, డిజిటల్ రంగాల్లో అవగాహన ఒప్పందాలు ఈ ఉన్నత ఆశయాలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి ఇరు దేశాలు పలు కీలక రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చు కున్నాయి. ముఖ్యంగా డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్స్, సరికొత్త పరిశోధనా కేంద్రాల ఏర్పాటులో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. వీటితో పాటు విద్యాసంస్థల మధ్య సంస్థాగత భాగస్వామ్యాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు.

ఇరు దేశాల మధ్య తరలివెళ్లే ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం సమగ్ర వలస రవాణా ఒప్పందంతో పాటు సామాజిక భద్రతా ఒప్పందాన్ని తీసుకురావడానికి ఇరు దేశాలు ఏకీభవించాయి. తూర్పు మధ్యధరా ప్రాంతంలో సైప్రస్ భౌగోళిక స్థానం అత్యంత కీలకమని మోడీ గుర్తుచేసారు. సరిహద్దు ఉగ్రవాద బెదిరింపులు, రాడికలైజేషన్, సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉగ్రవాద నిరోధకతపై ఒక ఉమ్మడి కార్యనిర్వాహక బృందాన్ని అధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, సముద్ర భద్రత, ఉగ్రవాద నిర్మూలన రంగాలలో సహకారాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధత, అన్ని దేశాల సార్వభౌమత్వం మరియు ప్రాదేశిక సమగ్రతను గౌరవించడమే ఈ భాగస్వామ్యానికి ప్రధాన సూత్రాలని మోడీ వివరించారు. ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంలో విదేశాంగ మంత్రి కాన్స్టాంటినోస్ కొంబోస్, రవాణా మంత్రి అలెక్సిస్ వాఫియాడెస్ సహా భారత్ వచ్చిన అధ్యక్షుడు క్రిస్టోడౌలిడ్స్ పర్యటన మహారాష్ట్రలో ప్రారంభమైంది. ముంబైలో ఆయనకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ జరిగిన బిజినెస్ మీట్‌లో గ్లోబల్ షిప్పింగ్, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లోని భారీ పెట్టుబడి అవకాశాలను భారతీయ పారిశ్రామిక ప్రముఖుల ముందు సైప్రస్ ప్రతినిధులు ప్రవేశపెట్టారు. తర్వాత ఢిల్లీ చేరుకున్న సైప్రస్ అధ్యక్షుడికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక స్వాగతం పలికి, ఆయన గౌరవార్థం అధికారిక విందును ఏర్పాటు చేశారు.

## సమాచార చట్టహక్కు పరిధిలో దేవాలయాలు, వక్ఫ్ సంస్థలు, మసీదులు, చర్చిలు

**విజయవాడ,మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని దేవాలయాలు, వక్ఫ్ సంస్థలు, మసీదులు, చర్చిలు వంటి మతపరమైన సంస్థలు సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం2005 పరిధిలోకి వస్తాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ, ఆర్థిక సహాయం పొందుతున్న ఈ సంస్థలు చట్టప్రకారం కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు అందించడానికి కట్టుబడి ఉండాలని కమిషన్ అంది. ఈ మేరకు చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు నేతృత్వంలోని బెంచ్ కీలక ఆదేశాలు జారీ చేసింది. విశాఖపట్నంకు చెందిన సమాజసేవకుడు కె.ఎస్.ఎన్. పట్నాయక్ బురుజుపేటలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి సంబంధించి 2012లో నిర్వహించిన ఉత్సవాల వివరాలను కోరుతూ ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేశాడు. దేవాలయాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఉటంకిస్తూ ఆలయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పిఐఓ) సమాచారం ఇచ్చేందుకు నిరాకరించాడు. దీనిపై రాష్ట్ర సమాచార కమిషన్‌ను పట్నాయక్ తాజాగా విచారణ జరిపారు. విచారణ అనంతరం తీర్పును వెలువరించారు.

# సైకిల్‌పై మంత్రి నిమ్మల, పల్లా

>> వరుసగా రెండో వారం కూడా నో వెహికల్ డే సందర్భంగా సుమారు 18 కిలోమీటర్ల మేర మంత్రి నిమ్మల సైకిల్ తొక్కారు. తాడేపల్లి దగ్గరలో నిమ్మలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఒకే సైకిల్‌పై ఇద్దరూ కూడా పార్టీ కార్యాలయానికి వెళ్లారు.

**జగన్ పిచ్చి తుగ్లక్: మంత్రి నిమ్మల**

జగన్ ఒక పిచ్చి తుగ్లక్ అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అసమర్థ పాలకునిగా ప్రజలు గుర్తించినందునే జగన్‌ను అధికారం నుంచి దించారన్నారు. ఆయన పార్టీని 11 సీట్లకే పరిమితం చేసారన్నారు. జగన్ మావిగన్ అంటే కూటమి భయపడటం లేదనిన్నారు. ప్రజలే భయపడుతున్నారని తెలిపారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలు జగన్‌కు అలవాటన్నారు. అమరావతిలో జరుగుతున్న పనులు చూసి వైసీపీ అధినేతకు భయం మొదలైందని అందుకే అమరావతిపై విషం కక్కుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ మళ్లీ సీఎం అయితే పొట్టేలు తలల స్థానంలో ప్రజల తలలు నరుకుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రెండేళ్ళలో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు దూరంగా కార్యచరణకు ప్రాధ్యానతను ఇచ్చి సాగిస్తున్న ప్రగతిని చూసి జగన్ ఈర్ష్యపడుతున్నారన్నారు.

## పవన్, నాదెండ్లపై వ్యాఖ్యలు ఉపసంహరించుకున్న ప్రొ.నాగేశ్వర్

**విజయవాడ,మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌పై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రకటించారు. తనకు తప్పుడు సమాచారం ఇచ్చారని, దానిని క్రాస్ చెక్ చేసుకోకుండా అలా మాట్లాడకుండా ఉండాల్సింది కాదని నాగేశ్వర్ వెల్లడించారు. ఈ చర్చకు ఇంతటితో ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. పవన్ కళ్యాణ్, నాదెండ్లపై ఇటీవల ఒక ప్రసార మాధ్యమంలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయనపై ఏపీ,టీజీల్లో జనసేన నేతలు కేసులు నమోదు చేసారు. ఈ క్రమంలో నాగేశ్వర్‌పై కేసులు పెట్టడాన్ని సీపీఎం, సీపీఐ నేతలతో సహా పలు ప్రజాసంఘాల నేతలు ఖండించారు. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ స్వయంగా జోక్యం చేసుకుని నాగేశ్వర్‌పై ఆయా స్టేషన్లలో కేసులు పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేసారంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ పై వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నట్లు ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రకటించారు. దాంతో జనసేన ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం.

## ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ నిరాకరణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త:** సాక్షుల బెదిరింపు కేసులో ఎమ్మెల్సీ అనంతబాబుకు జిల్లా కోర్టు బెయిల్ నిరాకరించింది. ఎమ్మెల్సీ అనంత బాబు తన కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను బెరించారంటూ కాకినాడ పోలీసులు కేసు నమోదు చేసి సుప్రీం కోర్టు ఇచ్చిన బెయిల్ పై తిరుగుతున్న అనంతబాబును అరెస్ట్ చేశారు. ఈ కేసులో రాజమండ్రి బెయిల్ నిరాకరించింది. అలాగే డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో జరుగుతున్న సాక్షుల విచారణలో బాగంగా శుక్రవారం న్యాయమూర్తి మరో ఇద్దరు సాక్షులను విచారించారు. సుబ్రహ్మణ్యం స్నేహితులు ఆరవ మణికంత, అరవ ప్రసాద్ వాంగ్మూలం నమోదు చేశారు.

పిటి వారంట్‌పై కోర్టుకు హాజరైన అనంతబాబు సాక్షులను బెదిరించిన కేసులో బెయిల్ పిటిషన్ ఇవ్వాలని దాఖలు చేశారు. ఈ బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి కొట్టివేశారు. ఇంటిభోజనం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని వేడుకోగా తిరస్కరిం చారు. తదుపరి విచారణ సోమవారం జరగనున్నదని పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు తెలిపారు.

## వచ్చే నెలలో సింగపూర్ పర్యటనకు చంద్రబాబు, లోకేష్

**విజయవాడ,మే 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సింగపూర్‌లో పర్యటించనున్నారు. జూన్ నెల 14 నుంచి 16 మధ్య పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడి ప్రభుత్వ ఆహ్వానం మేరకు' వరల్డ్ సిటీస్ సమ్మేళనం'లో పాల్గొననున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా చంద్రబాబు, లోకేశ్ పర్యటన కొనసాగనుంది. పలువురు పారిశ్రామికవేత్తలతో వీరు భేటీ కానున్నారు. పలువురు ఉన్నతాధికారులు కూడా సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు.

### వారం - వర్జ్యం

23-05-2026, అధికజ్యేష్ఠ శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
అష్టమి తె.4.28
మఖ రా.2.11
వర్జ్యం : మ.2.11-మ.3.47
దు.తె.5.34-ఉ.7.14
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం:** పోటీ పరీక్షలు, విదేశీయానం, ఉద్యోగం వంటి విషయాలు కుటుంబానికి కలిసి వస్తాయి. స్వల్పధనలాభం.

**వృషభం:** సంతాన పురోగతి బాగుంటుంది, మీరు సుఖపడక పోయినా మీ కృషి వల్ల మీ వాళ్ళు సౌఖ్యంగా వుంటారు.

**మిథునం:** హడావుడిగా నిర్ణయాలు చేయాల్సి వస్తుంది. కృషి వ్యర్థం కాదన్న సంగతి కొన్ని సంఘటనలు ఋజువు చేస్తాయి.

**కర్కాటకం:** శుభకార్యాల విషయంలో మీ నిర్ణయాలు చర్చనీయాంశమవుతాయి. పూర్వపు మిత్రులను కలుసుకుంటారు.

**సింహం:** ముఖ్య ప్రయాణాలు మీకు మీరుగా వాయిదా వేస్తారు. విలువైన కొనుగోళ్ళకు సంబంధించి నిర్ణయాలు చేస్తారు.

**కన్య :** భాగస్వాముల తెలివితక్కువ నిర్ణయాల వల్ల కొన్ని అవకాశాలు మీకు ఇష్టం లేనివారికి దక్కుతాయి. వస్త్ర లాభం.

**తుల :** ప్రతి విషయంలోను జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకుంటారు. భద్రపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు.

**వృశ్చికం:** పెద్ద స్థాయిని గలిగిన వ్యక్తులు కూడా చిన్న చిన్న పనులను చేసికోవలసి వస్తుంది. వ్యాపారాలు ప్రోత్సాహకరం.

**ధనుస్సు:** పెట్టుబడి ఖర్చు, అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికలు ఉపయోగము అవుతాయి. ప్రయాణాలు జాగ్రత్త.

**మకరం :** మీరు చెబితేనే గాని, అభివృద్ధి విషయములు మీ కార్యాలయంలోని వారికి నీ తెలియవు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** కొంత మంది విదేశీ ద్రవ్యమును, విశేషముగా ఆర్జించగలరు. పేరు ప్రఖ్యాతలు అధిగమగును. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** గృహాలంకరణలకు ధనమును ఖర్చు చేస్తారు. శుభవార్తా శ్రవణం చేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరుమల సమాచారం



## టిటిడి చరిత్రలో తొలిసారిగా శ్రీవారి అభిషేక సేవలో

# సర్వదర్శన భక్తులకు దర్శనం

### రికార్డు స్థాయిలో 79 వేల మందికి దర్శనభాగ్యం

**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం వేకువజామున జరిపించే అత్యంత విశిష్టమైన, పవిత్రమైన అభిషేకంసేవ వీక్షణమే సామాన్యుడికి గగనం. జీవిత కాలం నిరీక్షించినా సామాన్యుడికి అభిషేకదర్శనం దుర్లభమే. అలాంటిది వేసవి సెలవుల్లో టిటిడి చరిత్రలో ఎరుగని రీతిలో శుక్రవారం వేకువజామున తిరుమల ఆలయంలో ఓవైపు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి అభిషేకం సేవ నిర్వహిస్తుండగా మరోవైపు సామాన్యభక్తులను సర్వదర్శనంలో అనుమతించి దర్శనం కల్పించడం జన్మధన్యమైందని భావిస్తున్నారు. తిరుమలలో కొనసాగుతున్న వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగినప్పటికీ సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టిటిడి అత్యంత సమర్థవంతంగా దర్శన ఏర్పాట్లు చేస్తోంది. స్వయంగా క్యూలైన్ల పర్యవేక్షణ, సౌకర్యాలపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆరా తీస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆయన శ్రీవారి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి టైమ్ మేనేజ్మెంట్, క్యూలైన్ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించడంతో దర్శనాల సంఖ్యలో గణనీయమైన వృద్ధి సాధ్యమైందన్నారు.

ప్రతిరోజూ సాధారణ దర్శనాలతో పాటు అదనంగా 15 వేల మందికి పైగా భక్తులకు శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామని వెల్లడించారు. ముఖ్యంగా శుక్రవారం జరిగిన శ్రీవారి అభిషేక సేవ సమయంలోనూ ఐదు వేల మంది సర్వదర్శన భక్తులకు దర్శనం కల్పించడం ద్వారా సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. సాధారణంగా గురువారం రోజు శ్రీవారికి నిర్వహించే వారపు కైంకర్యాల కారణంగా దర్శన సమయం తక్కువగా ఉన్నా కూడా తొలిసారి రికార్డు స్థాయిలో 79 వేల మందికి శ్రీవారి దర్శనం కల్పించడం టిటిడి అధికారుల సమన్వయానికి, పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రతి గంటకు క్యూలైన్ల పరిస్థితిని ఉన్నతాధికారులు సమీక్షిస్తూ, అవసరమైన నిర్ణయాలను తక్షణమే అమలు చేయడం వల్ల దర్శన ప్రక్రియ మరింత వేగవంతమైందన్నారు. వేసవి రద్దీ నిర్వహణలో టిటిడి విభాగాలతో పాటు విజిలెన్స్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయడం విశేష ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు, వైద్య సేవలు, క్యూలైన్లలో సౌకర్యాలు నిరంతరాయంగా అందించేలా అన్ని విభాగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని చెప్పారు. సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన దర్శనం కల్పించడమే టిటిడి ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం అధికార యంత్రాంగం అంకితభావంతో సేవలందిస్తోందని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తెలిపారు.

## భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాదాలు

### ● టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులతో తిరుమల కిటకిటలాడుతోంది. లక్షమందికిపైగా భక్తులు వెలుపల క్యూలైన్లలో, వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో ఉన్నారు. వీరందరికీ దర్శనం సంగతి దేవుడెరుగున్నట్లు మారినా నిరంతరాయంగా అల్పాహారం, అన్నప్రసాదాలు అందించేలా అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం తిరుమలలో అన్నప్రసాద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. పెరిగిన భక్తుల రద్దీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సమయానికి పాలు, మజ్జిగ, అల్పాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. అన్నప్రసాదాల పంపిణీ మరింత మెరుగ్గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా సేవలు అన్నప్రసాద కేంద్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. రోజుకు లక్ష మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ జరుగుతోందన్నారు. పాలు, మజ్జిగ కూడా టిటిడి, శ్రీవారి సేవకులు భారీ స్థాయిలో అందిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి వెల్లడించారు.

## టిటిడి విద్యాదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్టులలో ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కూడా ప్రధానం. బెంగళూరుకు చెందిన తరుణ్ గౌడ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు శుక్రవారం రూ.10,10,001 లక్షలు విరాళమిచ్చారు. తిరుమల అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిని అందజేశారు.

# 'పవర్'లో రాజీలేదు

### ● వేసవికాలం డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తాం ● మే 21న రికార్డు స్థాయిలో 288.9 మిలియన్ యూనిట్ల వినియోగం ● సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడి



**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్ర గ్రిడ్ మే 21న (గురువారం) రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 288.9 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని నమోదు చేసిందని వివరించారు. అదే రోజు పగటి సమయంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,016 మెగావాట్లు, సాయంత్రం గరిష్ట డిమాండ్ 12,474 మెగావాట్లుగా నమోదైందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ ఇప్పటివరకు నిర్వహించిన అత్యధిక లోడ్ ఇదే కావడం విశేషమని, ఇది ఒక మైలురాయిగా నిలిచిందని అయన తెలిపారు. ఈ అపూర్వమైన విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు ప్రధాన కారణాలు రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన వడగాలుల పరిస్థితులు, అధిక ఆర్ద్రత, పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యాయని ఆయన వివరించారు. ఎయిర్ కండిషనర్లు, శీతలీకరణ పరికరాలు (ఫ్రిడ్జ్‌లు), తాగునీటి సరఫరా వ్యవస్థలు, వ్యవసాయ పంప్ సెట్ల వినియోగం భారీగా పెరగడంతో అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని విజయానంద్ తెలిపారు.

విద్యుత్ అత్యధిక డిమాండ్ ఉన్నప్పటికీ ఎపి ట్రాన్స్‌కో. ఎపి జెన్‌కో విద్యుత్ పంపిణీ సంస్థల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అంతరాయం లేకుండా స్థిరమైన విద్యుత్ సరఫరాను కొనసాగించినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ముందస్తు ప్రణాళిక, 24 గంటల గ్రిడ్ పర్యవేక్షణ, సమర్థవంతమైన లోడ్ నిర్వహణ, అందుబాటులో ఉన్న విద్యుత్ వనరుల సద్వినియోగం వల్ల ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రజలు, వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన నిరంతరాయ విద్యుత్తును అందించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆకాంక్షలకనుగుణంగా పకడ్బందీ ముందస్తు ప్రణాళికతో అధికారులు, సిబ్బంది కృషితో ఈ మైలురాయిని అధిగమించామని ఆయన వివరించారు. తీవ్ర వేసవి కాలంలో ప్రజల సౌకర్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, అవసరమైనప్పుడు స్వల్పకాలిక మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదనపు విద్యుత్‌ను కూడా రాష్ట్ర విద్యుత్ సంస్థలు సమకూర్చమని, ఈ ముందస్తు చర్యల వల్ల గ్రిడ్ స్థిరత్వం కొనసాగడమే కాకుండా, గరిష్ట డిమాండ్ సమయంలో కూడా గృహ వినియోగదారులు, రైతులు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించగలిగామని తెలిపారు. రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగ సంస్థల ముందస్తు సిద్ధత, నిర్వహణ సామర్థ్యం, సమన్వయ కృషి ప్రతిఫలించాయని, ఇంజనీర్లు, ఫీల్డ్ సిబ్బంది, సిస్టమ్ ఆపరేటర్లు, నిర్వహణ బృందాలు వడగాలుల పరిస్థితుల్లో ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు రాత్రింబవళ్లు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరంతరాయ విద్యుత్ సరఫరాను కొనసాగిస్తూ చారిత్రాత్మక డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించిన ఎపిట్రాన్స్‌కో, ఎపి జెన్‌కో, డిస్కమ్‌ల సిబ్బందిని ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా సురక్షితమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు గ్రిడ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వ్యవస్థ విశ్వసనీయతను కొనసాగించడం కోసం అవసరమైన అన్ని ముందస్తు చర్యలు నిరంతరం తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు.

## అభినయ్ దర్శన్ వ్యవహారంలో కుట్ర కోణం



**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అభినయ్ దర్శన్ వ్యవహారంలో విచారణ జరుగుతోందని, ఇందులో కుట్ర కోణం దాగి ఉందనే అనుమానం ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేసారు. ఒక పథకం ప్రకారమే ఈ నేరపూరిత కార్యకాలపం నిర్వహించారన్నారు. క్రైస్తవ మత ప్రచారకుడు, నటుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై హోం మంత్రి అనిత తీవ్రంగానే స్పందించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ఈ వ్యవహారంలో రాజకీయ కోణంపైనా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుట్రకోణం లేకపోతే కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను అభినయ్ దర్శన్ నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని.. ఆయనపై దాడి జరగకపోయినా జరిగిందని నమ్మించా రన్నారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో ఎవరు ఉన్నా రనేది త్వరలో బయటపడు తుందని తెలిపారు. దర్శన్‌పై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేశారని హోంమంత్రి వెల్లడించారు. ప్రభుత్వాన్ని బదనాం చేసే దృక్పథం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు చెల్లవని, ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే మానుకోవాలని హితవుపలికారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభినయ్ దర్శన్‌ను కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# రైతులకు అండగా విజ్ఞాన్ వర్సిటీ

### ● వాతావరణ సమాచారాన్ని క్షేత్రస్థాయిలోనే అందించేందుకు ఐఎండితో కీలక ఒప్పందం

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు విజ్ఞాన్ యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక, కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని పొలం స్థాయిలోనే రైతులకు అందించేందుకు భారత వాతావరణ శాఖ (ఐఎండి)తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలను ఢిల్లీలో విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వి. కృష్ణ కిషోర్, ఐఎండి కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ మార్చుకు న్నారు. ఈ ఒప్పందం ప్రకారం, ఐఎండి తమ వద్ద ఉన్న అత్యంత కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని 12 కిలోమీటర్ల పరిధిలో ఎపిఐల ద్వారా విజ్ఞాన్ యూనివర్సిటీకి అందిస్తుంది. ఈ డేటాను విశ్లేషించి, పంటల ప్రణాళిక, నీటిపారుదల యాజమాన్యం, పురుగు మందుల వాడకం, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకోవడం వంటి అంశాలపై విజ్ఞాన్ రైతులకు నిర్దిష్ట సలహాలు, సూచనలు అందిస్తుంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 16 నుండి 22/26-27 తేది: 19.05.2026
మార్కాపురం జిల్లా నందు చిన్న నీటి పారుదల చెరువులకు అవసరమైన అభివృద్ధి పనుల కొరకు O&M గ్రాంట్ క్రింద మార్కాపురం నియోజకవర్గంలో 7 పనులకుగాను అంచనా విలువ: రూ.25.00 లక్షలకు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లను దాఖలు చేయుటకు తేది: 22.05.2026. ఉ.11.00గం.ల నుండి 04.06.2026. సా.5.00గం.ల వరకు. తదుపరి వివరాలను www.tender.apeprocurement.gov.in లో పొందగలరు. ఫోన్ నెం. 9110555102.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీర్, ప్రత్యేక విభాగం (నీటి పారుదల), మార్కాపురం.
DIPR.NO. 20429/CL/ADVT/1/1/2022-23 తేది: 22.05.2026



పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank ...the name you can BANK upon!
జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004.
ఫోన్: 040-24475118 ఈ-మెయిల్: zohydsec@pnb.co.in
దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ వద్ద దాని శాఖలు/కార్యాలయాల వద్ద AMC ద్వారా CCTV సిస్టమ్ యొక్క నిర్వహణ, సరఫరా, స్థాపన, టెస్టింగ్ & కమిషనింగ్ (SITC) కొరకు SIs యొక్క జాబితా కొరకు టెండర్.
పంజాబ్ నేషనల్ బ్యాంకు, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ క్రింద శాఖలు/కార్యాలయాలలో ప్రస్తుతం ఉన్న మరియు కొత్త CCTV సిస్టమ్ లు నెలకొల్పడానికి CCTV సిస్టమ్ యొక్క నిర్వహణ మరియు SITC కు SIs యొక్క జాబితా కొరకు అర్హులైన SIs నుండి సీల్డ్ దరఖాస్తులు కోరబడుచున్నవి. OEM లు మరియు వారి CCTV ఉపకరణాలు ఇప్పటికే బ్యాంకుచే జాబితా చేర్చబడినవి (అనుబంధం VII గా జతపరచబడినది). పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రధాన కార్యాలయంచే ఇప్పటికే అధీకృత విక్రేత (SI) ఒరిజనల్ ఉపకరణాల ఉత్పత్తిదారుని యొక్క ధానల్ భాగస్వాములు (ఇకనుండి OEM లుగా పిలువబడతారు) M/s. సమృద్ధి ఆటోమేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (Sparsh) మరియు M/s. ఆదిత్య ఇన్ఫోటెక్ లిమిటెడ్ (CP Plus) వంటి సిస్టమ్స్ ఇంటిగ్రేటర్ లు (SIs) ఇప్పటికే జాబితాలో చేర్చబడినారు. అర్హత ప్రమాణం (అనుబంధం-I) నియమాలు మరియు నిబంధనలు (అనుబంధం-III) జాబితాలో చేర్చబడినది CCTV ఉపకరణ పీరియాలు, ఎంప్యానల్‌మెంట్ డాక్యుమెంట్‌లో పేర్కొనబడినవి.
ఆసక్తి గల SIs వారి దరఖాస్తు నిర్దేశిత ఫారంపై, నిర్దేశించబడిన డాక్యుమెంట్‌లతోసహా డిప్యూటీ జోనల్ మేనేజర్, పంజాబ్ నేషనల్ బ్యాంకు, జోనల్ ఆఫీస్ హైదరాబాద్, 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్-500004 వారికి 01-06-2026న సా. 16.00 గం. లేదా ముందు అందేటట్లుగా దాఖలు చేయవచ్చును. మా వెబ్‌సైట్ https://www.pnbindia.in నుండి టెండర్ డాక్యుమెంట్ లు డౌన్లోడ్ చేసుకోనవచ్చును.
తేదీ: 23-05-2026 ప్రదేశం: హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్



GOVERNMENT OF INDIA
(MINISTRY OF RAILWAYS)
(SOUTH CENTRAL RAILWAY)
**NOTIFICATION**
(under section 20A of Indian Railways Act, 1989)
Guntur, the 6th May, 2026

Rc.No.688/2026-J Date: 22-05-2026

S.O.2277(E) - In exercise of the power conferred by sub-section (1) of Section 20A of the Railways Act, 1989 (24 of 1989) (hereinafter referred to as the said Act), the Central Government after being satisfied thatthe land, the brief description of which is given in the schedule annexed hereto, is required for construction of Road Over Bridge in lieu of Level Crossing No.03 at Km 3/25-27 between Guntur and Namburin Guntur District of Andhra Pradesh, hereby declares its intention to acquire such land.

Any person interested in the said land may raise objection to the acquisition and use of such land for the aforesaid purpose under sub-section (1) of Section 20-(D)of the said Actwithin a period of thirty(30) days from the date of publication of this notification in the official gazette.

Every such objection, shall be made to the Competent Authority, namely Revenue Divisional Officer Guntur, Guntur District in writing and shall be set out the grounds thereof and the Competent Authority and **Revenue Divisional Officer, Guntur of Guntur District** shall give the objector an opportunity of being heard, either in person or by legal practitioner and may, after hearing all such objections and after making such further enquiry, if any as the Competent Authority thinks necessary, by order, either allow or disallow the objections.

Any order made by the Competent Authority under sub section (II) of section 20-(D) of the said act shall be final. The land plans and other details of the land under this notification are available and can be inspected by the interested persons at the aforesaid office of the competent authority.

**SCHEDULE**

Description of lands in acquisition: Construction of Road over Bridge in lieu of level Crossing No.03 at Km 3/25-27between Guntur and Nambur.
Name of the village : **Agathavarappadu**
Name of the Mandal : **Pedakakani in Guntur District of Andhra Pradesh**

| Sl. No. | Name of the Mandal | Name of the Village | Survey No. | Tentative Area (in Sqmts) | Tentative Area (in Acres) | Tentative Area (in Hectare) | Type of Land (Govt /Private) | Nature of land |
|---|---|---|---|---|---|---|---|---|
| Before Railway track moving towards GORANTLA Side | | | | | | | | |
| 1. | PEDAKAKANI | AGATHAVARAPPADU | 134 | 68.96 | 0.0170 | 0.0069 | Patta land | Dry |
| 2. | | | 141 | 998.85 | 0.2468 | 0.0999 | Patta land | Dry |
| 3. | | | 140-B | 1467.68 | 0.3627 | 0.1468 | Patta Land | Dry |
| 4. | | | 134 | 14.33 | 0.0035 | 0.0014 | Govt-land | Road |
| 5. | | | 136 | 284.55 | 0.0703 | 0.0285 | Patta Land | Dry |
| 6. | | | 137 | 126.81 | 0.0313 | 0.0127 | Patta Land | Dry |
| 7. | | | 138 | 943.12 | 0.2331 | 0.0943 | Govt-land | Path |
| 8. | | | 141 | 33.75 | 0.0083 | 0.0034 | Patta Land | Dry |
| Sub-Total (A) | | | | 3938.05 | 0.9731 | 0.3938 | | |
| After Railway track moving towards Gorantla Side | | | | | | | | |
| 9. | PEDAKAKANI | AGATHAVARAPPADU | 139-B | 60.79 | 0.0150 | 0.0061 | Govt-land | Tank |
| 10. | | | 140A | 1908.19 | 0.4715 | 0.1908 | Patta land | Dry |
| 11. | | | 139A | 459.44 | 0.1135 | 0.0459 | Govt-land | Tank |
| 12. | | | 82 | 2633.52 | 0.6508 | 0.2634 | Patta land | Dry |
| 13. | | | 81 | 469.98 | 0.1161 | 0.0470 | Patta land | Dry |
| 14. | | | 79 | 195.05 | 0.0482 | 0.0195 | Patta land | Dry |
| 15. | | | 80 | 1206.77 | 0.2982 | 0.1207 | Govt-land | Path |
| 16. | | | 45 | 52.89 | 0.0131 | 0.0053 | Inam | Dry |
| 17. | | | 46 | 692.71 | 0.1712 | 0.0693 | Patta land | Dry |
| 18. | | | 47 | 204.86 | 0.0506 | 0.0205 | Patta land | Dry |
| Sub-Total (B) | | | | 7884.2 | 1.94823 | 0.7884 | | |
| Total = A+B | | | | 11822.25 | 2.9213 | 1.1822 | | |

Place: Guntur
Date : 22-05-2026
Sd/- K. SRINIVASA RAO
Competent Authority (L.A) &
Revenue Divisional Officer - Guntur


# మైన్స్, ఎక్సైజ్ శాఖలను ప్రక్షాళన చేస్తున్నాం

### ● ఇసుక విధానం, క్వారీ నిధుల విషయంలో సమస్యలను పరిష్కరించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి ● ఎక్సైజ్, గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**అనంతపురం(కలెక్టరేట్), మే 22 ప్రభాతవార్త:** అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా గనులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో వేరువేరుగా మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, డిఆర్ఓ ఏ.మాలోల, మైన్స్ డిడి ఆదినారాయణ, శ్రీ సత్యసాయి జిల్లా డిఎంజివో షేక్ అమీర్ బాష, డివిజనల్ అధికారి ఓబుల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వరప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె.ఎస్.వి.ప్రసాద్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్ రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెం డెంట్లు రేవతి, నరసింహులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా గనులు శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోందని, జిల్లాలో సానుకూల ప్రజా దృక్పథం మరింత మెరుగుపడాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో, క్వారీ నిధుల విషయంలో అనుమతులకు సంబంధించి సమస్యలను పరిష్కరించి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఇసుకను కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలించకుండా అప్రమత్తంగా ఉంటూ గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వానాకాలంలో ఇబ్బంది లేకుండా అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ఇసుక రీచ్‌లను కూడా గుర్తించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలలో నమోద వుతున్న ఆదాయ వృద్ధి, నేరాల గుర్తింపు, అలాగే మద్యం దుకాణాలు మరియు బార్లలో జరుగుతున్న ఉల్లంఘనలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమగ్రంగా సమీక్షి ంచారు. తదనంతరం అక్కడే అర్బన్ ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్‌లతో కలిసి మంత్రి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉచిత ఇసుక విషయంలో మైనింగ్ అధికారులు పకడ్బందీగా ఉండాలనీ మైనింగ్ అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలనీ సూచించారు. నాటు సారా, మద్యం అక్రమ రవాణా, షాపుల టైమింగ్స్, ఎంఆర్‌పి విషయంలో అధికారులకు కీలక సూచనలు చేశారు. గత ప్రభుత్వంలో మైన్స్, ఎక్సైజ్ శాఖను భ్రష్టు పట్టించారనీ, ప్రస్తుత ప్రభుత్వం వాటన్నింటినీ ప్రక్షాళన చేస్తోందనీ అన్నారు. ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉచిత ఇసుక పాలసీ అమలుతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం లేకుండా ప్రజలకు నామ మాత్రపు రుసుముతో అందిస్తున్నామని తెలిపారు. 3 లక్షల టన్నులు ఇసుకను అనంతపురము జిల్లా లోని ప్రజలకు అందించామనీ, దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన 30 కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకుని ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామనీ అన్నారు. అక్రమాలకు తావులేకుండా కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీల ద్వారా పర్య వేక్షణ జరుగుతోంది అని అన్నారు. రామగిరి ప్రాంతంలో కూడా కొత్త గనుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామనీ తెలిపారు.





## 'వార్త' కథనంతో తిరుమలలో భక్తుల కష్టాలు వింటూ... అధికారుల పరుగులు

**తిరుమల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు... ఆపై ఏడుకొండలస్వామి మొక్కులు తీర్చుకునేందుకు అనూహ్యంగా భక్తులు తిరుమలకు రావడంతో కొండ కిటకిటలాడుతోంది. సామాన్యభక్తులను వెలుపల క్యూలైన్ల లోనికి కూడా 14గంటలు టిటిడి అనుమతించలేని పరిస్థితి మారింది. ఈ నేపథ్యంలో భక్తుల బాధలు చూసే వారేదీ శీర్షికతో శుక్రవారం 'వార్త' దినపత్రిక ప్రచురించింది. ఈ వార్తతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అధికారులతో కలసి ఆలయం వెలుపల వ్యాపించిన ఐదు కిలోమీటర్లలో భక్తుల బాధలు వినేందుకు కదిలారు. శుక్రవారం సాయంత్రం అధికారగణం తిరుమలలోని సామాన్యభక్తులు వేచిఉంటున్న క్యూలైన్ల తనిఖీ చేశారు.

**భక్తుల రద్దీ నిర్వహణకు పకడ్బందీ చర్యలు:** క్యూలైన్లు, ట్రాఫిక్, అన్న ప్రసాదాల పంపిణీపై సంయుక్త తనిఖీలు చేశారు. అధికారులు ఏకంగా కాలినడకన వెళ్తూ భక్తులతో స్వయంగా మాట్లాడి టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం క్యూలైన్లలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. క్యూలైన్లలో భక్తులను క్రమబద్ధంగా పంపిస్తూ తొక్కిసలాటలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చినట్లు చెప్పారు.

## కుట్రపూరిత ప్రచారాలపై కేసులు: జనసేన

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీపై కుట్రపూరిత ప్రచారాలపై న్యాయపరమైన కేసులు పెడతామని ఆ పార్టీ హెచ్చరించింది. ఈ మేరకు పార్టీ కేంద్రాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. రాజకీయాల పవిత్రతను భ్రష్టు పట్టించడానికి క్షుద్రశక్తులు కొందరు వృత్తిగా మార్చు కుంటున్నారని జనసేన పార్టీ పేర్కొంది. ముఖ్యంగా ప్రచార మాధ్యమాలలో ఉసరవెల్లులుగా మారుతున్నారు. జరిగింది జరగనట్టు.. జరగని దానిని జరిగినట్టు ప్రచారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలు ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకోలేనంతగా మసిపూసి మారేడుకాయలా చేస్తున్నారు. రాజకీయ వ్యవస్థకు, సమాజానికి చేటుగా ప్రమాదభరితంగా మారుతున్న ఇటువంటి ప్రచార కాలుష్యానికి అడ్డుకట్టవేయడానికి జనసేన సంకల్పించింది. దేశం, రాష్ట్రం, ప్రజల అభివృద్ధే పరమావధిగా పని చేసే జనసేన పార్టీ పైన, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మీదా, నాయకులపై ఎటువంటి అవాస్తవాలు, నిందారోపణలు చేసినా ఇకపై పోలీస్ కేసులు, న్యాయపరమైన చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నిర్ణయించింది. అవాస్తవాలు ప్రచారం చేసేవారు ఎవరైనా, ఎంతటి స్థాయిలో ఉన్నా సరే కేసులు ఎదుర్కొనక తప్పదు.

## కొలిక్కి వచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామి కిరీటం మాయం కేసు

**విజయవాడ మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా గుడివాడలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి కిరీటం మాయం వ్యవహారం కొలిక్కి వచ్చింది. తాకట్టు వ్యాపారి నుంచి కోటి రూపాయల స్వర్ణ కిరీటాన్ని దేవస్థానం కమిటీ సభ్యులు విడిపించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ్ మండపం ప్రాంగణంలో మీడియా ఎదుట ప్రదర్శించారు. కిరీటానికి సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరిస్తామని కమిటీ ఛైర్మన్ పోకూరి మోహన రావు తెలిపారు. కిరీటం తాకట్టు పెట్టలేదంటూ తొలుత కమిటీ సభ్యులు బుకాయించారు. మీడియా ఆధారాలు చూపించగా కిరీటం వ్యవహారం మా కుటుంబ సమస్య మీడియాకు సంబంధం లేదు అంటూ దౌర్జన్యానికి దిగారు. ఈ క్రమంలో వైశ్య సంఘాల పెద్ద జోక్యంతో వివాదం సద్దుమణిగింది. కల్యాణ మందిర నిర్మాణ నిధుల కోసమే కిరీటాన్ని తాకట్టు పెట్టినట్లు కమీటీ ఛైర్మన్ అంగీకరించారు. తప్పు జరిగిందని మన్నించాలని కోరారు. దాత కుటుంబంతో మాట్లాడి కిరీటం స్వామివారికి అలంకరిస్తామని చెప్పారు. జరిగిన తప్పును ఇక్కడితో వదిలేయాలని విజ్ఞప్తి చేశారు.

వార్త

పనిలేని వ్యక్తి తప్పకుండా దిగులు చెందుతాడు. కనుక క్షణం తీరిక లేని పనిలో మునిగిపోవడం అలవాటు కాకపోతే ఆ వ్యక్తి నిరాశ అనే సుడిగుండంలో పడిపోతాడు.

- జి.బి. షా

# నిప్పుల కొలిమి!

దేశమంతటా ఇప్పుడు చండ్ర నిప్పులు కురుస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతల ధాటికి తట్టుకోలేని జనం ఇళ్లకే పరిమితమైపోయారు. ఇంతవరకు ఈ సీజన్‌లో దేశంలోనే అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లోని బాందాజిల్లాలో 48.2 డిగ్రీల సెల్సియస్‌ల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు చేసుకోవడం విశేషం. గత ఐదు రోజులుగా ఇదే పరిస్థితి. దేశంలోని ఇది అత్యంత ఉష్ణోగ్రతగల ప్రాంతంగా గుర్తించారు. ఆ ప్రాంతంలో సాధారణ ఉష్ణోగ్రత కన్నా అధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు లెక్క. ఎండ తీవ్రతలకు తాళలేక మూగజీవులు కూడా చెట్లనీడకు చేరిపోతున్నాయి. గత రెండు రోజుల్లో వడదెబ్బకు ఒక్క తెలంగాణలోనే 13 మంది మృతి చెందారు. అత్యధిక పగటి ఉష్ణోగ్రతలతో ఉక్కపోతకు గురై వృద్ధులు, పిల్లలు కడుపులో ఉడుకుతో బాధపడ్డారు. ఈనెల 22ననిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో తె.రాష్ట్రంలో 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముంది. పలుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు, వడదెబ్బ తగిలిన వారికి తక్షణ వైద్యసదుపాయం అందించే ఏర్పాట్లో ప్రభుత్వాలు కల్పించుకున్నాయి. గత యేడాది ఇదే సీజన్‌తో పోల్చిచూస్తే 4 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో వాతావరణంలో వేడిమి బాగా పెరిగిపోతోంది. దేశంలో కొన్ని ప్రాంతాలు 'వేడిమి'గా మారడానికి కారణం చెట్లను నరికివేయడం, అక్రమ మైనింగ్. 1877 తర్వాత ఈ యేడాది అంతేస్థాయిలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగాఉందని వాతావరణ శాఖ వివరించింది. ఈ కారణం చేతనే ప్రపంచంలోని వేడిమి నగరాల జాబితాలో కనీసం 100 నగరాలున్నాయి. తెలుగు రాష్ట్రాలు అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్నాయి. ఇంతకు ముందు 45 డ్రీల సెలియస్ నుంచి 47 డిగ్రీల వరకు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే అదంతా మానవాళికి అనారోగ్యమేనని హెచ్చరికలున్నాయి. ఎండవేడిమి తట్టుకోలేనట్లుగా ఉంటుందని చర్మరోగాలు ఆవహిసానతయని, శరీరం లోపల ఊదర సంబంధ వ్యాధులకూ అవకాశముందని అప్రమత్తం చేశారు. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో గరిష్టంగా 48.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు ప్రాంతంలోని 'రెంట చింతల' లో యేటా అత్యధిక ఉష్ణోగ్రత నమోదౌతుందని మూడు, నాలుగు దశాబ్దాలుగా వాతావరణశాఖ అక్కడి రికార్డునే ప్రస్తావన తెస్తుంది.పాఠ్యాంశాల్లో కూడా రెంట చింతల,చిరపుంజి, అత్యధిక వర్షపాత ప్రాంతంగానూ పేర్కొంటున్నారు. అలాంటిది అదే రెంటచింతలకు మధ్య సుమారు 44 కిలో మీటర్ల లోపు దూరం ఉంటుంది. కాగా రెంట చింతల కన్నా పిడుగురాళ్లలో దేశంలోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గురువారం ఆంధ్రప్రదేశ్ లోని కనిగిరి అంతకుమించి 48.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు చవి చూసింది. మామూలుగా మధ్యాహ్నానికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వాతావరణ కేంద్రాల హెచ్చరికలను పాటించడంలో ఈసారి జనం కాస్త అప్ర మత్తంగా ఉన్నట్లే. వాతావరణ కేంద్రాల హెచ్చరికలకన్నా ఎక్కువస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భాలూ లేకపోలేదు. అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమో దవుతున్నాయి. తెలంగాణలో మంగళవారం నాడే జగి త్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 45.9డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతనమోదైంది. 'ఉత్తర తెలంగాణ జిల్లాలో వడగాల్పులు వీస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో గాలివాన బీభత్సంతో భారీ వృక్షాలు, పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలా అని పూర్తి స్థాయి మిశ్రమ వాతావరణంలా చెప్పలేం. కొన్ని చోట్ల మాత్రమే అకాల వర్షాలు.కానీ నష్టం కన్పిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో పలుజిల్లాలకు ఎండలతీవ్రతను అప్రమత్తం చేస్తూ వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీచేసింది. గురు,శుక్రవారాల్లో కొన్ని జిల్లాలో 45-47 డిగ్రీల ఉష్ణోగ్రతనమోదై ఉంటుందని హెచ్చరికలున్నాయి. అలాంటి ఉష్ణోగ్రత స్థాయి ఉన్నందునే ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రం లో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ కారు ఎండవేడిమికి ఇంజిన్‌లో మండలు చెలరేగిదగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. అధిక ఉష్ణోగ్రత, ఎండ వేడిమిల కారణంగా వడగాల్పులుతో చనిపోయిన వారిలో అత్యధికులు వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులే ఉన్నారు. అసంఘటిత కార్మికులు విధి నిర్వహణకు వెళ్లి వచ్చి నిస్త్రాణతో వాలిపోతున్నారు. కార్మికుల పరిస్థితి ఇదే. ఏమయితేనే ప్రస్తుత ఉష్ణోగ్రతలు తెలుగు రాష్ట్రాల్లో 48 డిగ్రీల కన్నా పైకి చేరాయి. ఈ యేడాది అసలే అత్యంత'వేడిమి' సంవత్సరంగా వాతావరణ శాఖముందే ప్రకటించింది.ప్రపంచ ఉష్ణోగ్రతలురెండు డిగ్రీల సెల్సియస్‌కు పెరిగితే ఎల్‌నినో స్థాయి నుంచి సూపర్‌ఎల్‌నినో స్థాయికి మారిపోయింది. జనంలో ఇదే పెద్ద గుబులు.బలూచిస్థాన్, రాజస్థాన్, ఎడారిమీదనుంచి వచ్చే వేడిగాలులు ఉత్తర,మధ్య భారత్‌లో వడగాడ్పులకు కారణమ వుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాలకు 'హీట్ వేవ్' హెచ్చరికలున్నాయి.అయితే అత్యధిక ఉష్ణోగ్రతలు 50డిగ్రీల వరకు ఉండే అవకాశముండ వచ్చుననే భయాందోళనలు కలుగుతున్నాయి. దాదాపు దేశమంతటా ఏదోఓరకమైన వాతావరణ హెచ్చరికలున్నాయి.ఎండలో బయటకు వచ్చే సమయంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి మంగేష్‌పూర్ అనే ప్రాంతం గతయేడాది 50డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలను చూసింది. అందుచే ఎండతీవ్రత నుంచి ఎవరికివారే తమను తామే కాపాడుకోవాల్సి ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

గౌరవం అన్నది పదవులు, హోదాలు పొందడంలో లేదు. పదవులు హోదాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది. అదే అసలైన హోదా.



అరిస్టాటిల్

ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు

### రైతులను ఆదుకోవాలి

దేశంలో రైతన్న పంట అమ్ముకోవాలని నా పంట కొనట్లేదు నేను నా కుటుంబాన్ని పోషించలేకపోతున్నాను నేను చనిపోవడానికి అవకాశం కల్పించండి అంటూ కలెక్టర్ గారికి వినతిపత్రాలు ఇచ్చేదాక వచ్చింది రైతుల పరిస్థితి. సాధారణ రైతు పంట అమ్ముదామని చెప్పి ప్రభుత్వ మార్కెట్ యార్డుకు వస్తే కాలయాపన పేరుతో ముప్పై రోజులైనాకొనకుండా ఏ రైతుఅయినా ఎలా బ్రతకగలడు?తన కుటుంబంలో పిల్లలు చదువులు, సాధారణ ఖర్చులు ఎలా ఎల్లదియ్యాలి. మార్కెట్ యార్డులో నియమించిన అధికారులు పనేంటి?. వాళ్ళు కేవలం హాజరు శాతం కొరకు ఉద్యోగం చేస్తున్నారా? లేదా సమస్యలు పరిష్కరించడానికి ఉద్యోగం చేస్తున్నారా? ఎక్కడా ఇలాంటి సమస్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే రైతన్న జీవించగలడు.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### వీధికుక్కలను కేంద్రాలకు తరలించాలి

**తాజాగా** సుప్రీంకోర్టు ఆదేశించినట్లు సాధ్యమైన వరకు వీధి కుక్కలను షెల్టర్ కేంద్రాలకి తరలిస్తే వాటి సంతానోత్పత్తి కొంతైనా తగ్గుతుంది. ఒక్కో ఆడ కుక్క ఒకేసారి నాలుగైదు పిల్లలకు, సంవత్సరంలో 20 కుక్క పిల్లలకు జన్మనిస్తుందట. ఇలా పెరిగిన వీధి కుక్కలు గుంపులుగా రోడ్లపైకి వచ్చి దారిన పోయే పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తుంటే ఏటా లక్షలాది మంది చనిపోటం తీవ్రంగా గాయపడటం తెలిసిందే. ఇక పల్లెల్లో ఆలనపాలన లేని పేద పసిపిల్లల్ని ఆకలి గొన్న వీధి కుక్కలు తోడేళ్ళ వలె పీక్కుతింటున్న ఘోర సంఘటనలూ ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, మంత్రులు మార్నింగ్ వాక్‌లకు రోడ్ల పైకి వస్తే వాటి దాడుల ప్రతాపం తెలుస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### గోపాల మిత్రల ఆగడాలు?

**పశుసంవర్ధక** శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గోపాలమిత్ర సిబ్బంది గ్రామాలలో చాలా అవినీతి అక్రమాలు, గోల్ మాల్ పనులకు పాల్పడడం జరుగుతుంది. గ్రామాల లో మూగజీవాలు పశువుల సంఖ్య గతంలో కన్న చాలా తగ్గింది. పశు వైద్యం పేరుతో పేద ప్రజలు అమాయక ప్రజలను మోసంచేస్తున్నారు. కొందరిపై పోలీసు కేసులు కూడా నమోదు అయినాయి. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు ఇట్టి గోపాలమిత్ర గోల్ మాల్ వ్యక్తులపై చర్య తీసుకోవాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### బంధాలు బలోపేతం

**భారత్-ఇటలీ** సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలపడుతున్నాయి. రోమ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య జరిగిన సమావేశం ఇరుదేశాల బంధాలకు కొత్త దిశను చూపించింది. ఈ భేటీలో సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక పార్టనర్‌షిప్' స్థాయికి పెంచుతున్నట్లు ప్రకటించడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య పరిమాణం వేగంగా పెరుగుతోంది.యంత్రాంగతయారీ, ఫార్మా, విద్యుత్ వాహనాలు, గ్రీన్‌ఎనర్జీ,అంతరిక్ష పరిశోధన, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో పరస్పర సహకారం విస్తరించనుంది. ఇటలీకి ఉన్న సాంకేతిక నైపుణ్యం, భారతదేశానికి ఉన్న విస్తారమైన మార్కెట్ కలిసి ఇరు దేశాలకు ప్రయోజనకరంగా మారుతున్నాయి.భారత్-ఇటలీ జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029 ద్వారా పెట్టుబడులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అటవీ భూముల ఆక్రమణ

**తిరుపతి** జిల్లా బీఎన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామ పరిధిలో అంజూర్ అటవీ భూమి సర్వేనంబర్ 295లో ఒక ట్రస్టు వారు 21 ఎకరాల అటవీ భూమి అక్రమించి ఆశ్రమం పేరుతో మోసంచేస్తున్నారు. అది రెవెన్యూ భూమి అని రెవెన్యూ వాళ్ళునాటకాలు ఆడుతున్నారు. అడవి మధ్యలో రెవెన్యూ వారికి ఎలా వచ్చిందో ఒరిజినల్ డాక్యుమెంట్స్ చూపమంటే ఎలుకలు తిన్నాయి అన్నట్లుగా వారి సమాధానంఉంది.దీనిమీదప్రభుత్వం చొరవ తీసుకొని ఆక్రమించిన అంజూర్ అటవీ భూమిని స్వాధీనం చేసువాలి. ప్రభుత్వ భూములు దొంగల పాలు కాకూడదు అన్న తపన.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### విశ్రాంతి అవసరం

**ఉపాధ్యాయులు** సమాజ నిర్మాణానికి ప్రధాన స్తంభాలు.వారి ప్రధాన బాధ్యత విద్యాబోధనే. సంవత్సరం మొత్తం విద్యార్థుల అభివృద్ధి కోసం శ్రమించే వారికి వేసవి సెలవుల్లో తగిన విశ్రాంతి అవసరం.అదనపు పనులతో వారిపై ఒత్తిడి పెంచకుండా, వారి ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కూడా పరిగణలోకి తీసుకోవాలి. అత్యవసర పనులు ఉన్నపుడు పరిమిత స్థాయిలో, సమయానుకూలంగా అప్పగించడం మంచిది.ఆరోగ్యంగా,ఉత్సాహంగా ఉన్న ఉపాధ్యాయులే విద్యార్థులకు మరింత మంచి భవిష్యత్తును అందించగలరు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# వ్యాపారంగా మారుతున్న భిక్షాటన!

**విధివంచనకు గురై అంగవికలురై మరే పని చేయలేక, పొట్టగడవక, నా అనేవారు లేక, మరో గత్యంతరం లేక భిక్షాటనవైపు మొగ్గుచూపుతున్న వారి పరిస్థితి సానుభూతితో అర్థం చేసుకోవచ్చు. వారికి అంతో ఇంతో సహాయం చేయవచ్చు. అలాంటి వారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటి మానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి, ధర్మం. కానీ దాన్ని ఆసరాగా చేసుకొని కాళ్లు, చేతులు అన్ని సక్రమంగా ఉండి, పనిచేసే శక్తి ఉండి భిక్షాటన చేయడం ఎంతవరకు సమంజసం? చివరకు దీన్ని వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో ఊహించుకోవచ్చు. కొన్ని నగరాల్లో ప్రాంతాల వారీగా అడుక్కుతినే ప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రదేశాల్లో తాము తప్ప మరొకరు అడుక్కోకూడదని నిబంధనలు విధిస్తున్నారు.**

దామెర్ల సాయిబాబ

ఆశ అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే పరిస్థితులు దారుణంగా ఉంటాయి. అడ్డదారులకు అదుపుఆజ్ఞా ఉండదు. భిక్షాటన కూడా అలా రూపాంతరం చెందుతుందేమోననిపిస్తున్నది. ఇంటి యజమానులు లేని సమయంలో వారి పిల్లలను తీసుకువెళ్లి వారిని చూపి భిక్షాటన చేస్తున్న సంఘటనలు పలువురిని కలచివేస్తున్నాయి. మొన్నామధ్య భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలకు పోవడంతో వారి యేడాదిన్నర వయసున్న బాబును ఇంటి పని మనిషికి అప్పగించి కార్యాలయానికి వెళ్లితే ఆ పనిమనిషి బాబును తీసుకువెళ్లి గుడి ముందు పడుగోబెట్టి భిక్షాటన చేసిన సంఘటన అప్పట్లోనే చర్చనీయాంశమైంది. ఆ పని మనిషిని గుర్తించిన ఆ పసికందు తండ్రి స్నేహితుడు ఫోన్ చేయడంతో మొత్తం సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఇవి ఏమాత్రం ఆగడంలేదు. అన్నెంపున్నెం ఎరుగని పిల్లలతో భిక్షాటన చేయించడం నగరాలతోసహా అనేక పుణ్యక్షేత్రాలలో విపరీతంగా పెరిగిపోతున్నది. ఈ భిక్షాటన కోసం ఏకంగా పసిపిల్లలను కిడ్నాప్ చేస్తున్న సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. భిక్షాటనకు మించి లాభసాటిగా ఉండే వ్యాపారం మరొకటి లేదనే చెప్పొచ్చు. పెట్టుబడి ఉండదు, నష్టాలు వచ్చే అవకాశం లేదు, సర్వకాల సర్వావస్థలయందు వృత్తి ఆగే పరిస్థితి రాదు. అందుకే ఈ వృత్తిలోకి దిగినవారు ఎవరైనా దీన్ని వదిలి రావడానికి ఏమాత్రం అంగీకరించరు. కాకపోతే ప్రారంభించేటప్పుడు కొంత ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వంటి పదాలకు చోటు ఇవ్వకుండా వాటిని పట్టించుకోకపోతే ఇంతకుమించిన లాభసాటి వృత్తి మరొకటి లేదనేది నిర్వివాదం. విధివంచనకు గురై అంగవికలురై మరే పని చేయలేక పొట్టగడవక, నా అనేవారు లేక, మరో గత్యంతరం లేక భిక్షాటనవైపు మొగ్గుచూపుతున్న వారి పరిస్థితి సానుభూతితో అర్థం చేసుకోవచ్చు. వారికి అంతో ఇంతో సహాయం చేయవచ్చు. అలాంటి వారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటి మానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి, ధర్మం. కానీ దాన్ని ఆసరాగా చేసుకొని కాళ్లు, చేతులు అన్ని సక్రమంగా ఉండి, పనిచేసే శక్తి ఉండి భిక్షాటన చేయడం ఎంతవరకు సమంజసం? చివరకు దీన్ని వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో ఊహించుకోవచ్చు. కొన్ని నగరాల్లో ప్రాంతాల వారీగా అడుక్కుతినే ప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రదేశాల్లో తాము తప్ప మరొకరు అడుక్కోకూడదని నిబంధనలు విధిస్తున్నారు. ప్రధానంగా నగరాల్లోని చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముందు, వెనుక చూడకుండా వాహనాలకు అడ్డుపడుతున్నారు.అన్నిటికంటే ముఖ్యంగా వీరివెనుక కొన్నిముఠాలు పనిచేస్తున్నాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తీవ్ర కరవుతో అన్నానికి జరక్క అల్లాడుతున్న రాష్ట్రాల్లోని దుర్భిక్ష ప్రాంతాలకు ఈ ముఠాలు వెళ్లి పదేళ్లలోపు పిల్లలను తీసుకువస్తున్నారు.వారి తల్లిదండ్రులకు అంతో ఇంతో ముట్టచెప్పి మూడు నాలుగు నెలల కాంట్రాక్టుగా ఈ వృత్తిలోకి దించుతున్నారు. వారికి చింపిరి బట్టలు తొడిగి ఉదయాన్నే వ్యాన్‌లో ఎక్కించుకొని అడుక్కుతినే కూడళ్ల వద్దకు తీసుకువెళ్లి దింపుతారు. తిరిగి సాయంత్రానికి వారి బసకు తీసుకువెళ్లడం ఆ ముఠాల నిత్యకృత్యంగా ఉంటున్న ట్లు సమాచారం. వాస్తవంగా యాచకుల సమస్య ప్రపంచ వ్యాప్తంగా కూడా ఉంది.జర్మనీ, పోలాండ్‌లో 19వ శతాబ్దం లోనే భిక్షాటనను నిషేధిస్తూ చట్టాలు చేశారు. పాటించక పోతే ఐదేళ్ల శిక్ష విధించేలా 1927లోనే చట్టాన్ని సవరించారు. ఆ చట్టం మేరకు పోలాండ్ రాజధాని వార్సాలో 1933-39 మధ్య కాలంలో దాదాపు ఆరువేల మందిని శిక్షించారు. అలాగే ఎన్నో దేశాలు ఈ యాచక వృత్తిని నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాయి.కానీ భారత్‌లాంటి దేశంలో చట్టాలు చేస్తున్నారు కానీ అమలు చేయలేకపోతున్నారు. భిక్షాటనను చట్ట విరుద్ధంగా ప్రకటిస్తూ భారత్‌లో 1959లో చేసిన చట్టం ప్రకారం మూడేళ్లవరకు శిక్ష విధించవచ్చు. భారతశిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల ప్రకారం బాలలను అపహరించి తీసుకువెళ్లి భిక్షాటన చేయించి సంపాదించడాన్ని శిక్షార్హనేరంగా ప్రకటించారు. బాధిత బాలల సంక్షేమానికి విడిగా మండళ్ల స్థాపించేలా 1960లో కేంద్రం మరో చట్టం తీసుకువచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1977లో భిక్షాటన నిరోధక చట్టాన్ని(ఏపి యాక్ట్‌నెం.12/77) రూపొందించారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసి ప్రతి ఆరుమాసాలకు ఒకసారి అమలు తీరును సమీక్షించాలని నిర్ణయించారు. ఆ కమిటీలో హోంశాఖ, సాంఘిక సంక్షేమ, పంచాయతీరాజ్,వైద్యఆరోగ్య శాఖలు, ప్రిన్సిపల్ సెక్రెటరీలు, ఆర్థిక శాఖ కార్యదర్శి తదితరులు సభ్యులుగా ఉంటారు. అలాగే ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా స్థాయి సలహా సంఘాన్ని ఆర్‌డివో ఛైర్మన్‌గా రెవెన్యూ డివిజన్ స్థాయిలో స్థానిక అడ్వజయిరీ కమిటీలను ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులను కూడా భాగస్వాములను చేశారు. ఇవన్నీ కాగితాలకే పరిమితమైపోయాయి. ఫలితంగా యేడాది యేడాదికి యాచక వృత్తి విస్తరించిపోతున్నది. భారత్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం నాలుగు లక్షల మందికిపైగా యాచకులు ఉన్నారు. వారిలో పురుషులు రెండు లక్షల ఇరవైవేలు కాగా, మహిళలు మరో లక్షా ఎనభైవేల మంది ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా ఎనభై వేలమంది ఉండగా, ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు తర్వాత స్థానాల్లో నిలుస్తున్నాయి. యాచకుల పునరావాసానికి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం 'స్మైల్' పేరిట ఒక పథకాన్ని ప్రవేశపెట్టినా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నది.ఇవి కేవలం అధికార లెక్కలే. అనధికారికంగా అప్పట్లోనే అంతకు నాలుగైదు రెట్లు ఎక్కువ ఉండొచ్చని అభిప్రాయాలున్నాయి. ఇప్పుడు గడచిన ఒకటిన్నర దశాబ్దంలో భిక్షాటన చేసేవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా కోటి దాటి ఉండొచ్చనేది అనధికార అంచనా. ఈ వృత్తిద్వారా లక్షలాది రూపాయలు సంపాదించేవారు కూడా ఉన్నారు. నెలకు ఇరవై,ముప్పైవేల రూపాయల అద్దెలు వచ్చే భవనాలు ఉన్న భిక్షగాళ్లు ఉన్నారు.యాచనకు అలవాటుపడిన ప్రాణం మరో పనిచేయడానికి ఇష్టపడదు. మంచి, మంచి కుటుంబాల్లోని వారు సైతం ఆదరణ కరవై కుటుంబ సభ్యుల మీద ఆగ్ర హంతో, ఇల్లు వదిలి వచ్చి బతుకు దుర్భరమై ఇంటికి తిరిగి వెళ్లలేక యాచనకు అలవాటుపడి ఆ తర్వాత వదిలిపెట్టలేక పోతున్నారు. హైదరాబాద్‌ను యాచకరహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ఎన్నోసార్లు గట్టి ప్రయత్నమే జరిగింది. కానీ యాచకరహిత నగరంగా తీర్చిదిద్దే మాట దేవుడెరుగు. యేడాదియేడాదికి యాచకుల సంఖ్య పెరిగిపోతున్నది. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. పొరుగు రాష్ట్రాల్లో చట్టాలు అమలు చేస్తుండడం వల్ల పెద్దఎత్తున యాచకులు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్నారు. పిల్లలతో ఈ భిక్షాటన వ్యాపారం చేస్తున్నారు. ఆ పిల్లలను బలవంతంగా అంగవికలురుగా మారుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అవసరం అనుకుంటే చట్టాన్ని మరింత పటిష్టం చేసేందుకు శ్రీకారం చుట్టారు. అలాగే మరోదారి లేక యాచకులైన వారి సంక్షేమాన్ని కూడా పాలకులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ●

## ఒక్క మాట

# జననాలు సరే! భవితకు భరోసా ఏదీ?

నల్ల రవికుమార్

ఒకప్పుడు 'జనాభా నియంత్రణ' నినాదంగా వినిపించిన భారత గడ్డపై, నేడు 'జనాభా సమతుల్యత' ఒక అత్యవసర చర్చగా మారింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జనన రేటు గణనీయంగా పడిపోతుండటం, భవిష్యత్తులో రాష్ట్రం 'వృద్ధుల ఆశ్రమంగా' మారుతుందన్న ఆందోళన కలగడం సహజం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా పెరుగుదలపై చేస్తున్న ప్రకటనలు, మూడవ సంతానానికి నగదు ప్రోత్సాహకాలు అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఒక దీర్ఘకాలిక విజన్‌ను ప్రతిబింబిస్తున్నాయి. అయితే, కేవలం నగదు ప్రోత్సాహకాలు లేదా ప్రచారం ద్వారా జనాభా గ్రాఫ్‌ను మార్చడం సాధ్యమా? ఆధునిక యువ దంపతులు కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పిల్లల సంఖ్యను పెంచుకుంటారా? ఈ ప్రశ్నలకు సమాధానం సామాజిక భద్రత మౌలిక సదుపాయాల కల్పనలోనే ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 'టోటల్ ఫెర్టిలిటీ రేటు'1.5 కి పడిపోయింది. జనాభా స్థిరంగా ఉండాలంటే ఇది 2.1 ఉండాలి. మరోవైపు, ఉత్తర భారత రాష్ట్రాలైన బీహార్ (3.0), ఉత్తర ప్రదేశ్ (2.7) వంటి చోట్ల జనాభా ఇంకా పెరుగుతూనే ఉంది. దక్షిణాది రాష్ట్రాలు విద్య, వైద్య రంగాల్లో సాధించిన పురోగతి వల్ల ఇక్కడ జనన రేటు తగ్గినప్పటికీ, ఇది ఒక వింతపరిస్థితికి దారితీస్తోంది.దేశవ్యాప్త సగటువయస్సు 28ఏళ్లు ఉంటే, ఏపీలో అది 32.5ఏళ్లుగా ఉంది. అంటే మనం దేశం కంటే వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తున్నాం. 2047 నాటికి ఏపీలో ప్రతి నలుగురిలో ఒకరు వృద్ధులే ఉంటారని అంచనా. ఇదే పరిస్థితి గతంలో దక్షిణకొరియా, జపాన్ వంటి దేశాల్లో సంభవించింది. దక్షిణ కొరియాలో జనన రేటు 0.7కి పడిపోవడంతో అక్కడ శ్రామిక శక్తి లేక ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. జపాన్లో వేల సంఖ్యలో పాఠశాలలు మూతపడ్డాయి. ఆ దేశాలు ఇప్పుడు లక్షల కోట్లు కుమ్మరించినా ప్రజలు పిల్లల్ని కనడానికి ముందుకు రావడం లేదు.ఆదుస్థితి మనకు రాకూడదన్న ప్రభుత్వ ముందుచూపు ప్రశంసనీయం. కానీ, ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి నగదు కంటే నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యం. నేటి ఉద్యోగినులు ఒకే బిడ్డతో సరిపెట్టుకోవడానికి ప్రధాన కారణం కార్యాలయాల్లో లభించని సహకారం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినుల తరహాలో రాష్ట్రంలోనూ రెండు సంవత్సరాల శిశు సంరక్షణా సెలవు సౌకర్యాన్ని ఉదారంగా అమలు చేయాలి. సెలవు మంజూరు చేసేటప్పుడు 'పనికి అంతరాయం కలగకూడదు' అనే అసంబద్ధ నిబంధనను తొలగించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అధికారుల బాధ్యతగా మార్చాలి. పని ప్రదేశాల్లోనే అత్యాధునిక క్రెష్ (శిశు సంరక్షణా కేంద్రాలు) అందుబాటులో ఉంటే తల్లులు నిశ్చింతగా విధుల్లో చేరగలరు.వైద్య రంగంలో కూడా సమూల మార్పులురావాలి. ప్రైవేటు ఆసుపత్రులలో పెరుగుతున్న సిజేరియన్ల సంఖ్య మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. సహజ ప్రసవాలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ ప్రసూతి కేంద్రాలను మెరుగుపరచాలి. ఒకవేళ అత్యవసర స్థితిలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినా, ఆ ఖర్చును ప్రభుత్వం భరించేలా రీయింబర్స్మెంట్ సౌకర్యం కల్పించాలి. అలాగే, కిశోర బాలికలకు చిన్నతనం నుండే బలవర్ధకమైన పోషకాహారం అందిస్తేనే భవిష్యత్తులో వారి ఫెర్టిలిటీ రేటు బాగుంటుంది. సహజ వనరులను కాపాడుకోవాలన్నా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా పని చేసే యువత ఉండాలి. ఆ యువత ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదగాలంటే ప్రభుత్వ పెట్టుబడి కేవలం నగదు రూపంలో కాకుండా నాణ్యమైన విద్య, వైద్యం ఉద్యోగ భద్రత రూపంలో ఉండాలి. అప్పుడే యువ దంపతులు ధైర్యంగా రేపటి తరం వైపు అడుగులు వేస్తారు. ప్రభుత్వం తన విజన్‌కు ఈ భరోసాను కూడా తోడు చేస్తేనే 'స్వర్ణాంధ్రఖి స్వప్నం' సాకారమవుతుంది. ●

# జంతువులే కాదు, మనుషుల ప్రాణాలూ ముఖ్యమే

డి జె మోహన రావు

దేశంలో వీధి కుక్కల దాడులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. 2026వ సంవత్సరంలో ఉదయ్‌పూర్‌లో దాదాపు 1,750 కుక్కకాటు కేసులు, ఇదే ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే తమిళనాడులో సుమారు 2 లక్షల 63 వేల కేసులు నమోదు కాగా ఇందులో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే భిల్వారాలో ఒక్క రోజులోనే 42 మంది కుక్కకాటుకు గురయ్యారు. వ్యాక్సిన్ వేయించుకోవడంలో ఆలస్యం చేయడం లేదా పూర్తి చికిత్స తీసుకోకపోవడం వల్ల పిల్లలు రేబిస్ బారిన పడి మరణించిన ఘటనలు మహారాష్ట్రలో థానేతో సహా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో చోటుచేసుకున్నాయి. అదేవిధంగా, కర్ణాటకలోని విజయపురలో 2026లో వీధి కుక్కల గుంపు ఒక చిన్న బాలుడిపై దాడిచేసిన ఘటన సీసీటీవీలో నమోదై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకుదారితీసింది. ఈ సంఘటనలు వేర్వేరు ప్రాంతాల్లో జరిగినప్పటికీ వీటన్నింటి ద్వారా ఒకే సామాజిక వాస్తవం స్పష్టమవుతుంది. కొన్ని సందర్భాల్లో జరిగే గుంపు దాడులు తీవ్రమైన గాయాలకు దారితీస్తున్నాయి. కుక్కకాటు తర్వాత తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోకపోతే రేబిస్ ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని ఈ గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన సుప్రీంకోర్టు వీధి కుక్కల సమస్యపై ఇచ్చిన ఆదేశాలు విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దేశంలో వీధి కుక్కల జనాభాను నియంత్రించడానికి దాదాపు ఇరవై ఏళ్ల క్రితమే నిబంధనలు ఉన్నప్పటికీ, రాష్ట్రాలు వాటిని సమర్థంగా అమలు చేయలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం జంతు సంక్షేమం కంటే మనుషుల ప్రాణాలకే ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం భయం లేకుండా వీధుల్లో తిరిగే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని తేల్చిచెప్పింది. ఈ తీర్పు ప్రకారం పాఠశాలలు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు వంటి అత్యంత రద్దీ ప్రాంతాల నుండి వీధి కుక్కలను పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. అలాగే సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స అనంతరం వాటిని తిరిగి అదే ప్రాంగణాల్లో వదిలిపెట్టరాదని కోర్టు స్పష్టంగా ఆదేశించింది. ఇంకా పిచ్చిపట్టిన, తీవ్ర దూకుడుతో ముప్పుగా మారిన కుక్కలకు పశువైద్యుల ధృవీకరణతో కారుణ్య మరణం అనుమతించవచ్చని పేర్కొంది. ప్రతి జిల్లాలో ఆధునికజంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కూడా ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేసే అధికారులకు క్రిమినల్ కేసుల నుండి రక్షణ కల్పించబడుతుందని, అయితే విధుల్లో నిర్లక్ష్యం జరిగితే కోర్టు ధిక్కార చర్యలు తప్పవని హెచ్చరించింది. వీధి కుక్కల సంఖ్య ఇలా అదుపు తప్పడానికి అనేక సామాజిక, పరిపాలనా, పర్యావరణ కారణాలు ఉన్నాయి. వీటి సహజ



సంతానోత్పత్తి శక్తి చాలా ఎక్కువ కారణంగా జంతు జనన నియంత్రణ చర్యలు విస్తృతంగా, నిరంతరంగా జరగకపోతే వాటి సంఖ్య కొద్ది సంవత్సరాల్లోనే వేగంగా పెరుగుతుంది. అదే సమయంలో నగరాలు, పట్టణాల్లో చెత్త నిర్వహణ లోపాలు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. వీధుల్లో పేరుకుపోయే ఆహార వ్యర్థాలు కుక్కలకు సులభమైనఆహార వనరుగా మారి, అవి అదే ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరచుకునేలా చేస్తాయి. కొన్ని సందర్భాల్లో యజమానులు తమ పెంపుడు కుక్కలను రోడ్లపై వదిలేయడం కూడా ఈ సమస్యను పెంచుతోంది. ఇవి క్రమంగా వీధి జీవనానికి అలవాటు పడి అక్కడి జనాభాలో కలిసిపోతున్నాయి. జంతు జనన నియంత్రణ, రేబిస్ వ్యాక్సినేషన్, షెల్టర్ వ్యవస్థలు అన్ని ప్రాంతాల్లో సమానంగా అమలు కాకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో శునకాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. నగర విస్తరణతో సహజ నివాసాలు తగ్గిపోతుండగా, ఆ ఖాళీని వీధి కుక్కలు ఆక్రమించుకుంటూ మానవ నివాసాలకు మరింత చేరువవుతున్నాయి. దేశంలో ప్రతి ఏడాది సుమారు 1.7 కోట్ల నుంచి 2 కోట్ల వరకు కుక్కకాటు ఘటనలు నమోదవుతున్నాయని వివిధ ప్రజారోగ్య గణాంకాలు తెలుపుతున్నాయి. ఇందులో అగ్ర భాగం వీధి కుక్కలదే. ఈ సమస్య ప్రజల దైనందిన భద్రతా భావాన్ని నేరుగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఉదయం నడకకు వెళ్లేవారు, రాత్రి వేళల్లో తిరిగివచ్చేవారు ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరగడం వల్ల రోడ్డుపై నడవడమే భయానక అనుభవంగా మారుతోంది.ఇక్కడ అత్యంత కీలక అంశం కుక్క కాట్లు మాత్రమే కాదు. వాటి తరువాత వచ్చే ఆరోగ్య ప్రమాదాలు కూడా. చిన్న గాయం అయినా సరే సమయానికి సరైన వైద్యం తీసుకోకపోతే ప్రాణాంతక రేబిస్ సోకి మరణం సంభవించవచ్చు.అందువల్ల ఇది తక్షణ సమస్యగా కాకుండా దీర్ఘకాలిక ప్రజారోగ్య సంక్షోభంగా మారుతోంది. అదే సమయంలో, వీధి కుక్కల ఉనికి ప్రజల్లో మానసిక ఒత్తిడిని కూడా పెంచుతోంది. పిల్లల్లో బయటకు వెళ్లాలన్న భయం, వృద్ధుల్లో ఒంటరిగా నడవడానికి సంకోచం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇది వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేయడమే కాకుండా జీవన నాణ్యతను తగ్గిస్తోంది. అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చే కుక్కల కారణంగా వాహనదారులు నియంత్రణ కోల్పోయి హఠాత్తుగా బ్రేక్ వేయడం వలన చిన్న ప్రమాదాల నుంచి తీవ్రమైన ప్రమాదాల వరకు చోటుచేసుకుంటున్నాయి. చెత్త కుప్పల చుట్టూ కుక్కలు గుంపులుగా చేరి పరిసరాలను నాశనం చేస్తున్నాయి. ఇది ఇతర అంటువ్యాధుల వ్యాప్తికి కారణం అవుతున్నాయి. మొత్తం మీద వీధి కుక్కల సమస్య ఒకే కోణంలో చూడదగినది కాదు. ఇది భద్రత, ఆరోగ్యం, మానసిక స్థితి, నగర నిర్వహణపై ప్రభావం చూపే బహుముఖ సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంది. ఈ సమస్యను ఏకైక చర్యతో పరిష్కరించడం సాధ్యం కాదు. ప్రజాఆరోగ్యం, నగర నిర్వహణ, జంతు సంక్షేమం అనే మూడు వ్యవస్థల సమన్వయంతో మాత్రమే వీటిని నియంత్రించగల బహుముఖ సవాలు. దీనికి పరిష్కారంగా సమగ్ర స్టెరిలైజేషన్ కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలి. రేబిస్ వ్యాక్సినేషన్ ద్వారా వీధి కుక్కలలో వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చు. అలాగే చెత్త నిర్వహణను క్రమబద్ధీకరించడం ద్వారా ఆహార వ్యర్థాలు తగ్గించి కుక్కల గుంపుల ఏర్పాటును నియంత్రించవచ్చు.పాఠశాలలు,ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు వంటిసున్నిత ప్రాంతాల్లో ఫెన్సింగ్ వంటి భద్రతా చర్యలు అవసరం. ●

ong-5_ong-5.qxd 5/22/2026 10:17 PM Page 1



## కొణిజేడులో వేసవి సెలవులు కిశోరి వికాసం కార్యక్రమం

**టంగుటూరు, మే 22, ప్రభాతవార్త**



మండలంలోని కొణిజేడు గ్రామంలో వేసవి సెలవులు- కిశోరి వికాసం కార్యక్రమాన్ని టంగుటూరు ప్రాజెక్టు సీడీపీవో వై అంజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ బాల బాలికలకు ఆర్థిక నిర్వహణ గురించి తెలియపరచడం జరిగింది. డబ్బు అనేది ఒక సాధనమని లక్ష్యం కాదని డబ్బును చాలా తెలివిగా ఉపయోగించుకోవాలని సంపాదించిన డబ్బులో కొంత మొత్తాన్ని పొదుపు చేయడం వలన అది ముందు ముందు రోజుల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా 11-18 సంవత్సరాల లోపు గల బాల బాలికలు పొదుపును నేర్చుకోవాలని కోరారు. డబ్బు ఆదా చేయడం ద్వారా రేపటి రోజు మంచి జీవితాన్ని ఇస్తుందని తెలిపారు. కిశోర్ బాలబాలికలు పొదుపును తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆర్ సత్యవతి, యంఎస్‌కె మేడం డి మౌనిక, అంగన్‌వాడీ హెల్పర్లు జి కోమలి, ఎస్‌కె సైదాబి, సిహెచ్ సరస్వతి, యం అన్నపూర్ణ, పి విజయలక్ష్మి, పి నారాయణ, కె రేవతి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్

**ఉలవపాడు, మే 22, ప్రభాతవార్త**



మండలంలోని కరేడు మరియు రామాయపట్నం పంచాయతీలలో జరుగుతున్న జల ధార జల హారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనుల పురోగతిని శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి జోసెఫ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణ మరియు పూడికతీత పనులతో గ్రామీణ ప్రాంతాలలో భూగర్భ జలాలు పెరుగుదల, వర్షపు నీటి సంరక్షణ జరుగుతుందని, అదేవిధంగా వ్యవసాయ అవసరాలకు పశువులు తాగునీటి అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఈ పనులను సమయానికి పూర్తి చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. పని ప్రదేశంలో శ్రామికులకు త్రాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం ప్రకారం శ్రామికులకు చెల్లింపులు సమయానికి జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఏపిడి శ్రీనివాసులు, ఏపీవో అబ్దుల్లా, ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రామికులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి జీవిత బీమాతో కుటుంబానికి ధీమా..

**- చీఫ్ మేనేజర్ సీనా నాయక్**

**బల్లికురవ, మే 22, ప్రభాతవార్త**



బ్యాంకు ఖాతాదారులంతా ప్రధానమంత్రి జీవిత బీమా నమోదులో భాగస్వాములు కావడం ద్వారా వారి కుటుంబాలకు ధీమా కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కే.సీనా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాలెం గ్రామానికి చెందిన కొండవర్తు బాపమ్మకు రూ.2 లక్షలు ప్రమాద బీమా చెక్కును ఆయన అందజేశారు. బా పమ్మ భర్త పున్నయ్య బ్యాంకు ఖాతాదారుడుగా ఉండి, ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఉన్నయా ప్రధానమంత్రి జీవిత బీమాలో నమోదు కావడంతో, ఈ మొత్తం చెక్కును ఆయన భార్యకు అందజే శారు. కార్యక్రమంలో మేనేజర్ సుహిత గ్రేస్, సహాయం మేనేజర్ బిందు మాధవి సిబ్బందిఉన్నారు.

## కొప్పెరపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు ఆరంభం

**బల్లికురవ, మే 22, ప్రభాతవార్త**



మండలంలోని కొప్పెరపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నుండి ఓ పి లు ప్రారంభమయ్యాయి. వైద్యాధికారి డాక్టర్ మమత ఓపి విభాగాన్ని ప్రారంభించారు. తొలి రోజు 29 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు డాక్టర్ మమత పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కారణంగా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, ఫస్ట్ ఎయిడ్ కిట్లను, అత్యవసర సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఉదయం 10 గంటల తర్వాత గృహాలకే పరిమితం కావాలని, సాయంత్రం నాలుగు గంటల తరువాతనే ప్రజలు నివాస గృహాల నుండి బయటకు రావాలన్నారు.

## ముక్తేశ్వరంలో డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలు పంపిణీ

**బల్లికురవ, మే 22, ప్రభాతవార్త**



మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామాలలో డ్రాఫ్ట్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నట్లు తాసిల్దార్ రవి నాయక్ తెలియజేశారు. శుక్రవారం ముక్తేశ్వరం గ్రామంలో డ్రాఫ్ట్ పాస్ పుస్తకాల పంపిణీ జరిగింది. గ్రామానికి సంబంధించి 3,140 ఎకరాల భూములకు గాను, 1450 ఖాతాలు ఉన్నట్లు వివరించారు. డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలలో రైతుల భూముల విస్తీర్ణాలు, మొత్తం వివరాలు నమోదు చేసి వారికి అందజేయడం జరుగుతుందని, అందులోని వివరాలను రైతులు సమ్మతిస్తే ఈ కేవైసీ పూర్తి అయిన పిమ్మట, పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గొర్రెపాడు ,గుంటుపల్లి గ్రామాలలో కూడా డ్రాఫ్ట్ పాస్ పుస్తకాల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రహర్ష, సిబ్బంది ఉన్నారు.

## కళా రంగ డైరెక్టర్ విజయనిర్మలకు కొండేపి కళాకారుల సంఘం నివాళి

**కొండపి, మే 22, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ నాటక రంగ అకాడమీ డైరెక్టర్ పేముల విజయనిర్మల మృతి పట్ల కొండపి నియోజకవర్గం కళాకారుల సంఘం నాయకులు గురువారం సాయంత్రం మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళి అర్పించారు విజయనిర్మల మరణం ఖండారంగానికి తీరని లోటు అని అన్నారు. అనంతరం వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు సందర్శించిన వారిలో కళాకారుల సంఘం నియోజకవర్గ ప్రెసిడెంట్ బిఎల్ నరసింహం జీవి సుబ్బారావు, దేవూరి సుబ్బారావు పలువురు కళాకారులు ఉన్నారు.

## పంట వ్యర్థాలు కాల్చి వేస్తే శ్వాసకోశ వ్యాధులు సోకుతాయి

**జె.పంగులూరు, మే 22, ప్రభాతవార్త**



పంటల వ్యర్థ పదార్థాలు కాల్చివేయడం వలన విషవాయువులు విడుదలై శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమూరు రైతు సేవ కేంద్రంలో మొక్కజొన్న, వరి ఇతర పంటల అవశేషాలు కోత తర్వాత మిగిలిన కాండం, ఆకులు, పొట్టు లాంటివి పొలంలోనే కాల్చడం వల్ల తక్షణ సౌలభ్యం ఉన్నా, దీర్ఘకాలంలో నేలకు, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని శుక్రవారం వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు తెలియజేశారు. పంటల అవశేషాలు కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థం బూడిద అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండమూరు గ్రామ రెవెన్యూ అధికారి చింపారావు, వ్యవసాయ సహాయకులు మస్తాన్, గోపి కిరణ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 300 ఎకరాలలో మొక్కజొన్న వ్యర్థం దగ్ధం

**జె.పంగులూరు, మే 22, ప్రభాతవార్త**



మండలంలోని కొండమూరు లో జరిగిన ప్రమాదంలో 300 ఎకరాల్లో మొక్కజొన్న వ్యర్థాలు ఆ పొలాల్లో ఉన్న విద్యుత్ పంప్ సెట్లు స్పింక్లర్లు మొదలైనవి దగ్ధమైన సంఘటన కొండమురు గ్రామంలో చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు అంటించడంతో వరుసగా 300 ఎకరాల్లో ఉన్న మొక్కజొన్న, ఆ పొలాల్లో ఉన్న పంపుసెట్లు స్లింకర్లు, విద్యుత్ వైర్లు దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న మామిడి తోట, సుబాబులు పొలాలు కూడా ఈ అగ్ని ప్రమాద ప్రభావం పడింది. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది రెండు వాహనాలు పొలాల్లో మంటలను అదుపు చేశాయి. దగ్ధమైన ప్రదేశాన్ని మండల తహసిల్దార్ సింగారావు వారి సిబ్బందితో పరిశీలించారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## ఒంగోలులో చిరుజల్లులు.. ఎండలకు ఊరట

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఒంగోలు ప్రజలకు గురువారం చిరుజల్లులు కాస్త ఉపశమనం కలిగించాయి. ఉదయం నుంచే నగరంలో వాతావరణం మారిపోగా, మబ్బులు కమ్ముకుని చల్లని గాలులు వీచాయి. అనంతరం ఉదయం 11:30 గంటల ప్రాంతంలో నగరంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో భానుడి తీవ్రత ఒక్కసారిగా తగ్గి ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. అకాల వర్షంతో రోడ్లపై పేరుకున్న వేడి తగ్గి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వర్షం కారణంగా కొంతసేపు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ఎక్కువ మంది ప్రజలు మాత్రం ఈ చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. ఎండలతో అలసిపోయిన చిన్నారులు, వృద్ధులు చిరుజల్లులతో ఆనందం వ్యక్తం చేశారు. వాతావరణంలో వచ్చిన ఈమార్పుతో మరికొన్ని రోజుల పాటు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని ప్రజలు భావిస్తున్నారు.

## హౌస్ లిస్టింగ్ సెన్సస్‌ను నాలుగు రోజుల్లో పూర్తిచేయాలి

**- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**

హౌస్ లిస్టింగ్ సెన్సస్‌ను నాలుగు రోజుల్లోగా పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. దీనిపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత జనాభా లెక్కలతో పోల్చితే ప్రస్తుత పరిస్థితులను బట్టి ప్రతిపాదిత వృద్ధికి, వాస్తవ సర్వేకు ఉన్న వ్యత్యాసంపై ఆయన ఆరా తీశారు. సర్వేలో ఎక్కడా లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రారంభంతో పోల్చితే గత వారంలో మంచి పురోగతి కనిపించిందని, ఈ సర్వేను వేగవంతం చేయాలని ఆయన చెప్పారు. ఈ దిశగా క్షేత్ర స్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఒంగోలు మున్సిపాలిటీలో సెన్సస్ విధుల్లో ఉన్న సిబ్బందితో ఈ సందర్భంగా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందుగా స్పెషల్ సీఎస్ రావత్, సెన్సెస్ డైరక్టరనివాస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, డీఆర్వో శ్రీధర్‌రెడ్డి, ఒగోలు కమీషనర్ వెంకట కృష్ణయ్య, డిప్యూటీ కమీషనర్ రాంభూపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ వివరాల నివేదికను ప్రతి రోజు తనకు పంపించాలని కలెక్టర్లను స్పెషల్ సీఎస్ ఆదేశించారు.



### మైనింగ్ కార్యకలాపాలపై డ్రోన్ ద్వారా సర్వే:

జిల్లాలో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాలపై డ్రోన్ ద్వారా సర్వే చేయించబోతున్నామని కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. అధికారిక కార్యకలాపాలు, నేర, రోడ్డు ప్రమాదాల నివారణ, విస్తృత ప్రజా ప్రయోజనాల కోసం డ్రోన్ల వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు, సమగ్ర వివరాలతో 'డేటా లేక్' నిర్వహణపై అమరావతి సచివాలయం నుంచి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ సెక్రటరీ కాటంనేని భాస్కర్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఇందులో పాల్గొన్నారు. డ్రోన్లకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి ప్రజలకు అందించే వివిధ సేవలలో వీటి వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారించాలని భాస్కర్ చెప్పారు. జిల్లాలోని అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే ఎంప్యానల్ అయిన ఏజెన్సీల నుంచి సర్వీసు లభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన గ్రానైట్ గనులు ఉన్నాయని, అక్కడి పరిస్థితిని త్వరలో డ్రోన్ల ద్వారా సర్వే చేయిస్తామని చెప్పారు. నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపయోగపడేలా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీస కెమెరాలను పెట్టబోతున్నట్లు భాస్కర్ చెప్పారు. సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ కేంద్రంతో వీటిని అనుసంధానం చేస్తామన్నారు. ఈ దృష్ట్యా వీటిని పెట్టేందుకు ప్రాధాన్యత స్థలాలను జిల్లాలో కలెక్టర్, ఎస్పీలు సమిష్టిగా గుర్తించాలని ఆయన అన్నారు. అదే విధంగా పలు రంగాలలో సంబంధిత శాఖల మధ్య సమాచారంతో వ్యత్యాసం లేకుండా రాష్ట్ర స్థాయిలో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తున్నామని, వీటి ఆధారంగా జిల్లాల అభివృద్ధికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని భాస్కర్ చెప్పారు.

## చారిత్రాత్మక ఒంగోలు జేఎంబీ చర్చి ఎన్నికలు

**- కట్టుదిట్ట భద్రతలో పూర్తి**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలులోని చారిత్రాత్మక జేఎంబీ చర్చి ఎన్నికలు హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా రిజిస్ట్రార్ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. గత కొన్ని సంవత్సరాలుగా చర్చి కమిటీ సభ్యుల మధ్య నెలకొన్న విభేదాలు, పరిపాలనాపరమైన భేధాభిప్రాయాల నేపథ్యంలో ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. చర్చి చరిత్రలో కీలక ఘట్టంగా భావిస్తున్న ఈ ఎన్నికల కోసం సభ్యులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికల భద్రతపై మాట్లాడిన డీఎస్పీ శ్రీనివాసరావు, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 120 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. చర్చి ప్రధాన గేట్ల వద్దతో పాటు పోలింగ్ హాల్ ప్రవేశ ద్వారం వద్ద రెండు దశల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని నిశితంగా పర్యవేక్షించినట్లు వెల్లడించారు. జేఎంబీ చర్చి సభ్యులంతా పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చర్చి సభ్యులు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. మొత్తం 13 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటుకానుండగా, అందులో 6 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 7 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. నాలుగు పాల్యాల పరిధిలో అభ్యర్థులు బరిలో నిలవగా, ఓటర్లకు నాలుగు బ్యాలెట్ పత్రాలు అందజేసి ఓటింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై కొందరు సభ్యులు హైకోర్టును ఆశ్రయించి ఎన్నికలను నిలిపివేయాలని కోరినప్పటికీ, ఎన్నికలు నిలిపివేయాలనే ఎలాంటి ఉత్తర్వులు అందలేదని జిల్లా రిజిస్ట్రార్ స్పష్టం చేయడంతో ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగింది. ఎన్నికల సమయంలో చర్చి పరిసరాల్లో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో సభ్యులు ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. ఎన్నికల ఫలితాలపై చర్చి సభ్యుల్లో ఆసక్తి నెలకొంది.



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.37 లక్షల 38 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి నిధులు మంజూరు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తమకు ఆర్థిక ఉపశమనం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## వేతనాల నిలిపివేత ఉత్తర్వులను ఖండిస్తున్నాం

**- ప్రభుత్వ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.వరకుమార్**

**ఒంగోలు, ప్రభాతవార్త**

అనంతపురం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ఇచ్చిన ఉత్తర్వుల ద్వారా జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల మే నెల జీతాలను నిలిపివేయాలని చూడటాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని ప్రభుత్వ ఉద్యోగులు సంఘం ప్రకాశంజిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.వరకుమార్ అన్నారు. ఆధార్ కిట్ల వినియోగం, ఎల్ఎంఎస్ కోర్సులు పూర్తి చేయలేదనే నెపంతో క్షేత్ర స్థాయిలో రాత్రింబవళ్ళ శ్రమిస్తున్న ఉద్యోగుల పొట్ట కొట్టేలా ఇటువంటి ఏకపక్ష ఉత్తర్వులు జారీ చేయడం అత్యంత బాధాకరం అన్నారు. సచివాలయ సిబ్బంది కేవలం ఆధార్ సేవలకే పరిమితం కాలేదు. ప్రస్తుతం వారు జనాభా ఆధార్ సేవలకే పరిమితం కాలేదు. డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల మే నెల వేతనాల నిలిపివేతకు జారీ చేసిన సదరు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఈజీతాల నిలిపివేత ఆదేశాలను రద్దు చేయాల్సిందిగా కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరుపున ఖండిస్తున్నాం అన్నారు.

## ఒంగోలులో చెడ్డి గ్యాంగ్ కలకలం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని పలు కాలనీల్లో చెడ్డి గ్యాంగ్ సంచారం కలకలం రేపుతోంది. ఇటీవల రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కొందరు వ్యక్తుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ముఖాలకు మాస్కులు ధరించి, అనుమానం రాకుండా కాలనీల్లో సంచరిస్తున్న ఈ వ్యక్తులు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వేసవి సెలవుల కారణంగా కుటుంబాలతో కలిసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.పలు కాలనీల్లో అర్ధరాత్రి సమయంలో వీరి కదలికలు కనిపిస్తున్నాయని, కొంతమంది నివాసితులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల్లో అనుమానితులు మాస్కులు ధరించి ఉండటంతో వారిని గుర్తించడం కష్టంగా మారింది. కాలనీల్లో తిరుగుతూ ఇళ్ల పరిస్థితులను గమనిస్తున్న తీరు స్థానికుల్లో మరింత భయాన్ని పెంచుతోంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, ఒంటరిగా ఉన్న కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చెడ్డి గ్యాంగ్ సంచారం నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు. కాలనీల్లో నిరంతర పర్యవేక్షణతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. నగరంలో ఎలాంటి చోరీలు లేదా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## దశాబ్దాల నిరీక్షణకు తెర..

**- అసైన్డ్ ఇంటి స్థలాల లబ్దిదారులకు గుడ్‌న్యూస్**

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా అసైన్డ్ ఇంటి స్థలాల విషయంలో ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పదేళ్ల కాలపరిమితి పూర్తయిన ప్రతి అసైన్డ్ ఇంటి స్థలాన్ని ఇకపై నేరుగా లబ్దిదారుల పేరిటే రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారికంగా స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పేద వర్గాలకు ప్రయో జనం చేకూర్చేలా అసైన్డ్ ఇంటి స్థలాల విషయంలో ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పదేళ్ల కాల పరిమితి పూర్తయిన ప్రతి అసైన్డ్ ఇంటి స్థలాన్ని ఇకపై నేరుగా లబ్దిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం అధికారికంగా స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ నూతన విధానం ద్వారా దశాబ్దాలుగా ఇళ్ల స్థలాలు ఉండి కూడా హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న లక్షలాది మంది పేద కుటుంబాలకు పూర్తి స్థాయి, శాశ్వత హక్కులు లభించనున్నాయి. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఖండించారు. భవిష్యత్తులో పేదలకు ఇచ్చే అన్ని రకాల ఇంటి స్థలాలపై రెండేళ్ల కాలపరిమితిలోనే పూర్తి హక్కులు కల్పించే విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, దీనిపై త్వరలోనే స్పష్టమైన విధాన నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన తెలిపారు. అసైన్డ్ ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌ల పక్రియలో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రధాన నిబంధనలను విధించింది. లబ్దిదారులు రిజిస్ట్రేషన్ కోసం తమకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్‌మెంట్ పట్టా లేదా ఉత్తర్వుతోపాటు, ఇంటి పన్ను చెల్లించిన రసీదును సమర్పించాల్సి ఉంటుంది. సవరించిన ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం ప్రకారం.. కేవలం పదేళ్ల కాలపరిమితి దాటిన అసైన్డ్ ఇళ్ల స్థలాలకు మాత్రమే ఈ రిజిస్ట్రేషన్ పక్రియ వర్తిస్తుంది. ఒక వేళ అసలు లబ్దిదారుడు మరణించి నట్లయితే, వారి వారసులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. దీని కోసం అసలు పట్టాదారు మరణ ధృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత లబ్దిదారులు తమ వ్యక్తిగత లేదా ఆర్థిక అవసరాల కోసం ఆ భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందవచ్చు. రిజిస్ట్రేషన్ పూర్తయి, పూర్తి హక్కులతో కూడిన అధికారిక డాక్యుమెంట్ చేతికి వచ్చిన 90 రోజుల తర్వాతే ఆ ఇంటి స్థలాన్ని ఇతరులకు అమ్ముకోవడానికి లేదా కొనుగోలు చేయడానికి చట్టబద్ధమైన అవకాశం ఉంటుంది. పదేళ్ల గడువు తీరిన అసైన్డ్ స్థలాలు లేదా గతంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రెగ్యులరైజ్ అయిన ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ,అక్కడ ఇల్లు నిర్మించి ఉంటే రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలని స్పష్టంచేశారు. నకిలీపత్రాలతో వచ్చేవారిపై కఠిన క్రిమినల్‌చర్యలు ఉంటాయి.

## నేడు ఎమ్మెల్యే దామచర్ల గ్రీవెన్స్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు నియోజకవర్గ ప్రజల రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రత్యేక రెవెన్యూ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం శనివారం ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఒంగోలు రూరల్ మండలం, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు తమ రెవెన్యూ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. భూముల సమస్యలు, పట్టాదార్ పాస్‌బుక్లు,రికార్డుల సవరణలు,వారసత్వ హక్కులు, సర్వే సమస్యలు వంటి పెండింగ్ అంశాలపై అధికారులు వినతులు స్వీకరించి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

## ప్రతి రైతు గుర్తింపు కార్డు కలిగి ఉండాలి

**ఉలవపాడు, మే 22, ప్రభాతవార్త**



ప్రభుత్వం అందించే పథకాలు పొందాలంటే ప్రతి రైతు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఉలవపాడు వ్యవసాయ అధికారి విజయకుమార్ తెలిపారు. రైతులకు సంబందించిన ఎరువులు, సబ్సిడీ విత్తనాలు, యంత్ర పరికరాలు, పంట కొనుగోళ్లు, అలాగే అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ వంటి పథకాలు పొందదానికి గుర్తింపు కార్డు అవసరమన్నారు. ప్రతి రైతు మీ దగ్గర లో ఉన్న రైతు సేవా కేంద్రంలో ఆధార్,పొలం పాసుపుస్తకం,ఫోన్ నంబర్ ఇచ్చి రైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు.

6:6.qxd 5/22/2026 11:29 PM Page 1



## మండల స్థాయిలో కిశోరి వికాసంపై ప్రత్యేక సమీక్ష



**సంతనూతలపాడు(మద్దిపాడు), మే 22, ప్రభాతవార్త**

మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణా తరగతుల స్పెషన్స్ ఆరోగ్య మేళాపై ఎంపీడీవో డీఎస్వీ ప్రసాద్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. కిశోర బాలబాలికలకు సంబంధించి తల్లిదండ్రులకు చెందిన కుటుంబ అవసరాలకు సంబంధించి వ్యయం, పొదుపు, ఆర్థిక నిర్వహణ తదితర వాటిపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రసాద్ ఈ సందర్భంగా కోరారు. గ్రామ స్థాయి కమిటీలు కిశోర్ బాలబాలికలను, తల్లిదండ్రులను అన్ని విధాల వారిని చైతన్య పరచాలని ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. డబ్బు, అవసరాలు, కోరికలు, అర్థం చేసుకోవడం, భవిష్యత్తు లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళికలు తయారిపై గ్రామ స్థాయి కమిటీలు వారికి అవగాహన కల్పించాలన్నారు. కిశోర్ బాల బాలికలను అన్ని విధాల అభివృద్ధి కొరకు వారిని మరింతగా చైతన్య పరచాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కే.రఘుబాబు, డిప్యూటీ ఎంపీడీవో జీఎస్డబ్ల్యూఎస్ ఆఫీసర్ హరిప్రసాద్, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు పోలీసు శాఖ ప్రతినిధి కే.వాసు, రెవెన్యూ కార్యాలయ ప్రతినిధి అంకిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు జి.పద్మావతి, సీహెచ్ శివనరాజ తదితరులు పాల్గొన్నారు.

## కిశోర్ బాలబాలికలకు ఆర్థిక నిర్వహణపై మండల స్థాయిలో సమీక్ష



**సంతూతలపాడు, మే22, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణా తరగతుల స్పెషన్ కార్యక్రమంలో భాగంగా కిశోర్ బాల బాలికలు ఆర్థిక నిర్వహణపై ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా 11-18 సంవత్సరాల లోపు గల బాల బాలికలు పొదుపును నేర్చుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. డబ్బు ఆదా చేయడం ద్వారా రేపటి రోజు మంచి జీవితాన్ని ఇస్తుందని తెలిపారు. కిశోర్ బాలబాలికలు పొదుపును తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సావిత్రి, డిప్యూటీ ఎంపీడీవోలు రవికుమార్, అరుణ కుమారి, వెలుగు ఏపీఎం టి.బాబురావు, వెలుగు సీసీ శ్రీనివాసులు, మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఆరోగ్యశాఖ, మండల పరిషత్ వెలుగు తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి



**సంతనూతలపాడు, మే 22, ప్రభాతవార్త**

ఉపాధి పనుల ప్రాంతంలో ప్రమాదానికి గురైన ఉపాధి కూలీలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెం గ్రామంలో ఉపాధి పనికి వెళ్లిన బూరుగ అంకమ్మ ఉపాధి పనులు చేస్తూ ప్రమాదానికి గురై చేయి విరిగినట్టు వారు పేర్కొన్నారు.వైద్యులు అంకమ్మకు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇందుకు లక్ష రూపాయలు వైద్య నిమిత్తం ఖర్చు గానున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అంకమ్మకు వైద్య సేవలు అందించి ఆరోగ్యం కోలుకునే వరకు ఉపాధి పనిలో మస్టర్ వేయాలని వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు విజయ్ కుమార్, జనార్ధన్ తదితరులు



**సంతనూతలపాడు, మే 22, ప్రభాతవార్త**

ఒంగోలు, త్రోవగుంట ప్రాంతంలో గల బృందావనం కళ్యాణ మండపంలో శుక్రవారం నాడు జరిగిన వివాహ వేడుకల్లో నూతన వధూవరులైన దాసరిరాజ్‌కుమార్, అనురేఖలను సంతనూతలపాడు, ఒంగోలు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, దామచర్ల జనార్ధన్‌రావు తదితరులు ఆశీర్వదించారు. మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, రియల్ ఎస్టేట్ దారుడైన దాసరి రమేష్, మద్దిపాడు మండలం ఐసీడీవెస్ సూపర్‌వైజర్ జ్యోతి, కుమారుడు రాజ్ కుమార్ వివాహ వేడుకల్లో వీరు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతిబాబు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్,రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ రంగారావు, సంతనూతలపాడు, మద్దిపాడు మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో పద్మావతి, మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు సావిత్రి శైలజ, నాగరాజా, నాగలక్ష్మి, దేవసేన, ఉష, శ్రీదేవి, పలువురు ఐసీడీఎస్ ఉద్యోగులు, సంతనూతలపాడు మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కే.గోపికృష్ణ,టీడీపీ నాయకులు ఎస్.కొండలరావు, కోతి కోటేశ్వరరావు, దాసరి బాబురావు, ఎడ్లూరి నాగరాజు, అట్లూరి అశోక్, రామారావు, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

## నాగులుప్పలపాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరణ



**సంతనూతలపాడు, మే22, ప్రభాతవార్త**

జిల్లా పరిషత్ ఇన్‌చార్జి డిప్యూటీ సీఈఓగా సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శుక్రవారం నాడు ఒంగోలులో జడ్పీ కార్యాలయంలో బాధ్యతలుచేపట్టారు. అదే విధంగా నాగులుప్పలపాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు బాధ్యతలు తీసుకున్నారు. పలువురు అధికారులు, ఉద్యోగులు సురేష్‌బాబును ఈ సందర్భంగా అభినందించారు.

## పోలీస్ అధికారుల సమీక్షా సమావేశం



**కందుకూరు మే 22,ప్రభాతవార్త**

కందుకూరు సబ్ డివిజన్ పోలీసుశాఖ పనితీరుపై శుకృవారం సమీక్షాసమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కందుకూరు డీఎస్పీ సిహెచ్ వి బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. కందుకూరు సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో డివిజన్‌లోని సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అన్నిరకాల పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో కందుకూరు, టౌన్,రూరల్ ఎస్సైలు పి.శివనాగరాజు, బాలక్రిష్ణ, వీవీపాలెం ఎసైనస మరిదినాయుడు, పొన్నలూరు, ఉలవపాడు,మర్రిపూడి ఎస్సైలతోపాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నేతలకు ఎమ్మెల్యే పరామర్శ



**కందుకూరు మే 22,ప్రభాతవార్త**

కందుకూరు నియోజవర్గంలోని లింగసముద్రం టిడిపి అధ్యక్షులు గాలంకి ప్రసాద్ అనారోగ్యం కారణంగా నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అన్నెబోయినపల్లి టిడిపి నేత ఎందేటి వెంకటేశ్వర్లు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు.వీరిని శుక్రవారం కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు వారి వద్దకు వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్,పారా బుచ్చయ్య,అడపా రంగయ్య రాజవరపు మాలకొండయ్య, ఎందేటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## కంచరగుంటలో అంగన్‌వాడీ కార్యక్రమం



**కందుకూరు మే 20,ప్రభాతవార్త**

కందుకూరు మండలలోని కంచరగుంట సచివాలయం నందు శుకృవారం కిషోర్‌వికాసం కార్యక్రమం నిర్వహించారు. బంగారు బాల్యం యువశక్తి మిషన్ కింద మే 1నుండి జూన్ 9 వరకు జరుగుతున్న సమ్మర్ శిక్షణ కార్యక్రమాలలో బాగంగా సతీ గ్రూప్ 11నుండి 18 సంవత్సరాల పిల్లలుకి ఆర్థకనిర్వాహణ,మరియు పొదుపు బడ్జెట్ ప్లానింగ్, నెలవారీ బడ్జెట్ జామాఖర్చుల వివరాలు,భవిష్యత్ అవసరాల నిమిత్తం డబ్బు పొదుపుచేయడం తదితర అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సూపెర్వైసర్ యల్ లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్త పి.స్వాతి,ఆయా, ఏయన్ఎం సుమతి,ఆశావర్కర్ హేమలు పాల్గొన్నారు.

## పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు

**- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలి**

**- వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్ భాష**



**రాచర్ల, మే 22, ప్రభాతవార్త**

మండలంలోని రైతులు ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్ భాష అన్నారు. మండలంలోని చోళవీడు గ్రామంలో శుక్రవారం ఆయన ఎల్‌నినో ద్వారా వ్యవసాయంలో ఏర్పడే సమస్యలపై రైతులకు వివరించి వాటిని ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని కాబట్టి రైతులు ఆరుతడి పంటలైన సజ్జ, కొర్ర, మినుము, పెసర పంటలు సాగు చేస్తే రైతులకు మేలు జరగడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. తొలకరికి ముందే పిఎండిఎస్ పద్ధతి అనుసరించాలని దీనివల్ల తక్కువ నీటితో పంట సాగు అవుతుందన్నారు. ఉద్యానవన శాఖ అధికారి డి శ్వేత మాట్లాడుతూ పండ్ల తోటల రైతులు తమ పొలాల్లో ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవడానికి ఉపయోగ పడతాయన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే నీటి కొరతను తగ్గించడంలో మల్చింగ్ ఉపయోగకరమని రైతులకు తెలిపారు అధికారులు సూచనలు పాటిస్తే కరువు నివారణ చేపట్ట వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎల్ఎస్ ఏడి సుప్రియ, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ హజరత్ మౌలాలి సాహెబ్ స్వామి ఉరుసు మహోత్సవం

**రాచర్ల మే 22, ప్రభాతవార్త**

మండలంలోని జెపి చెరువు బస్టాండు నందు వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ హజరత్ మోలాలి సాహెబ్ వారి 5వ ఉరుసు మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్ షేక్ సుభాని స్వామి వారికి పూజా కార్యక్రమాలను జరిపించారు. ఉదయం 8 గంటలకు స్వామివారి దర్శనం, సాయంత్రం 5:30 గంటలకు స్వామివారికి గంధం, తదుపరి అక్కపల్లి గ్రామంలో స్వామివారి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా నేడు శనివారం ఉదయం 8 గంటలకు రెండు పండ్ల విభాగం ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉపాధిపనిలో పర్యవేక్షణ లోపభూయిష్టం

**- మోపాడులో ఉపాధిహామీ పథకం**



**కందుకూరు మే 22,ప్రభాతవార్త**

కందుకూరు మండలంలోని మోపాడు చెరువులో సుమారు 300మందికి పైగా కూలీలు శుకృవారం ఉపాధిహామీపథకం పనిలో నిమగ్నమైనారు.వీరంతా చెరువులో పూడికతీత పనుల్లో ఉన్నారు.చెరువు కట్ట దెబ్బతింది. లోతట్టు ప్రాంతంలో మట్టింతా కొట్టకుపోయి గోతులు పడ్డాయి.కూలీలు చెర్లో మట్టిని తవ్వి కట్టకు పోస్తున్నారు. అయితే కూలీలు బారీగా పనిలో నిమగ్నమైనప్పటికిని అధికారుల పర్యవేక్షణ కొరవైంది.ప్రోగ్రాం ఆఫీసర్‌గానీ, ఏపీవోగానీ,సాంకేతిక సహాయకులుగానీ ఇటీవల కాలంలో పరిశీలించిన దాఖలాలు లేవు.సకాలంలో మస్టర్ వేయడంలోనూ,పేస్ ఐడింటిపై చేయడంలోనూ పలు లోపాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం కూలీలకు సమకూర్చాల్సిన నీడ, నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వసతుల జాడ కనిపంచకపోవడం గమనార్హం.ఈ విషయమై పీల్డ్ అసిస్టెంటు శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు 1200విస్తీర్ణం గల ఈ చెరువు కింద సుమారు 4వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు.ఈ పూడికతీత పనుల వలన చెరువు కట్ట బలోపేతం అవుతుందన్నారు.

## ఉపాధి పనిని పరిశీలించిన కార్మిక సంఘం



**వలేటివారిపాలెం మే 22,ప్రభాతవార్త**

మండలంలోని నలదలపూరు,కొండారెడ్డిపాలెం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనిని శుకృవారం వ్యవసాయకార్మికసంఘం మరియు సీఐటీయూ నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నేతలు జీవీబీ కుమార్,దువ్వూరు జాన్‌లు మాట్లాడుతూ ఉపాధిహామీ పనిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే రెండూ పూటలా పనిని పెట్టటం, పేస్ యాప్‌ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. బడ్జెట్‌లో ఈ పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించిందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పనిప్రదేశంలో వసతులు మెరుగుపరచాలన్నారు.ఉపాధి హామీ పనిని బలోపేతం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్‌లు బిల్లా బ్రహ్మయ్య,యాకోబు,దార్ల మాల్యాద్రి,బీరకాయల వేణు,గంగోలు విజయమ్మ, పుల్లగూర లక్ష్మమ్మ, దువ్వూరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం



**కందుకూరు మే 20,ప్రభాతవార్త**

కందుకూరు శ్రీరామ్‌నగర్ కాలనీలో వాటర్‌ట్యాంక్ వద్ద శుకృవారం గుర్తుతెలియని మృతదేహం వెలుగులోకి వచ్చింది. సుమారు 55 సంవత్సరాల వయస్సు గల మగవ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు టౌన్ ఎస్ఐ పులి శివనాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి శవమును కందుకూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ శవాగారమునకు తరలించారు. మృతుడు వడదెబ్బ వలన చనిపోయి ఉండవచ్చునని పోలీసులు అంచనావేస్తున్నారు.ఈ వ్యక్తి సమాచారం నిమిత్తం సెల్ నం.9121102203కి ఫోన్ చేసి తెలియపరచాల్సిందిగా ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**నాగులుప్పలపాడు, మే 22, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు అమ్మనబ్రోలు గ్రామాల మధ్య గుర్తు తెలియని మృతదేహాన్ని నాగులుప్పలపాడు పోలీసులు కనుగొన్నారు. పూర్తి వివరాల కోసం పోలీసులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. నాగులుప్పలపాడు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సంచార జాతులకు రాజ్యాధికారం అందించాలి



**నాగులుప్పలపాడు, మే 22, ప్రభాతవార్త**

సంచార జాతులకు రాజ్యాధికారం దక్కిన నాడే నిజమైన రాజ్యాంగ నిర్మాతబీఆర్ అంబేద్కర్ కల సాకారం జరుగుతుందని రాష్ట్ర సంచార జాతుల కన్వీనర్ పొగడ్త నారాయణ తెలియజేశారు. శుక్రవారం ఒంగోలులో బీసీవై రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌ను నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచార జాతులైన మొండిబండ, బుడబుక్కల, బొమ్మలాట, దొమ్మరి, ఆడ బుడబుక్కల, పాములవాళ్ళు, మొండి పాములు, తదితర కులాలకు చెందిన వారికి ఈ రోజుకి రాజకీయ గుర్తింపు లేదని వారి ఓట్లతో గద్దెనెక్కుతున్నారని, ఆ జాతుల అభివృద్ధికి కృషి చేయటం లేదని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్‌కు ఆ కులాల సమస్యను వారికి వివరించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సాయాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి



**చీరాల,మే 22, ప్రభాతవార్త**

ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా విద్యార్థులకు సమ్మర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంపు నిర్వహించి జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఆరాట పడుతున్న సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు బొనిగల ప్రేమయ్య గ్రౌండ్‌నందు క్రమం తప్పకుండా నలభై రోజులు విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్నందుకు,వారికి కూడా మా అసోసియేషన్ తరుపున పౌష్టికాహారంనకు తోడ్పాటు అందించాలని ఉద్దేశంతో రూ.4వేలు నగదు అందజేసి, విద్యార్థులు భాగా కోచింగ్ తీసుకుని క్రీడలలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేయడం జరిగింది. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ,చారగుళ్ళ గురుప్రసాద్, వలివేటి మురళీకృష్ణ,నారాయణమూర్తి, వీరాంజనేయులు,పాలేటి సింగయ్య, శ్రీనివాసరావు, చక్కచెన్న నారాయణ, సాంబశివరావు, హనుమంతరావు, క్రీడాకారుడు ,రమ్మికుమార్, కోచ్ ప్రసన్న కుమార్, విద్యార్థులు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## కిశోరి బాలికలకు ఆర్థిక నిర్వహణపై అవగాహన



**పొన్నలూరు, మే 22 ,ప్రభాతవార్త**

మండలంలోని పెద వెంకన్నపాలెంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కిశోరి బాలికలకు ఆర్థిక నిర్వహణ, డబ్బును పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవడం, ఎమర్జెన్సీ ఫండ్ అవసరం, అనవసర ఖర్చులను తగ్గించడం, అవసరాలు-కోరికల మధ్య తేడా వంటి అంశాలపై అవగాహన కల్పించారు.బాలికలు చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్లు, హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండె పోటుతో విశ్రాంతి ప్రిన్సిపాల్ మృతి



**తాళ్లూరు, మే 22,ప్రభాతవార్త**

మండలంలో నాగంబొట్లపాలెం గ్రామానికి చెందిన విశ్రాంతి ప్రిన్సిపాల్ వంగాల మస్తాన్‌రెడ్డి చార్‌దామ్ యాత్రకు వెళ్లి గుండె పోటుతో విశ్రాంతి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వంగల మస్తాన్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో వారం రోజుల క్రితం చార్‌దామ్ యాత్రకు వెళ్లారు. యాత్రలో భాగంగా యమునాత్రికి 2 కిలో మీటర్లు దూరం ఉండగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు జానకీ చట్టీ అనే పట్టణంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని విమానంలో జానకీ చట్టీ నుంచి ఢిల్లీకి విమాశ్రాయానికి తీసుకొని వచ్చారు. మృతదేహాన్ని ఢిల్లీ నుంచి చెన్నైకు విమానంలో తరలించారు. చెన్నై నుంచి తమ స్వగ్రామమైన నాగంబొట్లపాలెం గ్రామానికి శుక్రవారం రాత్రికి తరలించి, రేపు ఉదయం అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. .తాళ్లూరుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బొడ్డు కోటిరెడ్డి ముగ్గురు అల్లుళ్ళు వారి లో మస్తాన్ రెడ్డి పెద్దఅల్లుడు.మస్తాన్ రెడ్డి గతంలో తాళ్లూరు వీకే ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గాచేశారు.మార్టూరులో ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తు పదవీరమణ పొందారు.మృతుడికి భార్య,ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.అందరికి వివాహాలు అయ్యాయి. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## జాతీయ తైక్వాండో పోటీల్లో చైతన్య ఎలీట్ విద్యార్థుల పతకాల పంట

**- ప్రత్తిపాటి పుల్లారావు అభినందన**



**నాగులుప్పలపాడు,మే22,ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో ఈనెల 15, 16, 17 తేదీల్లో జరిగిన 16వ ఓపెన్ తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో చిలకలూరిపేట చైతన్య ఎలీట్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 23 రాష్ట్రాల నుంచి 2250 మంది పాల్గొన్న ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో ఎం. మద్దూరి ప్రణీత బంగారు పతకం, భవ్యశ్రీ రజత పతకం, క్యాడేట్ విభాగంలో హనీఫా రజత పతకం, సబ్ జూనియర్‌లో భార్గవ్ నాగసాయి కాంస్య పతకం, జూనియర్ విభాగంలో గణేష్ కాంస్య పతకం సాధించారు. విజేతలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలోవారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తైక్వాండో ఆత్మరక్షణ విద్య మాత్రమే కాదని, చురుకుదనం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుందని, స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాల్లో 3 రిజర్వేషన్ ఉందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు స్కూల్ ఏవో రామకృష్ణ, కోచ్ సంధిపోగు.అనూరాధయ్యను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## వెంకట రామిరెడ్డికి నివాళులర్పించిన నేతలు



**తాళ్లూరు, మే 22,ప్రభాతవార్త**

తాళ్లూరు మండల విశాలాంధ్ర విలేఖరి తూము శ్రీనివాస్ రెడ్డి తండ్రి తూము వెంకట రామిరెడ్డి(87) వయో భారంతో గురువారం రాత్రి మృతి చెందారు. ముండ్లమూరు మండలం లక్ష్మీ నగర్ గ్రామంలో తన నివాసంలో తుది శ్వాస విడిచారు. మృతదేహానికిపలువురు నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు .రామిరెడ్డి విద్యాశాఖ కమిటీ అధ్యక్షులుగా పనిచేశారు.అయన కుమారుడు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్ రెడ్డి,జిల్లా రైతు విభాగం కార్యదర్శి సంగు కొండా రెడ్డి, రైతు విభాగం ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుమ్మిత చిన్న నాగిరెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు గువ్వల వెంకట శ్రీనివాసులరెడ్డి,తదితరులు ఉన్నారు.

## టీడీపీ నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**లింగసముద్రం, మే 22, ప్రభాతవార్త**

లింగసముద్రం గ్రామ టీడీపీ అధ్యక్షులు గాలంకి ప్రసాద్, అనారోగ్యం కారణంగా నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అలాగే లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామ టీడీపీ నాయకులు అందేటి వెంకటేశ్వర్లు, ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు వారిద్దరి దగ్గరకు వెళ్లి పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాలంకి ప్రసాద్ ఆరోగ్యం గురించి డాక్టర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, పారా బుచ్చయ్య,అడపా రంగయ్య, రాజవరపు మాలకొండయ్య, ఎందేటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## వైభవంగా కోదండరామస్వామి కళ్యాణోత్సవం





**సీఎస్‌పురం, మే 22, ప్రభాతవార్త**

మండలంలోని రెడ్డిగారిపల్లె శ్రీ కోదండరామస్వామి, అభయ ఆంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల కార్యక్రమంలోభాగంగా శుక్రవారం శ్రీ కోదండరామస్వామి వారి శాంతి కళ్యాణం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు అర్చకులు చిమటా కార్తిక్ అనుమల వెంకట భరద్వాజ్ రుత్వీకరణలో వైభవంగా పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. అదే విధంగా కోదండరామస్వామి ఆలయం వద్ద గణపతి హోమం, పుణ్యాహవచనం, పూర్ణాహుతి నిర్వహించారు. తదుపరి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులకు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా శాంతి కళ్యాణం నిర్వహించారు. అనంతరం రాత్రికి సామూహిక కుంకుమపూజ నిర్వహించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారామ లక్ష్మణ హనుమం ఉత్సవమూర్తులకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబాల చిన వెంకటరెడ్డి, అంబాల చంద్రశేఖర్‌రెడ్డి, దుద్దుకూరి శ్రీనివాసులు, అర్చకులు సాయి కృష్ణ, కొమాండూరి హరీష్, దేవస్థాన కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## వర్షపు నీటితో సిమెంట్ రోడ్లు జలమయం



ట్రంక్ రోడ్డు పై నిలిచిన నీరు

**సింగరాయకొండ, మే 21, ప్రభాతవార్త**

పట్టణంలోని ట్రంక్ రోడ్డులో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లపై శుక్రవారం ఉదయం భారీగా కురిసిన వర్షపు నీరు నిలిచిపోయింది. నీరు పారేందుకు సరైన మార్గం లేకపోవడంతో రోడ్లు చెరువులను తలపించేలా మారాయి. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు ప్రారంభ దశలోనే దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాలువలు పూర్తిగా పూడిపోవడం, కొంతమంది వ్యాపారులు తమ దుకాణాల ముందు రోడ్డు కంటే ఎత్తుగా గ్రావెల్ పోసుకోవడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో వర్షపు నీరు బయటకు వెళ్లక రోడ్లపైనే నిలిచిపోయింది.అదేవిధంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ సమయంలో పక్కనున్న మార్జిన్ ప్రాంతాలను లెవెలింగ్ చేయకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేసిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు కంటే పక్కభాగం ఎత్తుగా ఉండటంతో నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొంటున్నారు.వర్షపు నీటిపై నిరంతరం వాహనాల రాకపోకలు కొనసాగితే సిమెంట్ రోడ్లు త్వరలోనే దెబ్బతింటాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రపరచడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరుతున్నారు. స్పందించిన పంచాయతీ కార్మికులు కాలువ చేసి నీటిని బయటకు మళ్లించారు.

7:7.qxd 5/22/2026 11:32 PM Page 1



## అధిక లోడ్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ చర్యలు

### - పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

**మార్కాపురం, మే 22 ప్రభాతవార్త**





పట్టణంలో విద్యుత్ అధిక లోడ్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఎస్ఈ, డి ఈ, ఏడీఈ సియా నాయక్, టౌన్ ఏఈ యశోద ఆధ్వర్యంలో అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో ఒక్కొక్కటిగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తున్నారు. ఇప్పటికే రాఘవేంద్ర ఫర్నిచర్స్ ప్రాంతం, జగదీశ్వరి థియేటర్ పరిసరాలు, 10వ వార్డులోని పీర్లచావిడి ప్రాంతం, విజయ టాకీస్ ఏరియాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం పూలసుబ్బయ్య కాలనీ 9వ సచివాలయం పరిధిలో కూడా అధిక లోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో తరచూ ఎదురవుతున్న విద్యుత్ అంతరాయాలు తగ్గి ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని అధికారులు తెలిపారు. స్థానికులు విద్యుత్‌శాఖ అధికారుల చర్యలను అభినందించారు.

## జిల్లా విద్యాభివృద్ధికి సహకారం అందిస్తాం

### - డీఈఓ సామ సుబ్బారావును కలిసిన యూటీఎఫ్ నాయకులు

**మార్కాపురం, మే 22, ప్రభాతవార్త**



ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మార్కాపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. జిల్లాలో పాఠశాల విద్యాభివృద్ధికి యూటీఎఫ్ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు కీలక సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఏర్పాటై ఐదు నెలలు గడిచినా ఇప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, సమగ్ర శిక్ష అభివృద్ధి కార్యాలయాలకు అవసరమైన సిబ్బంది నియామకాలు జరగలేదని పేర్కొన్నారు. ఈ సమస్యను గతంలో కూడా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే గత విద్యా సంవత్సరంలో నియమితులైన అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. మార్కాపురంలో విద్యాశాఖ కార్యాలయాలు అలంకారప్రాయంగా మారాయని, పూర్తి స్థాయిలో వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది నియామకానికి యూటీఎఫ్ తమ వంతు కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఓవి వీరారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ బి శ్రీరాములు, జిల్లా కార్యదర్శులు వై పాపయ్య, ఎఐ రవికుమార్, యు వెంకట్రావు, ఆర్‌పి శ్రీనివాస్, డి.యలమందారెడ్డి, వినోద్ కుమార్, విసిహెచ్ వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, టి సుబ్బారావు, శ్రీనివాస్ నాయక్, ఎస్‌కె రహమాన్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పాత స్టాక్‌కు పాత రేటే

### - ఎంఆర్పీకి మించి అమ్మితే చర్యలు - ఏడిఏ బాలాజీ నాయక్

**మార్కాపురం, మే 22, ప్రభాతవార్త**



మార్కాపురం మండలంలోని ఎరువుల డీలర్లతో గురువారం ఏడీఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి కే బుజ్జిబాయి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ పాత స్టాక్‌లో ఉన్న ఎరువులను బస్తాపై ముద్రించిన పాత ఎంఆర్పీ రేటుకే మాన్యువల్ బిల్లుతో విక్రయించాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఎరువులను మాత్రం కొత్త ఎంఆర్పీ ప్రకారం ఈపాస్ యంత్రం ద్వారా బిల్లు ఇచ్చి విక్రయించాలన్నారు. ఖరీఫ్-2026 సీజన్‌లో ఎరువుల సరఫరా పూర్తిగా యాప్ ద్వారా రైతులకు అందించాల్సి ఉంటుందని, డీలర్లు యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఎరువులను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని, రైతులు అధిక పరిమాణంలో ఎరువులు కోరినప్పుడు మండల వ్యవసాయ అధికారుల అనుమతితోనే ఇవ్వాలని సూచించారు. రైతు అడిగిన వెంటనే కొనుగోలు రశీదు ఇవ్వాలని, ప్రతి ఎరువుల దుకాణంలో ఎంఆర్పీ ధరల బోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈఓ సునీల్ నాయక్‌తో పాటు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్రాలను సద్వినియోగపరుచుకోవాలి

**చీరాల, మే 22, ప్రభాతవార్త**



చిన్నగంజాం మండలంలోని వెలుగు డీఆర్‌డీ ఆధ్వర్యంలో అధ్యక్షులు శారదమ్మ అధ్యక్షతన మండలంలో ఉన్న చిన్న సన్నకారు రైతుల కోసం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్, ఉద్యాన శాఖ అధికారిణి అలేఖ్య ఏవో మాట్లాడుతూ వెలుగు డీఆర్డీ ఆధ్వర్యంలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల మండలంలో ఉన్నటువంటి చిన్న సన్న కారు రైతులకు కావాల్సిన వ్యవసాయ యాంత్రిక పరికరాలను అద్దెకు ఇవ్వడానికి ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ సెంటర్లో ట్రాక్టర్, నాగలి, డ్రోన్, రోటవేటర్లు, గన్స మొదలగు యంత్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ ఈ సీహెచ్‌సీ సెంటర్ వల్ల తక్కువ ధరలకు రైతులకు వ్యవసాయ యాంత్రిక పరికరాలను ఇవ్వడానికి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటస్వామి, మాధవి, శ్రీలక్ష్మి, ఏపీఎంఐపీ షరీఫ్, జెడ్‌బీఎస్ఎఫ్ వీఓఏలు పాల్గొన్నారు.

# మార్కాపురం వార్త



## పాలూరులో సంపద కేంద్రాన్ని పరిశీలన

**కందుకూరు మే 22,ప్రభాతవార్త**

కందుకూరు మండలంలోని శ్రీరంగరాజపురం పాలూరు దొండపాడు గ్రామపంచాయితీలోని చెత్తసంపద కేంద్రాలను కందుకూరు డివిజనల్ పంచాయతీ అధికారి కె.కృష్ణమోహన్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో తడి చెత్త పొడి చెత్త సేకరణ మరియు ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ గురించి ఆయన ప్రజలకు వివరించారు. తడి చెత్తను పొడి చెత్తను విడివిడి గాగ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలన్నారు. తద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పొడిచెత్తను స్వచ్ఛ రథంనకు ఇచ్చి దానివిలువ ఆధారంగా ఇంట్లోకి అవసరమైన వస్తువులను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు డి.హనుమంతరావు, వై.యశోదర, మండల అభివృద్ధిఅధికారిపి.రత్నజ్యోతి, గ్రీను అంబాసిడర్లు స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ మెడబలిమి రమణయ్య తదితరులు పాల్గొన్నారు



## కంభంలో సిసి కెమెరాల ఏర్పాటు

**కంభం, మే 22, ప్రభాతవార్త**



కంభం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో గ్రామ పెద్దల సహకారంతో సుమారు10 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కంభం ఎస్సై శివ కృష్ణారెడ్డి తెలిపారు. కంభం పట్టణంలోని హైవే బ్లాక్‌స్పాట్, శివాలయం, రామాలయం, ఆంజనేయ స్వామి దేవస్థానం, పలు ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళల భద్రత, ఆస్తి సంబంధిత నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## సత్వర సమస్యల పరిష్కారమే పిజిఆర్ఎస్ లక్ష్యం

### - అందిన అర్జీలు నెలలోపే పరిష్కరించే విధంగా చర్యలు - జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత





**మార్కాపురం, మే 22, ప్రభాతవార్త**

ప్రజలసమస్యలను వేగవంతంగా పరిష్కరించడమేనియోజకవర్గస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని మాధవి గ్రాండ్ ఇన్‌లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను నెలలోపే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులుపరిశీలనలు నిర్వహించి, ప్రతిఅర్జీకి సరైనపరిష్కారం చూపాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారంలో మరింత బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా స్పందించేందుకు ఈ నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రారంభించిందని, వాటిని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సమస్యల పరిష్కారం జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మొత్తం 71 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో రెవెన్యూకు సంబంధించినవి 40 కాగా, ఇతర సమస్యలపై 31అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్‌పి శ్రీనివాసులు, డీఆర్వో వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, హౌసింగ్ పీడీ మోహన్ రావు, పంచాయతీరాజ్ జిల్లా అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఎల్డీవో బాలు నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ సుబ్బారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలంటే రైతులంతా ఏకం కావాలి

### - మార్కాపురం జిల్లా రైతు సంఘం తొలి మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

**మార్కాపురం, మే 22,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా రైతు సంఘం తొలి మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్యవి కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాల విధానాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కాపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన మార్కాపురం జిల్లా రైతు సంఘం తొలి మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా రైతులంతా ఏకం కావాలని, రైతు వ్యతిరేక విధానాలనుఅడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేసే రైతుల సంఖ్య మరింత తగ్గిపోతుందని హెచ్చరించారు. రైతు పెట్టిన పెట్టుబడికి కనీసం లాభం వచ్చేలా చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే విధానం అమలు చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా రైతులు సంఘటితమైతే ప్రభుత్వాలు కూడా దిగివచ్చే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీలో రైతులు 13నెలల పాటు చేసిన ఉద్యమం తో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిన విషయాన్ని గుర్తు చేశారు. చైనాలో మాదిరిగా పంటలకు ముందుగానే ధరలు ప్రకటించే విధానం భారతదేశంలో కూడా అమలుచేయాలని సూచించారు. విత్తన చట్టాలలో మార్పులు చేసి రైతులకుఅన్యాయం జరుగుతోందని విమర్శించారు .ఎరువుల సరఫరా, మార్కెట్ల నిర్వహణలో ప్రభుత్వాలు బాధ్యత నుంచి తప్పుకోవడంతో రైతులపై భారం పెరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పత్తి, శనగ, వర్జీనియా పొగాకు వంటి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోయారని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా పూర్తికాకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాయలసీమ జిల్లాలకు ఇస్తున్న విధంగా మార్కాపురం జిల్లాకు కూడా ప్రత్యేకనిధులు కేటాయించి వ్యవసాయాభి వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లారైతు సంఘం నాయకులు, మార్కాపురం జిల్లా రైతు సంఘ ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. విధానాలను అడ్డు కోవాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేసే రైతులసంఖ్య మరింత తగ్గిపోతుందని హెచ్చరించారు. రైతు పెట్టిన పెట్టుబడికి కనీసం లాభం వచ్చేలా చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.




రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే విధానం అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా రైతులు సంఘటితమైతే ప్రభుత్వాలు కూడా దిగివచ్చే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీలో రైతులు 13 నెలల పాటు చేసిన ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిన విషయాన్ని గుర్తు చేశారు. చైనాలో మాదిరిగా పంటలకు ముందుగానే ధరలు ప్రకటించే విధానం భారతదేశంలో కూడా అమలుచేయాలని సూచించారు. విత్తనచట్టాలలో మార్పులు చేసి రైతులకుఅన్యాయం జరుగుతోందని విమర్శించారు .ఎరువుల సరఫరా, మార్కెట్ల నిర్వహణలో ప్రభుత్వాలు బాధ్యత నుంచి తప్పుకోవడంతో రైతులపై భారం పెరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పత్తి, శనగ, వర్జీనియా పొగాకు వంటి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోయారని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా పూర్తికాకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాయల సీమ జిల్లాలకు ఇస్తున్న విధంగా మార్కాపురం జిల్లాకు కూడా ప్రత్యేక నిధులుకేటాయించి వ్యవసాయాభి వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లారైతు సంఘం నాయకులు, మార్కాపురం జిల్లా రైతు సంఘ ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## డిజిటల్ అరెస్టు కేటుగాళ్ళు.. అరెస్టు

- విశ్రాంతి ఉద్యోగి నుండి రూ.26.50 లక్షల స్వాహా
- నిందితులను అరెస్టు చేసిన టూ టౌన్ పోలీసులు
- నిందితుల నుండి రూ.10లక్షలు, 3 ల్యాప్‌ట్యాప్‌లు, ఫోన్లు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ మొయిన్

**చీరాల టౌన్, మే22, ప్రభాతవార్త**

డిజిటల్ అరెస్టు పేరుతో ఓ విశ్రాంతి ఉద్యోగిని బెదిరించి రూ.26.50 లక్షలు కాజేసిన సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్ళ ముఠాను చీరాల టూటౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10లక్షలు నగదు, మూడు ల్యాప్‌ట్యాప్‌లు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై శుక్రవారం చీరాల టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ శశి కుమార్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేవంకు డీఎస్పీ మొయిన్ హాజరై మీడియాకు కేసు వివరాలను వెల్లడించారు. చీరాల టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కే.మోహన్‌రావును సైబర్ నేరస్తులు సోషల్ మీడియా ద్వారా సంప్రదించి తాము పోలీసులమని నమ్మబలికారు అన్నారు. అతనిపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని భయభ్రాంతులకు గురి చేసి కేసు నుండి బయటపడాలంటే డబ్బులు చెల్లించాలని బెదిరించారన్నారు. దీంతో బాధితుడు భయభ్రాంతులకు గురై విడతల వారీగా రూ.26.50 లక్షలు నగదును వారి ఖాతాల్లో జమ చేశాడు. అనంతరం మోసపోయానని గ్రహించిన బాధితుడు మార్చి 30న చీరాల టూటౌన్ పోలీసులను ఆశ్రయించి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు అన్నారు. దీంతో వెంటనే సైబర్ నేరగాళ్ళపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాపట్ల ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలోని టెక్నికల్ బృందం సహాయంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి బాధితుడి నుంచి తీసుకున్న నగదు మూడు వేర్వేరు బ్యాంకు ఖాతాల ద్వారా బదిలీ అయినట్లు గుర్తించారు. చీరాల టూటౌన్ సీఐ శశికుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం విశాఖపట్టణానికి వెళ్లి ఆ ప్రాంతంలో నిఘా నిర్వహించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ సైబర్ క్రైంలో ఏ1 గా ఉన్న బొందలపు గోవింద్ రూ.14లక్షలు, ఏ 2గా ఉన్న నాగ ప్రదీప్ అకౌంట్ రూ.8లక్షలు, ఏ3 గా ఉన్న నీల్ కుమార్ నుండి రూ.2లక్షలు అకౌంట్‌లలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగింది అన్నారు. వారి వద్ద నుండి మొత్తంగా రూ.10లక్షలు నగదును, 2ల్యాప్‌టాప్‌లు , 6 మొబైల్ ఫోన్లు, 4 పాస్‌పోర్టులు, 1 పెన్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరితో ఇదే తరహాలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిని కూడా త్వరలో పట్టుకుంటామని అన్నారు. నూతన సీఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సైబర్ క్రైమ్ కేసును వేగంగా ఛేధించి పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసిన చీరాల టూటౌన్ సీఐ ఏ.శశికుమార్‌ను పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. వీరితో పాటు ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు, ఏఎస్సై మురళి, హెచ్‌సీ జి.మల్లేష్, ఐటీ కోర్ బృందం ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్సై జిమా, కానిస్టేబుళ్ల నాగూర్, శ్రీనివాస్, బాలాజీ, రాజేష్, ఆంజనేయులు, శివకృష్ణ, మహిళా పోలీసు శివపార్వతి, హెచ్‌జీ ప్రభాకర్‌లను డీఎస్పీ మొయిన్ ప్రత్యేకంగా అభినందించారు.



## కార్మికుల ఆటోను ఢీకొన్న కారు

### - ముగ్గురికి తీవ్ర గాయాలు - ఇద్దరికి స్వల్ప గాయాలు





**సింగరాయకొండ, మే 21, ప్రభాతవార్త**

మండల పరిధిలోని పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై ఒంగోలు నుండి కావలి వైపు అతి వేగంతో రాంగ్ రూట్లో వెళ్తున్న కారు ఆటోను డికొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడి, ఇద్దరు స్వల్ప గాయాలు సంఘటన శుక్రవారం ఉదయం పెరల్ డిస్టలరీ ఫ్యాక్టరీ ఎదురుగా జరిగింది. పోలీస్ తెలిపిన వివరాలు మేరకు సింగరాయకొండ పట్టణం నుంచి పెరల్ డిస్టలరీ ఫ్యాక్టరీకి పనికి వెళ్తున్న కార్మికుల ఆటోను రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఆటోను బలంగా ఢీకొట్టింది. దీనితో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు కార్మికులైన ఆటో డ్రైవర్ ఎస్‌కే ముస్తఫా, లక్షి ్మ, రమాదేవికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌తో పాటు హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రోజువారీగా పని కోసం వచ్చే కార్మికులు జాతీయ రహదారి దాటే సమయంలో అవసరమైన భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ సూచనలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

## వాహనాల హెడ్‌లైట్లే ఆధారం

### - మార్కాపురం హైవేపై దయనీయ పరిస్థితి - రాత్రివేళ ప్రయాణమే భయం

### - మార్కాపురం రైల్వే స్టేషన్ రోడ్డుపై చీకటి రాజ్యం



**మార్కాపురం,మే 22,ప్రభాతవార్త**

ఇంటి దీపం లేక పొరుగింటి వెలుగు చూసుకోవాల్సిన పరిస్థితి" అన్నట్టుగా మార్కాపురం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్-పట్టణం హైవే రహదారిపై పరిస్థితి మారింది. రాత్రివేళల్లో అక్కడ కనిపిస్తున్న వెలుగులు వీధి దీపాలవి కావు రాకపోకలు సాగిస్తున్న వాహనాల హెడ్‌లైట్లే ప్రయాణికులకు దారి చూపిస్తున్నాయి. కీలకమైన ఈ హైవే మార్గం ఇప్పటికీ అంధకారం లోనే ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనవ్యక్తంచేస్తున్నారు. మార్కాపురం రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలనుంచి వేలాది మంది ప్రయాణికులు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల ద్వారా శ్రీశైలం దేవస్థానానికి వెళ్తుంటారు. అలాగే జిల్లా కేంద్రం కావడంతో హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ ఈ మార్గాన్నే ఉపయోగిస్తున్నాయి. ఇంత రద్దీగా



ఉండే రహదారిపై సరైన వీధి దీపాలు లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రాత్రి సమయంలో టూ వీలర్ వాహనదారులు, పాదచారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి కారణంగా ప్రమాదాల భయం వెంటాడుతోంది. చీకట్లో నడిచే వాడికే గుంతల బాధ తెలుస్తుంది" అన్నట్టుగా ప్రతిరోజూ ఈ రహదారిపై ప్రయాణించే వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు స్థానికులు, ప్రయాణికులు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో అసహనం వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలోనే ఈ దుస్థితి ఉంటే గ్రామీణ



ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో నని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే హైవేమార్గంలో వీధి దీపాలు ఏర్పాటుచేసి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన కనిగిరికి గర్వకారణమైన అర్హాన్



**కనిగిరి, మే 22, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని ముగ్గుబావి వీధికి చెందిన సాదిక్ కుమారుడు సయ్యద్ అర్హాన్ ప్రభుత్వ సైనిక్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం పొందడం పట్టణ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ప్రతిష్ఠాత్మక సైనిక్ స్కూల్‌లో సీటు సాధించడం ద్వారా అర్హాన్ కనిగిరికి గర్వకారణంగా నిలిచాడు. చిన్న వయసులోనే క్రమ శిక్షణ, దేశసేవ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో పని చేసే సైనిక్ స్కూల్‌లో అడుగుపెట్టడం అతని కుటుంబ సభ్యులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కలిగిరి సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందిన అర్హాన్‌కు పలువురు విద్యావేత్తలు, స్థానికులు అభినందనలు తెలిపారు. సైనిక్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సైనిక శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, దేశభక్తి భావనలు పెంపొందించే ప్రత్యేక అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించి కనిగిరికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

## సమాజ్ వాది నుంచి బీసీవై వరకు నజీర్ భాషా కొత్త రాజకీయ ప్రయాణం

### - 2024లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన నజీర్ భాషా ఇప్పుడు బీసీవైలో కీలక అడుగు



**కనిగిరి, మే22, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గానికి చెందిన రాజకీయ నాయకుడు షేక్ నజీర్ భాషాబీసీవై పార్టీలో చేరారు. బీసీవై రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ సమక్షంలో ఆయన తన అనుచరులతో కలిసిఘనంగా పార్టీలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. షేక్ నజీర్ భాషా గతంలో సమాజ్ వాది పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగంలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అదే పార్టీ తరుపున కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల సమాజ్ వాదీ పార్టీకి రాజీనామా చేసిన ఆయన తాజాగా శుక్రవారం బీసీవై పార్టీలో చేరడం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నజీర్ భాషా మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రత్యేకంగా పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి ప్రజల తరుపున పోరాటం చేస్తానన్నారు. పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీఏ బాధ్యత అప్పగించినా నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బీసీవై పార్టీని ప్రజల్లో మరింత బలోపేతం చేసి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌ను నజీర్ భాషా తన అనుచర వర్గంతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో వికలాంగునికి బ్యాటరీ సైకిల్ అందజేత





**యర్రగొండపాలెం, మే22, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ జరిగింది. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా,వాటిని పరిశీలించారు. సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా సంప్రదించారు. విషయం అధికారి దృష్టికి తీసుకొనిపోయి పరిష్కారం అయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరింపచేశారు. మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు. ప్రతి వినతిపత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం యర్రగొండపాలెం పట్టణానికి చెందిన దివ్యాంగుడైన అల్లూరి శివనారాయణకు రూ.58వేల రూపాయలు విలువ చేసే బ్యాటరీ వాహనాన్ని అందించి మంచి మనస్సు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు,మండల టీడీపీ అధ్యక్షులు వెంగళరెడ్డి, ముస్లిం నాయకులు షేక్ ఇస్మాయిల్, ఆర్యవైశ్య నాయకులు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, కాపు నాయకులు తోటమహేష్ నాయుడు, పార్టీ నాయకులు పేరం రమణారెడ్డి, కొప్పర్తి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ మాగులూరి వెంకటేశ్వర్లు,కేశినిపల్లి మల్లిఖార్జున,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏలూరుపాడులో వేసవి సెలవులు కిశోరి వికాసం కార్యక్రమం



**గుడ్లూరు, మే 22, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలంలోని తెట్టు సెక్టార్ ఏలూరుపాడు పంచాయతీలో వేసవి సెలవులు- కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఉలవపాడు ప్రాజెక్టు సీడీపీవోమాధవి లత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సూపర్‌వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ అక్కడికి వచ్చిన బాల బాలికలకు ఆర్థిక నిర్వహణ గురించి తెలియపరచడం జరిగింది. డబ్బు అనేది ఒక సాధనమని లక్ష్యం కాదని డబ్బును చాలా తెలివిగా ఉపయోగించుకోవాలని సంపాదించిన డబ్బులో కొంత మొత్తాన్ని పొదుపు చేయడం వలన అది ముందు ముందు రోజుల్లో అనేక రకాలుగా ఉపయోగపడుతుందని అలాగే డబ్బులు దుర్వినియోగం చేయడం వలన భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఖర్చు చేసే ముందు చాలా ఆలోచించి ఖర్చు చేయాలని, ప్రతి అమ్మాయి అబ్బాయిలు ఒక వారానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని పొదుపు చేయడం ప్రారంభించాలని తెలియపరిచారు. వారు ఖర్చు చేసే మొత్తాన్ని ఒక డైరీలో కానీ పేపర్లో కానీ రాసుకోవాలని హుండీల ద్వారా ఎంతో కొంత మొత్తాన్ని దాచుకోవాలని డబ్బు నిర్వహణ గురించి కుటుంబంలో పెద్దలతో చర్చించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కామేశ్వరి, వీఓ సౌమ్య, ఆశా వర్కర్, మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు తిరుపతమ్మ, మాలకొండమ్మ, ప్రసన్న కుమారి, ఆయాలు, మానస, కోటేశ్వరమ్మ, మమత, బాల బాలికలుతదితరులు పాల్గొన్నారు.

# ఊరి కోసం దాతృత్వం

### - ఉప్పుగుండూరు గ్రామస్తుల ఐక్యతతో అద్భుతం



**నాగులుప్పలపాడు, మే 22, ప్రభాతవార్త**

ఉప్పుగుండూరు గ్రామస్తులు ఐక్యతగా దాతలతో పాటు ఔత్సాహికులు పార్కు అభివృద్ధికి చేయి చేయి కలిపి ముందుకు సాగి అద్భుతంగా పార్కు నిర్మించుకొని జిల్లాలో ఉప్పుగుండూరు గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఉప్పుగుండూరు గ్రామస్తులు మన ఊరు మన పార్కు అనే నినాదంతో వ్యాపారస్తులు గ్రామస్తులతో ముందుకు రావడం విశేషం.



**జిల్లా పరిషత్ స్థలంలో :**

గ్రామస్తులు ఆలోచన చేసిన అవసరమైన స్థలంఎక్కడా సమకూరుతుందోనన్న మీమాంస మొదలైంది. గ్రామంలో అనేక స్థలాలను పరిశీలించారు. చివరకు గ్రామంలోని మంచినీటి ట్యాంకు ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్‌కు చెందిన స్థలం అయితే గ్రామస్తులు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. ఆ స్థలంలో చక్కటి పార్కు నిర్మాణం ఏర్పాటుకు అనుమతించాలని అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ ఇదర హరిబాబును కోరారు. ఆయన ఆ స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులు కోరిక మేరకు వారి అవసరాలను గుర్తించి ఆ స్థలాన్ని వాకింగ్ ట్రాక్ పార్కు నిర్మాణంతో పాటు వివిధ చిన్న పిల్లల కోర్టు నిర్మించేందుకు పెద్దలు సేద తీరేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు మొక్కల పెంపకానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని గ్రామస్తులకు, వ్యాపారులకు పిలుపునిచ్చారు.



**పునాది ఇలా :**

జిల్లా పరిషత్ కు చెందిన ఒకటి పాయింట్ పది స్థలాన్ని మట్టితో సదును చేశారు. ఇప్పటికే కొన్ని మొక్కలు నాటి టీ గార్డ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ పనులతో పాటు పార్కులో వందలాది మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి సభ్యులు మున్నంగి వెంకట్రావుతో పాటు వ్యాపారస్తులు, గ్రామస్తులు చేయిచేయి కలిపి ముందుకు సాగారు. పార్కులో పిల్లలకు కావాల్సిన ఆట వస్తువులు, పెద్దలకు వాకింగ్ ట్రాక్‌తో పాటు అందరి అవసరాలు గుర్తించి వసతులకు రూపకల్పన చేస్తున్నట్లు వెంకట్రావు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో దాతల దాతృత్వాన్ని నేతలు మండల ప్రజలు కొనియాడుతున్నారు.

## పొగాకు క్వింటాకు రూ.36 వేలకు కొనుగోలు చేయాలి



**దర్శి, మే 22, ప్రభాతవార్త**

పొగాకు క్వింటాకు రూ.36వేలు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతుల సమస్యలపై ఈనెల 25వ తేదీన పొగాకు వేలం కేంద్రాల వద్ద నిరసన తెలిపాలని, అలాగే జూన్1వ తేదీన పొగాకు బోర్డు అధికారుల వద్దకు రాయభారం నడపాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంట ఏడుకొండలు, దర్శి మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం నష్టాలతో ఉన్నటువంటి పొగాకు రైతులకు ఈ సంవత్సరం ప్రారంభం ధర రూ.250 నుంచి మొదలై రూ.190 రూపాయలకు దిగజారిందని నోబిడ్లు పేరుతో 70శాతం బేళ్లను వెనక్కి పంపిస్తున్నారని ప్రైవేటు వ్యాపారస్తుల వైఖరికి నిరసనగా ఈ పాటికే అనేక చోట్ల రైతులు రోడ్లపై ఆందోళన చేసినప్పటికి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పంట ఏడుకొండలు, సందు వెంకటేశ్వరరావు, సీహెచ్ ఆదినారాయణ, కే.వెంకట కొండయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**దర్శి, మే 22, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామ పంచాయతీ నందు దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆదేశాల మేరకు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ, కూలీలకు మెడికల్ కిట్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూరపాటి శ్రీను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, నారాయణస్వామి, గ్రామ పార్టీ టీడీపీ అధ్యక్షులు దమ్మిడి హనుమంతరావు, మందలపు తిరుపతిరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఏ.తిరుమలరావు, ఏపీవో టి.వెంకటరావు, ఈసీజీ శివరామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

## కిశోర్ బాలికలకు ఆర్థిక నిర్వహణపై అవగాహన



**దర్శి, మే 22, ప్రభాతవార్త**

దర్శి పురపాలక సంఘం రామాలయం గుడి వీధి, శివాలయం గుడి వీధి అంగన్‌వాడీ సెంటర్ల కిశోర్ వికాసం శిక్షణా కార్యక్రమం దర్శి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికలకళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం సీడీపీవో ఆర్.పరిమిళ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కిశోర్ బాలికలు ఆర్థిక నిర్వహణ గురించి వివరించడం జరిగింది. డబ్బును రోజు కొంచెం ఆదా చేయడం వల్ల రేపు చాలా సహాయపడుతుందని, ఖర్చు చేసే ముందు ఆలోచించడం మంచిదని, ప్రతి బాలిక పిగ్గీబ్యాంక్ లేదా పొదుపు కజాను ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పరిమళ, సూపర్‌వైజర్ సుభాషిణి, ఎంఈఓ-1 రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ సుహాసిని, సీసీ కోటమ్మ, ఏడబ్ల్యూడబ్ల్యూ జ్యోతి, రమణమ్మ, ఆశా కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుటుంబానికి నగదు అందజేత



**దర్శి, మే22, ప్రభాతవార్త**

ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పని చేస్తూ మరణించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఏ.మస్తాన్ వలి అంత్య క్రియలకు ఏపీఎస్పీ 1995 బ్యాచ్ తరుపున వారి మట్టి ఖర్చులకు పది వేల రూపాయలు చెన్నారావు పోలీసు కానిస్టేబుల్ విజయవాడ, ఆధ్వర్యంలో వారి స్నేహితులు అయిన కానిస్టేబుల్ రాఘవ, సురేష్‌బాబు, షేక్ బాజీ సయ్యద్, శ్రీను, శంకర్, కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

### - విద్యాశాఖ అధికారి -1 చంద్రశేఖర్



**ముండ్లమూరు, మే 22, ప్రభాతవార్త**

ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ముండ్లమూరు విద్యాశాఖ అధికారి-1 జి.చంద్రశేఖర్ తెలియజేశారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రం నందు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ వారు రూపొందించిన బడి పిలుస్తోంది వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డీబీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, మండల రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈదర గ్రామంలో పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది.

# వడదెబ్బతో వృద్ధురాలు మృతి



**దర్శి, మే 22, ప్రభాతవార్త**

దర్శి పురపాలక సంఘం వెలమ వారివీధిలో నివాసం ఉంటున్న తోట సుబ్బులు(80) అనే వృద్ధురాలు శుక్రవారం తమ గృహంలో వడదెబ్బతో మృతి చెందింది. గత వారం రోజుల నుండి దర్శి పట్టణంలో ఎండలు తీవ్రంగా ఉండడంతో ఎండ వేడిమికి తాళలేక ఉదయం వడదెబ్బ తగిలి మృతి చెందింది. సుబ్బులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## గొడ్డలి పోటు రాజకీయాలు వద్దు - అభివృద్ధి రాజకీయాలు చేద్దాం

### - ప్రజలను అభివృద్ధి చేద్దాం - మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి, మే 22, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలోని ఎల్బీరోడ్డులోని 10వ వార్డులో రూ.21లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైన్స్‌కి దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శుక్రవారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో చూశారు. దర్శి మున్సిపాలిటీ మార్చుకున్నాం దాదాపు పది కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం. ప్రతి గడపకు మన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వాన్ని మన గర్వంగా చెప్పుకోవచ్చు. ఈ కార్యక్రమంలో దర్శి సొసైటీ అధ్యక్షులు కలవకొలను చంద్రశేఖర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, దర్శి మున్సిపల్ కమీషనర్ అర్జున్‌రావు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్ పసుపులేటి శేషమ్మ, దత్తాత్రేయ, నక్క చంద్ర, రంగ, వీసీ రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్‌లను పరిశీలించిన ప్రాజెక్టు డైరక్టర్ మూర్తి



**ముండ్లమూరు, మే 22, ప్రభాతవార్త**

ఆర్డీఎస్ఎస్ పనులలో భాగంగా పెద్ద ఉల్లగల్లు ప్రాంతాలలో నిర్మాణంలో ఉన్న 132 కేవీ, 33/11 కేవీ సబ్ స్టేషన్ పనుల పురోగతిని ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్టు డైరక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, విద్యుత్ పరికరాల ఏర్పాటు, లైన్ల అనుసంధానం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులను నాణ్యత ప్రమాదాలతో పాటు నిర్ధేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ పాలగిరి శ్రీనివాసులు, ఏడీఈ అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి



**అద్దంకి , మే 22,ప్రభాతవార్త**

సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ శాస్త్రవేత్త శ్రీనివాసరావు సూచించారు. తిమ్మాయపాలెం గ్రామ రైతుసేవా కేంద్రం వద్ద నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అధిక డి ఏ పి ఎరువుల వాడకం చేసిన 100 జిల్లాలలోలో ఆంధ్రప్రదేశ్ లో 6 జిల్లాలు ఉన్నాయని ప్రకాశం 98 స్థానం లో ఉంది అని తెలిపారు.అధిక డిఎపి వాడకం వలన సూక్ష్మ పోషకాలు లోపాలు అధికంగా వస్తాయని ముఖ్యంగా జింక్ లోపం అధికం గా వస్తుంది అని తెలిపారు. కార్యక్రమం లో కృషి విజ్ఞాన కేంద్రం ,దర్శి శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ తక్కువ ధర కి లభిస్తుంది అని యూరియా వాడకం ఎక్కువ అయింది అని దాని వల్ల పొలాలు చౌడు బారతాయని తెలిపారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో ఎరువుల పంపిణీ కి కార్డు తయారు చేస్తుంది అని ఆయా రైతులు సాగు చేసిన పంటల ఆధారం గా ఎరువులు సరఫరా చేస్తుంది అని తెలిపారు. భూసార పరీక్షల ఆధారం గా ఎరువులు వాడకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు గ్రామ వ్యవసాయ సహాయకులు రాము, గ్రామ రైతులు సుబ్రమణ్యం, పరిటాల పవన్, తదితరులు పాల్గొన్నారు .

## నేడు నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి పర్యటన



**అద్దంకి , మే 22, ప్రభాతవార్త**

విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ఉదయం 8.30 గంటలకు సంతమాగులూరు మండలం, పుట్టావారిపాలెం గెస్ట్ హౌస్ నందు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ,ఉదయం 9.45 గంటలకు కొమ్మాలపాడు గ్రామంలో, ఉదయం 10.30 గంటలకు అద్దంకి మండలం, తిమ్మాయపాలెంలో, ఉదయం 11.00 గంటలకు అద్దంకి పట్టణం, 14వ వార్డు, ఉదయం 11.30 గంటలకు అద్దంకి పట్టణం, 9వ వార్డు, మధ్యాహ్నం 1.00 గంటలకు పల్నాడు జిల్లా, నరసరావుపేట తదితర కార్యక్రమాలలో పాల్గొంటారని ఆయన క్యాంపు కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

## మక్కెనవారిపాలెం గ్రామంలో వడదెబ్బకు యువకుడు మృతి



**సంతమాగులూరు, మే 22, ప్రభాతవార్త**

ఎండలు రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తుండగా మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (40) వడదెబ్బకు గురై మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నారు. గత కొన్ని రోజులుగా మండలంలో అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో ఉక్కపోత వాతావరణం నెలకొనడంతో కూలీలు, వ్యవసాయ కార్మికులు తీవ్ర అలసటకు గురవుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వెంకటేశ్వర్లు అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్స కోసం తరలించేలోపే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటన మక్కెనవారిపాలెం గ్రామంలో విషాదాన్ని నింపింది. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్న సమయంలో అవసరం లేకుండా బయటకు రావద్దని, తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఓ ఆర్ యస్ పాకెట్ లు ఎక్కువ తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ఏల్చూరు హైవేలో టెంపో వాహనం బోల్తా

### - రోడ్డు ప్రమాదంలో 9 మందికి స్వల్ప గాయాలు

### - ఒక మహిళకు తీవ్ర గాయం





**సంతమాగులూరు, మే 22,ప్రభాతవార్త**

మండలంలోని ఏల్చూరు సమీపంలో నామ్ ఎక్స్‌ప్రెస్ రాష్ట్రీయ రహదారి మీద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాయచోటి నుండి నరసరావుపేటకు ప్రయాణిస్తున్న టెంపో వాహనం అద్దంకి నార్కెట్పల్లి రాష్ట్రీయ రహదారి మార్గంలో మండలంలోని ఏల్చూరు సమీపంలోకి రాగానే టైరు పేలి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఒక మహిళకు తీవ్ర గాయాలవడంతో నామ్ హైవే అంబులెన్స్ లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మొత్తం 12 మంది ప్రయాణికులు వాహనంలో ఉన్నట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద తీరును పరిశీలించి, వివరాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## వైసిపి రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిగా కొల్లా

**అద్దంకి , మే 22, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణానికి చెందిన వైసిపి మహిళా నాయకురాలు, కొల్లా భువనేశ్వరిని రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఈ నియామక ఉత్తర్వులను విడుదల చేసినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.

## కిశోరి వికాసంపై అవగాహన



**ముండ్లమూరు, మే 22, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలంలోని శంకరాపురం గ్రామంలో కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. ఆర్థిక నిర్వ్వమ యొక్క మంచి ఉద్దేశాలు, పొదుపు అలవాటులు, ఆర్థిక స్వేచ్ఛ బ్యాంకింగ్ లావాదేవీ, అను అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముండ్లమూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఇందిర, ఎంఎల్‌హెచ్‌పీ శశి, ఏఎన్ఎం మీనాక్షి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కమీషన్ ఈ నెల 26న ఒంగోలు రాక

### - రిజర్వేషన్ వెనుక బాటు తనంపై సమీక్ష

### - బీసీ సంక్షేమాధికారిణి ఎస్.నిర్మల జ్యోతి

**దర్శి, మే22, ప్రభాతవార్త**

స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల పౌరుల వెనుకబాటుపై అనుభవ పూర్వక పరిశోధన, రిజర్వేషన్ల శాతం ఖరారు కొరకు సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాజీవ్ రంజన్ మిశ్రా ఐఎఎస్ చైర్మన్ కమీషన్‌ను నియమించారు. ఈ కమీషన్ బీసీల వెనుకబాటు తనం, రిజర్వేషన్‌లపై సలహాలు సూచనలు ఆహ్వానిస్తుంది. ఇందుకోసం ఈ కమిటీ ఈనెల 26న ఒంగోలు రానున్నాయి. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ నందు స్థానిక సంస్థలలో బీసీల వెనుకబాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే బీసీ కుల సంఘాలు, ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధులు ఆసక్తి గల ప్రజల నుంచి వినతిపత్రాలు సేకరించనున్నారు. ప్రత్యక్షంగా ముఖాముఖాగా మాట్లాడనున్నారు. కుల సంఘాల ప్రతినిధులు సివిల్ సొసైటీ సంస్థలు, ప్రజా ప్రతినిధులు, వెనుకబడిన ప్రజలు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు కమీషన్‌కి ఇవ్వాలని ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ శాఖ, సాధికారిత అధికారి ఎస్.నిర్మలజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలోని బీసీ సంఘాల నాయకులు , ప్రతినిధులు ఉద్యోగస్తులు పాల్గొనాలని ఆమె కోరారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**సింగరాయకొండ, మే 21, ప్రభాతవార్త**

వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ డి.జయమణి సూచించారు. మండలంలోని ములగుంటపాడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ పంచాయతీ కార్మికులు,ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వడదెబ్బ కారణంగా శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు పెరిగే ప్రమాదం ఉందన్నారు. తల తిరగడం, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తలకు టోపీ ధరించడం, తెల్లని దుస్తులు ధరించడం, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, కూనపురెడ్డి రాజమ్మ, కార్యదర్శి వెంకటరాము, భూదేవి, వెంకటేశ్వర్లు, సన్నిబోయిన మల్లికార్జున, రామయ్య, తేజస్వి, విజయతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐఏఎస్‌ల పిల్లలకూ ఇంకా రిజర్వేషన్లా?

## ఉన్నత స్థానాలకు చేరిన కుటుంబాలు కోటా ఆశించడమేమిటి?

## సమాజంలోని చివరి వ్యక్తికీ రిజర్వేషన్ ఫలాలు అందాలి

## జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యలు

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ, మే 22:** దేశంలో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ అంశాలపై భారత సుప్రీంకోర్టు శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేసింది. విద్య, ఆర్థిక రంగాల్లో ఇప్పటికే ఉన్నత స్థానాలకు చేరుకున్న కుటుంబాలు, ఇంకా కోటా ప్రయోజనాల కోసం పట్టుబట్టడాన్ని న్యాయస్థానం తీవ్రంగా ప్రశ్నించింది. రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?" అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని "క్రీమీలేయర్" (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి (సోషల్ మొబిలిటీ) లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత (బ్యాలెన్స్) అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబిసిలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. ఇంద్ర సాహ్నీ తీర్పును ప్రస్తావిస్తూ, ప్రస్తుత నిబంధనలు 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.8 లక్షలు దాటిన వారితో పాటు ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపిఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర, కర్ణాటక ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.



# చొరబాట్ల కట్టడికి స్మార్ట్ బోర్డర్‌ప్రాజెక్టు!

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 22:** దేశంలోకి భూమార్గం ద్వారా అక్రమ చొరబాట్లను నివారించేందుకు త్వరలో దేశ సరిహద్దుల్ని స్మార్ట్ బార్డర్ ప్రాజెక్ట్ పరిధిలోకి మార్చనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. త్వరలో స్మార్ట్ బార్డర్ ప్రాజెక్ట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సరిహద్దుల్లో రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికతను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ సరిహద్దుల నుంచి అక్రమ చొరబాట్లను ఆపేందుకు ఆధునిక నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. అత్యాధునిక సెక్యూరిటీ కెమెరాలు, రాడార్లు, సెన్సర్లు, సర్వైలెన్స్ టూల్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ప్లాట్‌ఫామ్స్ వంటివి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బంగ్లా, పాక్ సహా అంతర్జాతీయ సరిహద్దు కలిగి ఉన్న వివిధ రాష్ట్రాల్లో ఇందుకోసం ప్రత్యేకంగా భూమిని కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాదిలోనే వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు. కొత్త నిర్మాణాల ద్వారా అక్రమ చొరబాట్లను వెంటనే గుర్తించి అడ్డుకోవచ్చన్నారు. సరిహద్దులో డ్రోన్ యాక్టివిటీస్, పశువులు అక్రమ రవాణా, డ్రగ్ ట్రాఫికింగ్ సహా ఎలాంటి అనుమానాస్పద కదలికలనైనా వెంటనే గుర్తించవచ్చని తెలిపారు. ఎలాంటి చొరబాటు, చర్యను గమనించినా వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి అలర్ట్ వెళ్తుందని వెల్లడించారు. దేశానికి ఐదు దశాబ్దాలుగా ఉన్న నక్సల్స్ సమస్య ముగింపు దశకు చేరుకుందన్నారు. త్వరలో ఇండియా నక్సల్ ఫ్రీ దేశం అవుతుందని అభిప్రాయపడ్డారు. మన సైన్యం ఈ విషయంలో తమ సత్తా చాటిందని, సమస్యను కూకటివేళ్లతో సహా పెకిలించామని చెప్పుకొచ్చారు. పాకిస్తాన్ ఉగ్ర చర్యలకు పాల్పడిన ప్రతిసారీ ఇండియా ఘాటుగా స్పందించిందన్నారు. తమ హయాంలో మూడుసార్లు పాక్‌కు సమాధానం చెప్పామని అమిత్ షా వివరించారు. రాష్ట్రాలు, కేంద్రం కలిపి సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాయని తెలిపారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబడుతున్న సంగతి తెలిసిందే.

# కొడుకు పెళ్లికి వెళ్తానో .. లేదో!

## భద్రతా కారణాల రీత్యా సందేహిస్తున్న ట్రంప్



**వాషింగ్టన్, మే 22:** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ పెళ్లికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 యేళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహామాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 యేళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. తర్వాత మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

# బలూచ్ దెబ్బకు వ్యూహం మారుస్తున్న షరీఫ్ సర్కార్

- లష్కరేనేతలతో దౌత్యం నెరపేందుకు కసరత్తులు
- హాఫీజ్ స్థానంలో కొత్త నేత ఎంపికకు ఒత్తిళ్లు



**ఇస్లామాబాద్, మే 22:** భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ కోలుకోలేని విధంగా దెబ్బతింది. మురిద్కేలో ఉన్న ప్రధాన శిక్షణా కేంద్రాన్ని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. దీంతో తీవ్ర నష్టాల్లో ఉన్న ఈ ఉగ్ర సంస్థను మళ్లీ బలోపేతం చేసేందుకు ఈసారి పాకిస్థాన్ సైన్యంతో పాటు అక్కడి రాజకీయ నాయకులూ రంగంలోకి దిగారు. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముఖ్య అనుచరుడు రాణా సనావుల్లాతో ఫైసలాబాద్‌లో భేటీ అయ్యాడు. దీనిపై భారత నిఘా సంస్థలు దృష్టి పెట్టాయి. పాక్ సైన్యం, ఐఎస్‌ఐపై లష్కరే ఉగ్రవాదులకు నమ్మకం సడలడంతోనే పాక్ ప్రభుత్వం నేరుగా రాజకీయ నేతలను రంగంలోకి దించి ఈ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లష్కరే తోయిబాకు కొత్త నాయకుడిని అధికారికంగా ప్రకటించాలని పాక్ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 75 ఏళ్ల హాఫీజ్ సయీద్ వయసు పైబడటం, సంస్థలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. అందుకే 50 ఏళ్ల తల్హా సయీద్‌ను అధికారికంగా ఆపరేషన్స్ చీఫ్‌గా మార్చాలని చూస్తున్నారు. కొత్త టెక్నాలజీలపై పట్టున్న తల్హా అయితేనే ఉగ్రవాదులను నడిపించగలడని పాక్ భావిస్తోంది. బలూచిస్థాన్ సమస్యకు లష్కరే పరిష్కారమా పాకిస్తాన్‌కు బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూంక్వా ప్రాంతాల్లో భద్రత కల్పించడం పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోతోంది. బీఎల్‌ఏ గ్రూపులు పాక్ ప్రభుత్వం లేదా సైన్యంతో చర్చలకు అస్సలు అంగీకరించవు. అందుకే లష్కరే తోయిబా నేతలను రాయబారానికి పంపి బీఎల్‌ఏతో ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తోంది. బలూచిస్థాన్ మీదుగా వెళ్లే చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ఫేజ్2 ప్రాజెక్ట్‌కు భద్రత కల్పించడం పాక్‌కు ముఖ్యం. బలూచిస్థాన్‌లోని మైనింగ్ ప్రాజెక్ట్ కోసం అమెరికా 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. స్థానిక వనరులను దోచుకుంటున్నారంటూ బలూచ్ ప్రజలు ఈ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



# ఆఫ్రికాకు తలనొప్పిగా మారిన ఎబోలా కట్టడి

**బ్రజ్జావిల్లే, మే 22:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. వైరస్‌తో పాటు తప్పుడు సమాచార వ్యాప్తి ఇక్కడి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మృతదేహాన్ని అప్పగించలేదని ఎబోలా చికిత్సా కేంద్రానికి స్థానికులు నిప్పంటించడం అందుకు ఉదాహరణ. ప్రస్తుత వ్యాప్తికి కేంద్రంగా ఉన్న కాంగోలోని ర్వాంపారా ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వైరస్ ప్రతిస్పందన విషయంలో ప్రజల్లో నెలకొన్న అపనమ్మకం, ఆగ్రహం ఈ పరిస్థితికి కారణమైంది. 1976లో కాంగోలో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించగా, ఇప్పుడు 17వసారి వ్యాప్తి చెందుతోంది. పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా ఆమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడం వల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని పేర్కొన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ.. గ్లోబల్ హెల్త్ ఎమర్జెనీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో వైరస్ కట్టడికి వైద్య సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ, కాంగో తరహా ఘటనలు వారికి తలనొప్పిగా మారాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఎబోలా లక్షణాలతో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని మృతదేహాన్ని అప్పగించేందుకు వైద్య సిబ్బంది నిరాకరించడం స్థానిక యువత ఆగ్రహానికి గురైంది. దీంతో వారు వైద్య కేంద్రంలోకి జొరబడి, నిప్పంటించారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మామూలుగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. ఆ వరస్ సోకిన జంతువులను వేటాడి (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు చేరుతుంది. వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. వైరస్ సోకి వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకు వ్యాపిస్తుంది. ఆ వైరస్ లక్షణాలతో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పిపిఇ కిట్లు ధరించిన ప్రత్యేక బృందాలు ఖననం చేయాలని అంతర్జాతీయ వైద్య సంస్థలు.

# హిందూదేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాల్ చేస్తూ పిటిషన్

## తామే మొత్తం విచారణచేస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మే 22** తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టును ఆశ్రయించాలంటూ గత ఏడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ చట్టాలపై విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ భారతదేశంలోని హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అధీనంలో ఉంచుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కీలక పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారంనాడు అంగీకరించింది. కేసును హైకోర్టులకు బదిలీ చేస్తూ గతంలో ఇచ్చిన పాత ఆదేశాలను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ శర్మతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. చట్టాల చెల్లుబాటుపై జూలై 24 నుంచి మెరిట్స్ ఆధారంగా తామే తుది విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టంచేసిం. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరిలో హిందూ ధార్మక సంస్థల నియంత్రణ చట్టాలను పిటిషన్లరు సవాలు చేశారు. కేవలం హిందూ ఆలయాలనే నియంత్రించడం రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛ, సమానత్వ హక్కులకు విరుద్ధమని తమ పిటిషన్‌లో స్వామి దయానంద సరస్వతి ట్రస్ట్ పేర్కొంది. ఆలయాల హుండీ ఆదాయం, మిగులు నిధులను ప్రభుత్వాలు ఇతర కార్యకలాపాలకు మళ్లించడంపై పలువురు పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం, నిధుల అవినీతిని అరికట్టేందుకే ఆలయాల నిర్వహణలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటున్నాయని రాష్ట్రాలు వాదన వినిపించాయి. ఈ క్రమంలో న్యాయంకోసం హైకోర్టును ఆశ్రయించాలంటూ గతంలో ఆదేశించిన సుప్రీంకోర్టు ఇపుడు తామే స్వయంగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. వేర్వేరు హైకోర్టుల కంటే సుప్రీంకోర్టు తేల్చడమే సముచితమని పేర్కొన్నారు.

# సిఎం విజయ్‌కేబినెట్‌లో మరో ఇద్దరికి చోటు!



**చెన్నై, మే 22:** తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం శుక్రవారంనాడు ప్రభుత్వంలో మరో ఇద్దరికి చోటు కల్పించింది. టీవీకేకు బయట నుంచి మద్దతిస్తామని ఇంతకుమందు ప్రకటించిన విడుదలై చిరుతైగళ్ కట్చి (విసికె), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) అధికార కూటమిలో చేరాయి. పాపనాశం అసెంబ్లీ నియోజకవర్గం ఐయూఎంఎల్ ఎమ్మెల్యే ఏఎం షాజహాన్, తిండివనం నియోజకవర్గం వీసీకే ఎమ్మెల్యే వన్ని అరసు శుక్రవారంనాడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. టీవీకే ప్రభుత్వం కీలకమైన మంత్రివర్గ విస్తరణ గురువారంనాడు జరిపింది. వీసీకే, ఐయూఎంఎల్‌ను కూడా ప్రభుత్వంలో చేరాలని కోరింది. అయితే పేర్ల ఖరారు విషయంలో ఆ రెండు పార్టీలు జాప్యం చేశాయి. దీంతో 23 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, టీవీకేకు చెందిన 21 మంది ఉన్నారు. దీనికంటే ముందు ముఖ్యమంత్రితో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం ప్రమాణస్వీకారం చేశారు. మొత్తం 35 మందికి క్యాబినెట్‌లో అవకాశం రెండు ఖాళీలు మిగిలాయి. వీసీకే, ఐయూఎంఎల్ తాజాగా ప్రభుత్వంలో చేరడంలో మంత్రి కొలువుల భర్తీ పూర్తయింది. ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వ విశ్వాస తీర్మానికి అనుకూలంగా ఓటు వేసిన అన్నాడీఎంకే రెబల్ వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలకు టీవీకే ప్రభుత్వంలో చోటు దక్కలేదు. మంత్రివర్గ విస్తరణ సందర్భంగా రెబల్ ఎమ్మెల్యేలలోని తొమ్మిది మంది షణ్ముగం వర్గానికి దూరంగా ఉండిపోయారు. రాబోయే రోజుల్లో చాలామంది పార్టీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు వెనక్కి తీరిగి వస్తారని అన్నాడీఎంకే గట్టి నమ్మకంతో ఉంది.

# పాకిస్థాన్‌కూ ఎగబాకిన సోషల్ మీడియా కాక్రోచ్‌పార్టీ ట్రెండ్!




**కరాచి, మే 22:** భారత్‌లో సంచలనం సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ డిజిటల్ ట్రెండ్ ఇప్పుడు పాకిస్థాన్‌కూ పాకింది. అక్కడ కూడా కాక్రోచ్ అవామీ పార్టీ కాక్రోచ్ అవామీ లీగ్ వంటి కొత్త గ్రూపులు సోషల్ మీడియాలో పుట్టుకొచ్చాయి. నిరుద్యోగ యువత వేదికగా సాగుతున్న ఈ పొలిటికల్ ట్రెండ్ ఇరు దేశాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. పాక్‌లో ప్రధాన రాజకీయ పార్టీలైన ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ, నవాజ్ షరీఫ్ పీఎంఎల్‌ఎన్, పీపీపీలకు ప్రత్యామ్నాయంగా ఈ కాక్రోచ్ పార్టీలు రంగంలోకి దిగుతున్నాయి. కాక్రోచ్ అవామీ పార్టీ తమ ఇన్‌స్టా బయోలో అవును కాపీ కొట్టాం, కానీ ఎవరికి నష్టం? మా మోటో ఒక్కటే అంటూ భారత్ నుంచి స్ఫూర్తి పొందినట్లు బాహాటంగానే అంగీకరించింది. ఈ అకౌంట్లు పూర్తిగా పాక్ నిరుద్యోగ జనరేషన్ జెడ్ యువత గొంతుకగా మారుతామని ప్రకటిస్తున్నాయి. వ్యవస్థ ఎవరినైతే బొద్దింకలుగా భావించిందో.. మేం ఆ ప్రజల గొంతుకల్ం అంటూ ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతాం అనే ఉర్దూ నినాదంతో పాక్ యువత సోషల్ మీడియాలో హోరెత్తిస్తోంది. నిరుద్యోగం, దేశ పాలన, రాజకీయ వ్యవస్థలపై తమకున్న అసంతృప్తికి ఈ బొద్దింక గుర్తును వాడుకుంటూ మీమ్స్ రూపంలో అక్కడి ప్రభుత్వాలపై నిరసనగా వ్యక్తం చేస్తోంది

## కేన్స్ ఫిలింఫెస్ట్‌లో మిస్ వెనిజులాపై దాడి

**న్యూయార్కు,మే 22:** ప్రపంచ ప్రఖ్యాత కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తీవ్ర కలకలం రేగింది. మిస్ వెనిజులా 2025 టైటిల్ విజేత ఆండ్రియా డెల్ వాల్‌పై ఆమె సెలబ్రిటీ స్టైలిస్ట్ గియోవన్నీ లగునా భౌతిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి వెనెజులా, మెక్సికన్ మీడియా కథనాలను ఉటంకిస్తూ న్యూయార్క్ పోస్ట్ ఒక కథనాన్ని ప్రచురించింది. మంగళవారం కేన్స్‌లోని ఒక హోటల్ గదిలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాడి అనంతరం 29 ఏళ్ల ఆండ్రియా డెల్ వాల్ తన ముఖానికి అయిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను షేర్ చేశారు. ఆ వీడియోలో ఆమె ముఖం నుంచి రక్తం కారుతుండగా, తీవ్ర ఆవేదనతో కనిపించారు. స్పానిష్ భాషలో మాట్లాడుతూ, చూడండి, గియోవన్నీ లగునా నాకు చేసిన పని ఇది. కంగ్రాట్స్ గియోవన్నీ, నువ్వు ఎవరో చూపించడానికే ఇది చేశావని ఆమె తన స్టైలిస్ట్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వీడియోలో ఆ హోటల్ గది మొత్తం చిందరవందరగాపడి ఉండటం కనిపించింది.



# ట్విషా శర్మ మృతి కేసు: సిబిఐ విచారణ

- మధ్యప్రదేశ్ ప్రభుత్వం సిఫార్సు
- రీపోస్టుమార్టంకు హైకోర్టు అనుమతి
- నిందితుడు లొంగిపోయేందుకు యత్నం

**భోపాల్, మే 22:** తెలుగు సినీ నటి ట్విషా శర్మ విషాద మరణంపై సిబిఐ విచారణకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం సిఫార్సు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థతో స్వతంత్ర విచారణ జరపాలని ఆమె కుటుంబం పదేపదే చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి, ఒక కీలక పరిణామంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే 12న ట్విషా శర్మ భోపాల్‌లోని తన అత్తగారి ఇంటి డాబాపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబం అనుమానాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. ఇటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను కలిసి ట్విషా శర్మ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలోనే ట్విషా శర్మ మృతి కేసును సిబిఐకి అప్పగించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర హోం కార్యదర్శికి, న్యూఢిల్లీలోని సిబిఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. ట్విషా శర్మ మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం.

# సంక్షిప్తంగా..

## సగం అమెరికా వైమానిక రక్షణ క్షిపణులు ఖాళీ



**వాషింగ్టన్, మే 22:** ఇరాన్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచే క్రమంలో అమెరికా భారీగా తన క్షిపణి నిల్వలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు దాని అమ్ములపొదిలోని సగం ఎయిర్ డిఫెన్స్ క్షిపణులు ఖాళీ అయినట్లు సమాచారం. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా 200కు పైగా థాడ్ క్షిపణులను ప్రయోగించింది. వీటితోపాటు మధ్యధరా సముద్రంలో మోహరించిన యుద్ధనౌకల నుంచి 100కుపైగా స్టాండర్డ్ మిస్సైల్-3, స్టాండర్డ్ మిస్సైల్-6లను వినియోగించింది. దీంతో పెంటగాన్ వద్ద ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు సగానికి పడిపోయాయి. అమెరికా వద్ద ఇంకా సుమారు 200 థాడ్ ఇంటర్ సెప్టర్‌లు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది.

## ఉమర్ ఖలీద్‌కు 3 రోజుల బెయిల్!



**న్యూఢిల్లీ, మే 22:** ఢిల్లీ అల్లర్ల కేసులో ప్రధాన నిందితుడు ఉమర్ ఖలీద్‌కు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరుచేశారు. ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఖలీద్‌కు బెయిల్ జారీ చేసింది. ఖలీద్ తల్లికి వైద్య చికిత్స జరగాల్సి ఉంది, ఈ నేపథ్యంలో తల్లిని చూసేందుకు కోర్టు అతనికి అనుమతి ఇచ్చింది. జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ మధూ జైన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. విస్తృతమైన కోణంలో ఈ సమస్యను పరిశీలించి, తల్లికి సర్జరీ ఉన్న నేపథ్యంలో ఉమర్ ఖలీద్‌కు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరీ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. జూన్ ఒకటో తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు బెయిల్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో ఖలీద్ తన తల్లితో గడపనున్నాడు. బెయిల్ సమయంలో ఖలీద్ తన అడ్రెస్‌లోనే ఉండాలని కోర్టు స్పష్టం చేసింది.

## భోజ్‌శాలను టచ్‌చేసి చూడండి తెలుస్తుంది: ఎస్పీ



**భోజ్‌శాల, మే 22:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల వివాదాస్పద కట్టడం కేవలం హిందూ దేవాలయమేనని మే 15న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. అంతకుముందు వరకు అక్కడ ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు అనుమతి ఉండేది. అయితే కోర్టు తీర్పు తర్వాత వస్తున్న మొదటి శుక్రవారం కావడంతో అక్కడ ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ధార్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సచిన్ శర్మకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన జీపుపై నిలబడి అల్లరి మూకలను గట్టిగా హెచ్చరించారు. ఎవరికైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనే ధైర్యం ఉంటే, శుక్రవారం ప్రయత్నించి చూడండి. మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. ఎవరినీ వదిలిపెట్టం అంటూ ఎస్పీ సవాల్ విసిరారు.

## ఎవరెస్ట్ అధిరోహించి తిరిగి వస్తూ ఇద్దరు భారతీయులు మృతి

**ఖాట్మండు, మే 22:** నేపాల్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కిన ఇద్దరు భారతీయులు మృతిచెందారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు శుక్రవారం తెలిసింది. నేపాల్ పర్వతారోహణ అధికారి రిషి భండారి వివరాలప్రకారం ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఓ పర్వతారోహకుడు తీవ్రంగా అలసిపోయినట్లు చెప్పారు. అయితే అతని ప్రాణాలను కాపాడేందుకు షెర్పాలు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిపారు. హిల్లరీ స్టెప్ వద్ద అరుణ్ తివారి అనే పర్వతారోహకుడు మృతిచెందినట్లు భండారి చెప్పారు. సందీప్ ఆరె అనే వ్యక్తి రెండో క్యాంప్ వద్ద ప్రాణాలు కోల్పోయాడు. ఎవరెస్ట్‌ను అత్యధికంగా 32 సార్లు అధిరోహించిన నేపాలీ షెర్పా కామి రీటా ఇవాళ అభ్యర్థన చేశారు.

## మిస్టరీ వీడిన స్లీపర్‌కోచ్ మృతదేహం బాక్స్

**లక్నో, మే 22:** రైలు స్లీపర్ కోచ్‌లో వదిలేసిన పెట్టెలోని యువతి మృతదేహం మిస్టరీవీడింది. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించారు. ఒక యువకుడితో సంబంధం నేపథ్యంలో కుమార్తెను ఆమె తండ్రి హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈనెల 17న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించిన ఎక్స్‌ప్రెస్ రైలు స్లీపర్ కోచ్‌లో వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను క్లీనింగ్ సిబ్బంది గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మొండెం అందులో ఉన్నది.

# ప్రజలకు సురక్షిత తాగునీరు అందివ్వాలి

● ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**గన్నవరం(కృష్ణా), మే 22 ప్రభాతవార్త:** ప్రజల వద్ద నుండి డబ్బులు తీసుకుని నీటిని విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్‌లు సురక్షిత తాగు నీటిని ప్రజలకు అందివ్వాలని, గన్నవరం నియోజకవర్గంలోని తాగునీటి ప్లాంట్‌లలో సరఫరా చేస్తున్న తాగునీటికి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. గన్నవరం నియోజకవర్గంలోని పబ్లిక్, ప్రయివేటు వాటర్ ప్లాంట్‌లలో తనిఖీలు నిర్వహించి, సదరు ప్లాంటులు సరఫరా చేస్తున్న నీటిని ల్యాబ్‌లలో పరీక్షలు చేయించి, తగు నాణ్యతా ప్రామాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కావటం ద్వారా పలు వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉన్నందున ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా నీటికి పరీక్షలు నిర్వహించాలన్నారు. నిర్ధిష్ట నాణ్యతా ప్రమాణాలు పాటించన నీటిప్లాంట్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్లాంట్‌లలో తరచు ఫిల్టర్‌లు మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వాటర్‌ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని యార్లగడ్డ సూచించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

# సమస్యల పరిష్కారానికే పిజిఆర్ఎస్

● ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త:** రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. శుక్రవారం రెడ్డిగూడెం గ్రామంలో ప్రత్యేక పిజిఆర్ఎస్, ఒక నెల- ఒక గ్రామం- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని వాటిని నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించేందుకు ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారమైతే గ్రామస్తులకు సమయం, వ్యయం తగ్గుతుందని, పరిపాలనపై నమ్మకం కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీఓ ఏ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బడి పిలుస్తోంది:** రెడ్డిగూడెం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరిన విద్యార్థినీవిద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో బడిఈడు పిల్లలు అందరూ బడిలో చేరేలా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించటంతో పాటు, నాణ్యమైన విద్య, మధ్యాహ్నభోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటుని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

# విజయవాడలో విద్యాసంస్థల బస్సుల తనిఖీలు

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త:** విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విజయవాడలో పోలీసులు విద్యాసంస్థల బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. విజయవాడ ట్రాఫిక్ డిసిపి షిరిన్ బేగం ఆధ్వర్యంలో పడమటలోని కెకెఆర్ గౌతం పాఠశాలలో బస్సులను తనిఖీ చేసారు. బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు పరిశీలించారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, అత్యవసర మార్గము అగ్నిమాపక పరికరాలు పరిశీలించి డ్రైవర్‌లకు హెవీలైసెన్స్‌తోపాటు అనుభవం ఉందో లేదో సరి చూసారు. ఈ సందర్భంగా షిరిన్ బేగం డ్రైవర్లతో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు యాక్టివ్‌గా ఉండేలా చూడాలని ఆదేశించారు. బస్సుల్లో సీటింగ్‌కు మించి విద్యార్థులను ఎక్కించవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, భారీ జరిమానాలు విధించటంతోపాటు బస్సులను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ ప్రతిఒక్కరూ ప్రమాదాల నివారణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ ట్రాఫిక్ ఎసిపి డి.పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్‌లు కృష్ణబాబు, రామారావు, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.



# నేటి నుండి తిరుపతిలో అరసం రాష్ట్ర మహాసభలు

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 20వ రాష్ట్ర మహాసభలు తిరుపతి నగరంలో శనివారం నుండి రెండు రోజుల పాటు జరగనున్నాయి. రాష్ట్ర మహాసభలతో పాటు 83వ వార్షికోత్సవాన్ని కలిపి నిర్వహిస్తున్నారు. నగరంలో సిపిఐ కార్యాలయంలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ అరసం రాష్ట్ర మహాసభలకు వేదిక కానుంది. 40 సంవత్సరాల అనంతరం అరసం మహాసభలు మరోసారి తిరుపతిలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సదస్సులు, పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి 300 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరు అవుతున్నారు.

రెండు రోజులు పాటు తిరుపతిలో జరిగే అరసం మహాసభల ఏర్పాట్లను ఆ సంఘం నాయకులు శుక్రవారం ఉదయం పర్యవేక్షి ంచారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ ్మనారాయణ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, నాయకులు సాకం నాగరాజు, గంటా మోహన్ డాక్టర్ నెమిలేటి కిట్టన్న, నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఏడుకొండలు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, సత్యాల బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు రామాలయం

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు (నెల్లూరు), మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న రామాలయం నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణం టిడ్కో కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు, స్థానిక నేతలతో కలిసి మంత్రి ఆనం రామానారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి భజన మందిరాల్లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఆలయంగా నిర్మాణం పూర్తి కావస్తున్న ఆత్మకూరు టిడ్కో కాలనీలోని రామాలయాన్ని త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణచే ప్రారంభిస్తామని, ఆలయ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో ప్రశాంత వాతావరణంతో తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి భక్తుడు ఆహ్లాదకర అనుభూతి పొందేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఆత్మకూరు నమూనాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి మంత్రి రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**సిఎం స్ఫూర్తితో జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం:** రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల పనితీరు విషయంలో నెల్లూరు జిల్లా ముందువరుసలో ఉండడం గర్వకారణమని మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో పలు ప్రభుత్వ శాఖలపై మంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పని చేయడం వలన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవుతున్నాయన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ప్రశంసించడం జిల్లా అధికారులందరికీ గర్వకారణమన్నారు. ఈసందర్భంగా జిల్లా అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సిఎం ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాలో అభివృద్ధిని మరింత హైస్పీడ్ పెంచాలని అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని వదులు కోకుండా నిధులు సమీకరించి సమగ్రంగా ఆత్మకూరును అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రి రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 7.49 కోట్లు ఆర్థికసాయం:** పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అండగా నిలస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో 49మంది లబ్ధిదారులకు 44.89 లక్షలు విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. మంత్రి ఆనం మాట్లాడుతూ వివిధరకాల వ్యాధులకు వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఆత్మకూరు నియోజకవర్గంలోనే 809మంది లబ్ధిదారులకు 7,49,67,338 రూపాయలను అందించి ఆ కుటుంబాలకు తోడుగా నిలిచామని మంత్రి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ మహోత్సవం జరిగింది. ఆలయ వేదఘోషలు, మంగళవాయిద్యాలు, వైదిక మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. యాగశాలలో ప్రత్యేక పూజల అనంతరం అంకురార్పణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వేసవి నేపథ్యంలో చలువ పందిళ్లు, వైట్ పెయింట్, ఆలయం పరిసరాలలో ఆకట్టుకునేలా రంగోలీలు, విద్యుత్ అలంకరణలు, పెయింటింగ్స్, పుష్పలంకరణలు తదితర ఏర్పాట్లు చేపట్టారు. నేటి ఉదయం 07.35 గంటల నుండి 08.49 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్.శాంతి, ఎఇఒ ఎబి



నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, అర్చకులు, పాల్గొన్నారు.

# రాప్తాడులో ఏం జరుగుతున్నదో మంత్రి లోకేష్ తెలుసుకోవాలి

● ప్రాణహాని ఉందని నివేదికలు ఉన్నా గన్‌మెన్‌లను తొలగించారు?

● కూటమి ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



**అనంతపురం, మే 22 ప్రభాతవార్త బ్యూరో:** రాప్తాడు శాసనసభ నియోజకవర్గంలో జరుగుతున్న దారుణాలతో పాటు ప్రభుత్వం వైఫల్యాలను ప్రశ్నించినందుకే తనకు గన్ మెన్లను తొలగించారని, తనకు ప్రాణహాని ఉందని పోలీస్ అధికారుల నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నా తనకు గన్‌మెన్లను ఎలా తొలగిస్తారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. తనకు గన్‌మెన్ లేకపోయినా ప్రజల రక్షణతో తన పోరాటాన్ని కొనసాగిస్తానని, ప్రజా సమస్యలను ప్రశ్నిస్తూ ఉంటానని ఆయన వెల్లడించారు. వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. గన్ మెన్లను తొలిగిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ తొలి సారి మంత్రి అయ్యాడని.. అసలు రాప్తాడు వంటి ప్రాంతంలో జరుగుతున్న దారుణాలు గురించి తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న దౌర్జన్యాలు, దురాగతాలు, అక్రమాలు తెలుసుకొని సరిదిద్దే పనులను మంత్రి చేయాల్సింది ఉందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కురుబ లింగమయ్య హత్య, దళిత మైనర్ బాలికపై అత్యాచారం, భూ వివాదంలో హత్య గురించి, హంద్రీనీవా కాలువకు లైనింగ్, పేరూరు డ్యాంకు నీరు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె సోదరులు, కుమారుల వసూళ్లు, అక్రమాలు గురించి, ఇసుక అక్రమ రవాణా, టమోటా మండీల్లో వసూళ్లు, కర్ణాటక అక్రమ మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణా వంటి అంశాల గురించి తాను ప్రశ్నించానన్నారు. అనంతపురం శివారులో పాపంపేటలో అమాయక ప్రజల భూములు కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని నేను అడ్డుకుంటున్నాను అన్న ఉద్దేశంతోనే మంత్రి నారా లోకేష్ దృష్టికి తనపై తప్పుడు సమాచారం ఇచ్చి గన్‌మెన్‌లు లేకుండా చేశారన్నారు. తనకు ప్రాణహాని ఉందని పదేళ్లపాటు గన్‌మెన్లు ఉండాలని గతంలో నివేదిక ఉందని అయితే ఇప్పుడు కనీస సమాచారం ఇవ్వకుండా తొలగించారన్నారు. నియోజకవర్గ ప్రజల రక్షణతో తన పోరాటాన్ని కొనసాగిస్తారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో అనంతపురం రూరల్ జడ్‌పిటిసి సభ్యుడితోపాటు వైసిపి నాయకులు గోపాల్‌రెడ్డి, రాప్తాడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదు



- ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. పార్లమెంటులో వాటి సాపేక్ష ప్రాతినిధ్యం, రాజకీయ పలుకుబడి తగ్గకుండా చూడటమే అసలైన సవాల్ అని ఆమె అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై టిడిపి నేత నారా లోకేష్ లేనిపోని గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసి, మెరుగైన మానవాభివృద్ధి సూచికలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదన్నదే తమ పార్టీ స్పష్టమైన వైఖరి అని ఆమె పునరుద్ఘాటించారు.

కేవలం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదని, కాంగ్రెస్ అగ్రనేత పి.చిదంబరం ట్వీట్‌కు బదులిస్తూ నారా లోకేష్ చేసిన పోస్ట్ పై షర్మిల ఈ విధంగా స్పందించారు. “దక్షిణాది రాష్ట్రాల గొంతుకను తగ్గించే ఎలాంటి పునర్విభజన ప్రక్రియనైనా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. దీనిపై తిరుగులేని రాజ్యాంగ హామీ ఉండాలని మేం డిమాండ్ చేశాం. ఆర్టికల్ 81 ప్రకారం చూస్తే, ఆంధ్రప్రదేశ్‌కు సంఖ్యాపరంగా సీట్లు పెరిగినా, అధిక జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య బలం, నిర్ణయాధికారం తగ్గిపోయే ప్రమాదం ఉంది” అని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో విఫలమైందని ఆరోపించారు.

మోడీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల రోజుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, ఇప్పటికే జాతీయ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తున్నారని షర్మిల విమర్శించారు. ‘సమాఖ్య సమతౌల్యాన్ని, పార్లమెంటరీ పనితీరును కాపాడకుండా సభను విస్తరిస్తే, వ్యక్తిగత ప్రాతినిధ్యం, అర్థవంతమైన చర్చ మరింత బలహీనపడతాయి. దక్షిణాది రాజకీయ ప్రాబల్యాన్ని శాశ్వతంగా కాపాడతామని బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ఎప్పుడూ స్పష్టమైన రాజ్యాంగ హామీ ఇవ్వలేదు. ఒకప్పుడు సమాఖ్య స్ఫూర్తి కోసం, దక్షిణాది ప్రయోజనాల కోసం పోరాడిన టిడిపి, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు, దక్షిణాదికి ఎలాంటి రక్షణలు కోరకుండా బిజెపి అస్పష్ట వైఖరిని సమర్థించడం విడ్డూరంగా ఉంది” అని ఆమె అన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త:** విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. విజయ వాడలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా యువజన సంక్షేమశాఖ, స్టెప్, కృషి ఆధ్వర్యంలో శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన సంక్షేమశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ మత్తు నుండి బయటకు రాలేరని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. విజయవాడలో పోలీసులు నిరంతరాయంగా తనిఖీలు చేస్తున్నారని మాదకద్రవ్యాలు సేవించి పట్టుబడితే జైలుకి వెళ్ళాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు కెరీర్ పైన దృష్టిసారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు జగదీష్, ఎస్ఆర్ఆర్ స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ విజయదీప్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



థార్ జీప్‌లతో ఢీకొట్టుకున్న దృశ్యం

# యువతి కోసం నడిరోడ్డుపై వీరంగం

● థార్ జీప్‌లతో ఢీకొట్టుకున్న ఆకతాయి మిత్రులు

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒకే యువతి ప్రణయ ప్రాపకం కోసం విజయవాడ నడివీధుల్లో ప్రళయం సృష్టించారు ఇద్దరు ఆకతాయి మూకల యువనాయకులు. స్పాట్ ముందే పెట్టుకుని సినిమా తరహాల్లో క్రైమ్ చేసి, జనాన్ని గడగడలాడించారు. కచ్చితంగా శుక్రవారం తొలిగంటల్లో (గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత) ఈ ఘటన జరిగింది. తాడిగడపకు చెందిన రోహిత్, భారతీనగర్‌కు చెందిన బొల్లా ఓమ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. అయితే, ఒక యువతి వ్యవహారంలో గత కొంతకాలంగా వీరి మధ్య తీవ్ర మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఫోన్లలో సవాళ్లు, ప్రతిసవాళ్లు నడిచాయి. ఆ క్రమంలోనే నువ్వో నేనో తెల్చుకుందామంటూ ముందుగానే సవాల్ చేసుకుని అందుకు అర్ధరాత్రి సమయాన్ని ఎంచుకున్నారు. గురునానక్ కాలనీ పరిధిలోకి చేరుకున్న ఇద్దరు యువకులు తమ థార్ వాహనాలతో బరితెగించారు. ఎదురెదురుగా వస్తూ ఒకరి వాహనాన్ని మరొకరు అత్యంత వేగంతో, కక్షతో బలంగా ఢీకొట్టుకున్నారు. అలా ఢీకొట్టుకుంటూనే దాదాపు 100 మీటర్ల మేర రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. వాహనాల టైర్లు ఊడిపోయేలా సాగిన ఈ రౌడీయిజం చూసి అటుగా వెళ్తున్న వాహనదారులు భయంతో పరుగులు తీశారు. అంతటితో ఆగకుండా, వాహనాల నుంచి కిందికి దిగిన ఓమ్, అతని అనుచరులు ఇనుప రాడ్లు, కర్రలతో రోహిత్ జీపు అద్దాలను పగలగొట్టి ధ్వంసం చేశారు. ఘర్షణ సమయంలో ఒకరి వాహనంలో సదరు యువతి, మరో వాహనంలో కొందరు యువకులు ఉన్నట్లు సమాచారం. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పటమట పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూడగానే రోహిత్ వాహనాన్ని వదిలి పరారవ్వగా బొల్లా ఓమ్‌ను మరో ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగలేదని, పరారీలో ఉన్న రోహిత్ కోసం గాలిస్తున్నామని సిఐ పవన్ కిషోర్ తెలిపారు. ఈ వ్యవహారంపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

● కేసు నుండి తప్పించేందుకు సహకరించిన అధికారిణి అరెస్ట్

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవుల్లో తిరుపతిలో పిన్ని ఇంటికి వచ్చిన ఓ బాలిక(16)పై బాబాయి అయిన రామ్మూర్తి (51) లైంగికంగా వేధించి ఇబ్బందిపెట్టిన నిందితుడిని తిరుపతి ఈస్టు పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. తిరుపతిలో జిఎస్‌టి డిపార్టుమెంటులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం విదితమే. నిందితుడు తిరుపతిలో బాలిక ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అదేవిధంగా బాధితురాలితో ఫోన్ షేర్ చాట్ ద్వారా జరిపిన చాట్స్, కలిసి దిగిన సన్నిహిత ఫోటోలను తన వద్ద ఉంచుకొని, తాను పిలిచినప్పుడు రాకపోతే వాటిని సామాజిక మాధ్యమంలో వైరల్ చేస్తానని, ఈ విషయం ఎవరితోనైనా చెబితే ఆమె తల్లిదండ్రులను హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కేసును సంబంధిత పరిధిలోని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆ జీరో ఎఫ్ఐఆర్ ఆధారంగా తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయబడింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం కేసును లోతుగా దర్యాప్తు చేసి కీలక ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు రామ్మూర్తితో పాటు, కేసు నుంచి అతన్ని తప్పించేందుకు సహకరించిన బాధితురాలి పిన్ని మానస, రైల్వే కోడూరు డిప్యూటీ తహసీల్దార్ పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# రేణిగుంటలో ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ దగ్ధం



**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా రేణిగుంటలోని ఎపి ట్రాన్స్‌కో పరిధిలోని 120/కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు వ్యాపించి సబ్ స్టేషన్ దగ్ధమైంది. ఉన్నఫళంగా గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనతో సబ్‌స్టేషన్‌లోని సిబ్బంది పరుగులు తీశారు. అధిక వేడికి తోడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఊహించని ఘటనతో మంటలు వ్యాపించాయి. విలువైన పరికరాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ట్రాన్స్‌కో సిబ్బంది మంటలను అదుపుచేశారు. అధిక వేడి కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

# విజయవాడలోని ఓ హోటల్‌లో అగ్నిప్రమాదం

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సత్యనారాయణ పురంలోని ఒక హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఆ హోటల్ కస్టమర్లు పరుగులు తీస్తూ బయటకు వచ్చారు. సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితిపై స్థానికులు ఇచ్చిన అత్యవసర సమాచారంపై అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించింది. హూటాహూటిన ఘటన స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసింది. హోటల్ లోపల ఉన్న గ్యాస్ సిలిండర్లు వెంటనే బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# వేగంగా ఆర్‌టిసి ఇవి చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇవి చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి శుక్రవారం ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఆర్‌టిసి అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పిడీసీఎల్ పరిధిలో నెల్లూరు, కడవ, అనంతపుం, కర్నూలు, మంగళం వద్ద ఆర్‌టిసి బస్సుల కోసం ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఇవిచార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని సిఎండి శివశంకర్ తెలిపారు. ఈ పనుల్ని చేపడుతున్న కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని, ఎస్‌పిడిసిఎల్, ఎపిఎస్ఆర్‌టిసి అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఈ యేడాది జూన్ 20 లోగా పనులను పూర్తి చేయాలని సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. పనులను చేపట్టే సందర్భాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడినట్లయితే సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను సంప్రదించి, సమస్యల్ని పరిష్కరించుకుని, పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.ఆయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్ జగదీష్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు



రాఘవేంద్రం, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, చంద్రశేఖర్, ఆర్‌టిసి రీజనల్ మేనేజర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

23-5Pg7exHMNWJQE 11_23-5Pg7exHMNWJQE.qxd 23/May/26 12:23 AM Page 1



## వినుకొండలో జ్యువెలర్స్‌లో భారీ చోరీ

**వినుకొండ, మే 22 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని వేక్షిత జ్యువెలర్స్ దుకాణంలో గురువారం రాత్రి దుండగులు భారీగా చోరీకి పాల్పడ్డారు. షాపుకు పక్కనే ఉన్న మెట్ల భాగం నుంచి కన్నం వేసి లోపలికి ప్రవేశించిన దుండగులు దుకాణంలోని బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లారు. ఎంత మేరకు అపహరించారనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రద్దీగా ఉండే ఈ ప్రదేశంలో రాత్రిపూట అయితే ఎవరూ ఉండరని అదునుగా భావించి పక్క ప్లాన్‌తో దుండగులు షాపు పక్కనున్న మెట్ల భాగం నుంచి కన్నం వేసి లోపలికి ప్రవేశించి ఈ దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది.

## డిజిటల్ ముఠా గుట్టురట్టు

### ముగ్గురు సైబర్ కేటుగాళ్ల అరెస్ట్

### రూ.10 లక్షల నగదు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్ స్వాధీనం




**బాపట్ల, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** డిజిటల్ అరెస్ట్ పేరుతో లక్షల రూపాయలు కాజేసిన సైబర్ ముఠాను బాపట్ల జిల్లా చీరాల 2 టౌన్ పోలీసులు ఛేదించారు. విశాఖపట్నానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, పాస్‌పోర్ట్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ వెల్లడించారు. చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని కొత్తపేటకి చెందిన కె.మోహన్‌రావును మార్చి నెలలో సైబర్ నేరగాళ్లు సంప్రదించారు. తాము పోలీస్ అధికారులమంటూ పరిచయం చేసుకుని, మనీ లాండరింగ్ కేసులో నిందితుడివని, డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని బెదిరించారు. కేసు నుంచి బయటపడాలంటే డబ్బు చెల్లించాలని నమ్మబలికారు. దీంతో బాధితుడు విడతల వారీగా రూ.26.50 లక్షలను నిందితులు సూచించిన మూడు బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు మార్చి 30న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ మొయిన్ పర్యవేక్షణలో, సీఐ ఏ.శశికుమార్ నేతృత్వంలో ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ సాంకేతిక సహకారంతో ప్రత్యేక బృందాలు విశాఖపట్నంలో గాలింపు చేపట్టాయి. నిందితుడు నాగాల ప్రదీప్‌కుమార్ అలియాస్ అర్జునరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు గండిబోయిన నిల్‌కుమార్ వద్ద నుంచి రూ.2 లక్షలు రికవరీ చేశారు. ప్రధాన నిందితుడు బొందలపు గోవింద్ ఖాతాతో పాటు మూడు బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.26.50 లక్షల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రూ.10 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, మెమొరీ కార్డు, పెన్‌డ్రైవ్‌లు, పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన సీఐ ఏ.శశికుమార్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణతో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అభినందించి రివార్డులు ప్రకటించారు.



## పెంచిన ఎరువుల ధరలు తగ్గించేలా చూడండి

### - సిఎం చంద్రబాబుకు సిపిఐ రామకృష్ణ వినతి

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ కె.రామకృష్ణ డిమాండ్ చేసారు. ఆయన స్వయంగా సిఎం చంద్రబాబును కలిసి రైతుల సమస్యలతో పాటు పలు అంశాలపై విజ్ఞాపన పత్రాలు అందించారు. జూన్ నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతుంది. రైతులకు అవసరమైన సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, కౌలు రైతులకు గుర్తింపుకార్డుల అందించాల్సి ఉన్నదని సిఎంకు గుర్తుచేశారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం సాగు ప్రణాళిక విత్తన ప్రణాళిక రుణ ప్రణాళిక ప్రకటించాల్సి ఉన్నది కానీ అటువంటి ప్రయత్నం జరిగినట్లు కనబడటంలేదు. మీరు తక్షణం జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇటీవల కాలంలో ఎరువులు ఉత్పత్తి కంపెనీలు కాంప్లెక్స్ ఎరువుల ధరలను విపరీతంగా పెంచాయి. 50 కేజీల కాంప్లెక్స్ ఎరువుల ధరలు రూ.200 నుంచి 375 వరకు పెంచాయి. దీనివల్ల రైతాంగానికి భారంగా మారనున్నాయి. కాబట్టి పెంచిన ఎరువుల ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ఆ మేరకు సబ్సిడీని పెంచే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని పంటలకు నాణ్యమైన విత్తనాలను 90శాతం సబ్సిడీతో రైతాంగానికి అందించాలి. ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్న పలు రకాల పంటల విత్తనాల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇక రాష్ట్రంలో ఔషధ చట్టాల సక్రమ అమలు, ప్రజారోగ్య పరిరక్షణకై తగు సంస్కరణలు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సిఎంని కలిసిన వారిలో రామకృష్ణతో పాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్రసమితి కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తదితరులున్నారు.

## ఆముదాలవలసను అందాలవలస చేస్తాం

### • కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, మే 22 ప్రభాతవార్త:** డబ్బులు పంచే ఆలోచనతో కాకుండా సంపద పెంచే ఆలోచనతో కూటమి సర్కారు ముందుకు వెళ్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం ఆముదాలవలస నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎమ్మెల్యే, పియూసి చైర్మన్ కూన రవికుమార్‌తో కలసి ఆయన పర్యటించారు. తొలుత వంజగి దగ్గర శ్రీ వెంకటేశ్వర ఆలయంలో 15వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, యజ్ఞ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అక్కడి నుండి ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధి జగ్గుశాస్త్రులపేట వద్ద 3.82 కోట్లతో నిర్మిస్తున్న 33/11 కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బూర్జ మండలం మదనాపురం కూడలి నుండి అల్లెన వరకు ఆరుకోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన బిటి రోడ్డును ప్రారంభించారు. ఈ సంధర్భంగా అల్లెన వరకు రోడ్ షో నిర్వహించి అక్కడ జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం జిల్లా వెనుకబడిన జిల్లా కాదని అవకాశాల జిల్లా అంటూ స్పష్టం చేశారు. ప్రజల తోడ్పాటు ఉంటే వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తామని తెలిపారు. నూతన ప్రాజెక్టులు జిల్లాకు తీసుకు రావాలని ప్రయత్నిస్తే పోరాటాలతో కొందరు వాటిని అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. అభివృద్ధిపై అవగాహన ఉన్న వ్యక్తి, చదువుకున్న వ్యక్తి కూన రవికుమార్ ఆముదాలవలస ఎమ్మెల్యేగా ఉన్న నేపథ్యంలో తామిద్దరం ఆముదాలవలసను అందాలవలసగా మార్చేందుకు కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సహకారంతో రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి వైపు బలమైన అడుగులు వేస్తున్నాయని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తున్నామని అన్నారు. లక్షల కోట్ల పెట్టుబడుల రాకతో భవిష్యత్‌లో ఉపాధి విప్లవాన్ని సృష్టిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ తాగునీరు, విద్యుత్, విద్య, వైద్య రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై ఆనందం వ్యక్తం చేశారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

**ఇంద్రకీలాద్రి, మే 22, ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవం శుక్రవారం నిర్వహించారు. ప్రతి నెలా వచ్చే శుద్ధ షష్ఠి తిథి నాడు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని నిర్వహించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. కళావేదికపై జరిగిన ఈ కళ్యాణోత్సవంలో భాగంగా శ్రీ స్వామి అమ్మవార్లను నూతన వధూ వరులుగా చూడముచ్చటగా అలంకరిం చిన తదుపరి కళావేదికపై ఏర్పాటు చేసిన ఆసనాలపై వేంచేపు చేసిన అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కళ్యాణక్రతువు ఆగమోక్తంగా జరిపారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



**అమ్మవారికి బంగారు కానుక:** నంద్యాల జిల్లా నందిపల్లికి చెందిన వి. ఉభయ భాస్కర్ రెడ్డి 22.000 గ్రాములు బరువైన రు.1,60,000ల విలువైన బంగారు నల్లపూసల తాళి, రెండు గిన్నెలను కానుకగా సమర్పించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించగా వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఏలూరు జిల్లా, మహదేవపురంకు చెందిన తుంపాటి లక్ష్మీ వెంకటపతి, భార్య జ్యోత్స్న, వారిపిల్లలు బాల వెంకటసాయి, చరణ్ వెంకట సాయిలు రూ.1,20,000లు విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబ వారు రు.3లక్షలను విడివిడిగా 3 పథకాలకు విరాళమందించారు. పొట్లూరి వనజాక్షి నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష, ఉచిత ప్రసాద వితరణకు రు.1లక్ష పొట్లూరి పూర్ణచంద్రరావు, రు.1లక్ష గో సంరక్షణ ట్రస్టుకు సునీల్‌కుమార్ కాట్రగడ్డ, వెంకట్ కాట్రగడ్డలు విరాళంగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించగా వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

**యుద్ధ ప్రాతిపదికన మెట్ల మార్గం మరమ్మతులు:** ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ వారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన మెట్ల మార్గం మరమ్మతు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఇటీవల మెట్ల మార్గంలో తలెత్తిన చిన్నపాటి ఇబ్బందులను గమనించిన ఈ.ఓ వీకే సీనానాయక్ ఆదేశాల మేరకు, ఇంజనీరింగ్ అధికారులు ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. శుక్రవారం కావడంతో, సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ మెట్ల మార్గంలో ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా మెట్ల పూజ నిర్వహించుకున్నారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తుల కోలాహలం:** వేసవి సెలవులు, శుక్రవారం కావడంతో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇన్‌చార్జ్ ఈఓ రంగారావు క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. భక్తులతో ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకుని, దర్శనం సాఫీగా సాగేలా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎండ వేడి నుండి భక్తులను రక్షించేందుకు క్యూలైన్లలో చల్లని మజ్జిగ, శుద్ధి చేసిన తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. ఎక్కడా నీటి కొరత లేకుండా దేవస్థాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.

**కూచిపూడి నృత్య ప్రదర్శన:** హైదరాబాద్‌కు చెందిన రాధా కృష్ణ అకాడమీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య కళాకారుడు టి. విజయ్ రామరాజు బృందం ప్రదర్శించిన సంప్రదాయ కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. శ్రీఅమ్మవారి వైభవాన్ని చాటే నవదుర్గ, అయిగిరి నందినిలతో పాటు అలోకయే శ్రీబాలకృష్ణం, చంద్రచూడ, అర్ధనారీశ్వరం వంటి భక్తిరస నృత్య రూపకాలతో అలరించిన కళాకారులను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి శేషవస్త్రం మరియు ప్రసాదాలను అందజేశారు.

## ఎపిలో రూ.1,990 కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులు

### కేంద్రం ఆమోదం: మంత్రి నారాయణ వెల్లడి



**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో రూ.1,990.83 కోట్ల విలువైన అర్బన్ చాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం తెలిపిందని మంత్రి నారాయణ తెలిపారు. నాలుగు కీలకమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ఫండ్ ద్వారా మొత్తం రూ.497.71 కోట్ల కేంద్ర సాయం మంజూరు చేసిందన్నారు. విశాఖపట్నం, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లలో ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద నాలుగు ప్రాజెక్టులకు ఆమోదం రావడం రాష్ట్రానికి గొప్ప గుర్తింపు అని మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. సాధారణ మున్సిపల్ పనులకు మించి ఆధునిక పట్టణాభివృద్ధిపై ఫోకస్ చేశామన్నారు.

తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మురుగు నీటి శుద్ధిపై ప్రభుత్వం ప్రధాన దృష్టి సారించిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా విశాఖ, మంగళగిరి - తాడేపల్లిలో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని అన్నారు. పట్టణాల్లో కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ముందుగా పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ అవకాశాన్ని రాష్ట్రం పూర్తిస్థాయిలో వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యుత్తమ పట్టణ మౌలిక వసతుల రాష్ట్రంగా తీర్చి దిద్దుతామని అన్నారు. పట్టణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికి మోడల్‌గా నిలుస్తుందని స్పష్టం చేశారు. విశాఖ పట్నం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నాలుగు ప్రాజెక్టులకు ఆమోదం లభించడం ఏపీకి గొప్ప గుర్తింపు. అన్నారు.సీఎం చంద్రబాబు నాయకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాధారణ మున్సిపల్ పనులకు మించి ఆధునిక పట్టణాభివృద్ధిపై ఫోకస్ పెట్టాం. తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మురుగునీటి శుద్ధిపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా విశాఖ, మంగళగిరితాడేపల్లిలో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. పట్టణాల్లో కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ముందుగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ అవకాశాన్ని ఏపీ పూర్తిస్థాయిలో వినియోగించు కుంటుంది. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యుత్తమ పట్టణ మౌలిక వసతుల రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. పట్టణాభివృద్ధిలో దేశానికి ఆంధ్రప్రదేశ్ మోడల్‌గా నిలుస్తుందిఖి అని చెప్పారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, నగరాల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ని ఏర్పాటు చేసింది. పట్టణాలను ఆర్థికవృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దడం, అలాగే ప్రైవేట్ లేదా మార్కెట్ పెట్టుబడులను ఆకర్షించే ఉద్దేశంతో కేంద్రం ఈ ఫండ్‌ని కేటాయించింది.

**పురపాలికల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటు, జూన్ ఆఖరికి ప్రాసెసింగ్ ప్రారంభించాలన్న మంత్రి**

పురపాలికల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటుపై మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ, గుత్తేదారు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఘన వ్యర్థాల ప్రాసెస్‌కు ప్రభుత్వం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు నెలకొల్పుతున్నట్లు అధికారులకు తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ మొత్తం 107 పురపాలికల్లో కొనసాగుతుంది. మంత్రి నారాయణ ప్లాంట్ల పనులు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వాటికి మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్లకు సూచించారు. జూన్ ఆఖరికి ప్లాంట్లు పూర్తి చేసి ప్రాసెసింగ్ ప్రారంభించాలని మంత్రి నారాయణ ఆదేశించారు.

**మండుటెండల వేళ...** రూ.48 లక్షల నిధులతో సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

## ట్రాఫిక్ పోలీసులకు డిజిపి అండ

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేసవి తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. పట్టణాల్లో ఉష్ణోగ్రతలు 42 నుండి 46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవు తున్నాయి. ఈ మండుటెండలో రోడ్డు మీద గంటల తరబడి నిలబడి ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది అనారోగ్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా స్పందించి, సిబ్బంది రక్షణ కోసం శీఘ్రగతిన చర్యలు అమలు చేయాలని నిర్ణయించారు.



ట్రాఫిక్ సిబ్బందికి అవసరమైన రక్షణ సామగ్రిని అందించేందుకు డీజీపీ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.48 లక్షల నిధులు ప్రత్యేకంగా కేటాయించారు. పోలీస్ శాఖ బడ్జెట్ నుండి ఈ మొత్తాన్ని తక్షణమే విడుదల చేయాలని ఆర్థిక విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం అత్యంత ముఖ్యమైనవని, వారి రక్షణకు ఎలాంటి రాజీ పడబోమని డీజీపీ స్పష్టం చేశారు.కేటాయించిన నిధులతో ట్రాఫిక్ సిబ్బందికి కింది రక్షణ వస్తువులు అందించనున్నారు.

యూవీ ప్రొటెక్షన్ గాగుల్స్ను సూర్యుని హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి కళ్ళను కాపాడేందుకు.. వైట్ క్యాప్స్ ను తల మీద నేరుగా పడే ఎండ వేడిమిని నివారించేందుకు... ఓఆర్ఎస్ ప్యాకెట్లను చెమటతో శరీరంలో తగ్గిపోయే లవణాలను, నీటి శాతాన్ని తిరిగి నింపేందుకు.వాటర్ బాటిల్స్ను నిరంతరం నీళ్ళు తాగుతూ డీహైడ్రేషన్‌ను అడ్డుకునేందుకు. ఇస్తున్నారు వాహనాల నుండి వెలువడే ధూళి, కాలుష్యం నుండి శ్వాసవ్యవస్థను రక్షించుకునేందుకు. ఫేస్ మాస్కులు ఇస్తున్నారు దీనివల్ల 3,192 మంది సిబ్బందికి లబ్ధి కలుగుతుంది

రాష్ట్రంలో విభిన్న స్థానాల్లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న మొత్తం 3,192 మంది సిబ్బంది ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. నగరాల్లో సిగ్నల్స్ వద్ద, జాతీయ రహదారులపై, బస్టాండులు, రైల్వే స్టేషన్ల సమీపంలో విధులు నిర్వహించే ట్రాఫిక్ కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళు, ఎస్ఐలు అందరూ ఈ పంపిణీలో భాగస్వాములు అవుతారు..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ కమిషనరేట్లకు మరియు జిల్లా సూపరింటెండెంట్ల ఆఫ్ పోలీస్ (ఎస్పీ)లకు నిధులు వెంటనే విడుదల చేయాలని, సామగ్రి సేకరణ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేసి అన్ని యూనిట్లకు పంపిణీ చేయాలని డీజీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

డీజీపీ తీసుకున్న ఈ చొరవకు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. "రోజూ గంటల తరబడి ఎండలో నిలబడి విధులు చేయడం చాలా కష్టంగా ఉంటుంది. డీజీపీ మా సంక్షేమాన్ని పట్టించుకున్నారు, ఇది మాకు చాలా స్ఫూర్తినిస్తోంది" అని ఒక కానిస్టేబుల్ తన అభిప్రాయం తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో పోలీస్ శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో స్పష్టంగా చాటుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### జీవ వైవిధ్యం, పర్యావరణ స్థిరత్వమే లక్ష్యంగా

## హరిత సమరం

### • మహా యజ్ఞంలా విత్తన బంతుల తయారీ, పంపిణీ

### • 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీకి అటవీ శాఖ సన్నాహాలు



**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** జీవవైవిధ్యం, పర్యావరణ స్థిరత్వమే లక్ష్యంగా హరిత సమరం చేస్తున్నమన్నామని, రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల విత్తనబంతుల పంపిణీకి అటవీశాఖ సన్నాహాలు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ తెలిపారు. విత్తనబంతుల తయారీ, పంపిణీ మహాయజ్ఞంలా చేయనున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంచడమే లక్ష్యంమన్నారు. విత్తన బంతుల తయారీ, పంపిణీ అంశంపై అటవీ శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ...“మనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీ. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలుపుదామ”ని పిలుపునిచ్చారు. జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతుల తయారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేతలు, డ్వాక్రా మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత ఇందులో పాల్గొంటారన్నారు. సీడ్ బాల్స్ చల్లేందుకు డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ హరిత సమరంలో భాగంగా జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విత్తన బంతుల తయారీ కార్యక్రమాలు జరగనున్నాయి. దీనిని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రజా ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వాలంటీర్లతోపాటు రాష్ట్ర ప్రజలను, అన్ని వర్గాల ప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. వర్షాకాలం సీజన్‌ను పూర్తిగా వినియోగించుకుంటూ జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించనున్నారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ల సాంకేతికత ఉపయోగించడం, చేతులతో నాటడం చేస్తారు. అడవులలో జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిణామాన్ని మెరుగుపరచడం, పర్యావరణ స్థిరత్వం, పచ్చదనాన్ని పెంచడం, వాతావరణ మార్పులను సమర్థవంతంగా తట్టుకునే విధంగా స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం కోసం ఈ హరిత ఉద్యమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసారు. ఈ విషయంలో ప్రజలకు పరిపూర్ణ అవగాహన కల్పించాలన్నారు.

## అమరావతిపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

### • బిజెపి అధికార ప్రతినిధి యామిని శర్మ

**విజయవాడ, మే 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా పాలనలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసిన జగన్‌కు అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ మండిపడ్డారు. జగన్ ప్రెస్‌మీట్లలో చెప్పే మాటలు ఆయన రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగన్ నడిపిన ఫ్యాక్షన్, గంజాయి, మైనింగ్ మాఫియా రాజ్యమే అసలైన జంగిల్ రాజ్, నేరస్థులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వైకాపా శాంతిభద్రతల గుర్తించి మాట్లాడడం ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్. అబద్దాల స్క్రిప్ట్ చదవడం ఆపి, ప్రజలు ఎందుకు తిరస్కరించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి అని విమర్శించారు.



దీప ప్రజ్వలన చేస్తున్న అవని పీఠాధిపతి శ్రీ అద్వైత నంద భారతి స్వామి

## వేద మంత్రోచ్ఛారణలతో చతుర్వేద సమ్మేళనం

**అనంతపురం కల్చరల్, మే 22 ప్రభాతవార్త:** వేద పండితులు వేద మంత్రాలు చతుర్వేద మంత్రాలతో అనంత పునీతమయింది. నగర శివార్లలోని సోముల్ దొడ్డి వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో కంచి, శృంగేరి పీఠాధిపతుల ఆదేశాలతో లోక కళ్యాణ అర్థం మూడు రోజులపాటు చతుర్వేద సమ్మేళనం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అవని శ్రీ శృంగేరి పీఠాధిపతి శ్రీ అద్వైతనంద భారతి స్వామి కార్యక్రమానికి శ్రీకారంగా దీప ప్రజ్వలన చేశారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని భక్తులకు సూచించారు. అనంత బ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ గోవింద ప్రకాష్ బట్ సోమయాజి పర్యవేక్షణలో నాలుగు వేదాలను ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణ వేద పండితులతో వేద మంత్రాలతో హోమాలను ప్రారంభించారు. ఉదయం నుండి చతుర్వేద వేద ఘోషలతో ప్రాంతం ఆధ్యాత్మికత సంతరించుకుంది.

## తెలుగు సాహిత్యంలో జి.యమున రాణికి డాక్టరేట్

### • మల్లాది వెంకటకృష్ణమూర్తి సాంఘిక నవలలపై పరిశోధన



**అనంతపురం, మే 22 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ తెలుగు సాహిత్య విభాగంలో పరిశోధన నిర్వహించిన జి.యమున రాణికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రదానం చేసారు. ఈ సమాచారాన్న విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం వెల్లడించారు. మల్లాది వెంకటకృష్ణమూర్తి తొలి దశకం సాంఘిక నవలలు-పాత్ర చిత్రణ అనే అంశంపై ఆచార్య మాడిగుల ప్రఫుల్ల పర్యవేక్షణలో, డాక్టర్ మల్లా పెంచల ప్రసాద్ సహకారంతో ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఆమోదించింది. మల్లాది వెంకట కృష్ణమూర్తి రచనలలో మధ్యతరగతి జీవనం, కుటుంబ సంబంధాలు, మహిళా పాత్రల భావ ప్రపంచం, సామాజిక మార్పుల ప్రతిబింబం వంటి అంశాలను యమున రాణి తన పరిశోధనలో విశ్లేషించారు. పాత్రల నిర్మాణం, కథన శైలి, సామాజిక స్పృహను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసినట్లు అధ్యాపకులు తెలిపారు. డాక్టర్ జి.యమున రాణి గత ఏడు సంవత్స రాలుగా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థలో సహాయ ఆచార్యురాలిగా సేవలందిస్తున్నారు. జాతీయ, అంతర్జా తీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించడంతోపాటు కవితలు, వ్యాసా లు, పుస్తకాలు రచించారు. సాహిత్య, సామాజిక రంగాల్లో ఆమె చేస్తున్న సేవలను విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. ఈ నెల 15న వైవా పరీక్ష నిర్వ హించగా, 16న విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి ఉన్నత విద్యాసంస్థలు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహితీవేత్తలు జి.యమున రాణికి అభినందనలు తెలిపారు.

## అనంతపురంలో భారీ వర్షం

**అనంతపురం, మే 22 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో గురువారం రాత్రి కొన్ని మండలాల్లో అకాల వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం చల్లబడింది. ఇన్నాళ్లు మండుతున్నాయి ఎండలతో ఇబ్బంది పడ్డ ప్రజలు ఈ వర్షంతో కొంత ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. వర్షం కోసం ఎదురు చూస్తుంటే రాప్తాడు, ఆత్మకూరు ఇలాంటి కొన్ని మండలాల్లో కొంతమంది రైతుల పంటలు కూడా చాలా వర్షాల వల్ల దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి వర్షపాత వివరాలను పరిశీలిస్తే రాప్తాడులో ఆత్మకూరులో 72, రాప్తాడు 68, సింగనమల, తాడపత్రిలో 52, గుమ్మగట్టలో 58, రాయదుర్గము, కళ్యాణదుర్గంలో 44, బుక్కరాయ సముద్రం, అనంతపురం రూరల్‌లో 38 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అనంతపురం అర్బన్ లో 35, బ్రహ్మసముద్రంలో 30, నార్పల్లో 24, కుడేర్ 24, బెలుగుప్ప లో 23, సెట్టూరులో 21 మిల్లీమీటర్ల వర్షం వచ్చింది.





## మూడు మ్యాచ్‌లు 4 జట్లు, ఒక సీటు

# చివరి బెర్త్ జాక్‌పాట్ ఎవరిదో?

**కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ చివరి స్టేజ్‌కు చేరువైంది. మార్చి 26న ప్రారంభమైన ఐపీఎల్‌లో మరో మూడు లీగ్ మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ప్లే ఆఫ్ చేరే ఆ నాలుగు జట్లలో మూడు మాత్రమే ఖరారయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్‌కు చేరుకున్నాయి. మరో బెర్త్ ఖరారవ్వాల్సి ఉంది. ప్లే ఆఫ్‌కు చేరే నాలుగో జట్టేది అన్నది ఆసక్తి రేపుతోంది.**

(వార్త క్రీడా విభాగం)

ప్లే ఆఫ్‌కు మొదటగా చేరే జట్లలో పంజాబ్ కింగ్స్ మొదటి స్థానంలో, రాజస్థాన్ రాయల్స్ రెండో స్థానంలో ఉంటాయని తొలి దశ తర్వాత అంతా ఊహించారు. దానికి భిన్నంగా ఆ జట్లు ప్లే ఆఫ్‌కు చేరడం అటుంచి ఇపుడు అక్కడికి అర్హత పొందుతాయా అన్న డైలమాలో పడ్డాయి. నాలుగో బెర్త్ కోసం రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ పోటీపడుతున్నాయి. నేడు, రేపు జరిగే మ్యాచ్‌ల్లో ఎవరిది నాలుగో బెర్త్ అన్నది తేలిపోనుంది.

**పంజాబ్ గెలిచినా?**

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అయిదో స్థానంలో ఉంది. వరుసగా ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది జోరుమీద కనిపించిన పంజాబ్ ఆతర్వాత ఒక్కసారిగా ఢీలా పడింది. ఆ తరువాత వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓడి ప్రస్తుత స్థితికి వచ్చింది. నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. సొంతగడ్డలో మ్యాచ్ జరుగుతుండడం లక్నోకు అనుకూలించే అంశం. గత కొన్నిమ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్లకు షాకిస్తున్న లక్నోపై పంజాబ్‌కు గెలుపు తప్పనిసరి. 15 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుంటుంది. గెలిచినా ప్లేఆఫ్ ఖచ్చితంగా చేరుతుందన్న గ్యారంటీ లేదు. ఆదివారం రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితం కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ఈమ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓడిపోవాలని కోరుకోవాల్సి ఉంటుంది. ఇక పంజాబ్ కింగ్స్ ఓడితే ఆశలు గల్లంతే.

**రాజస్థాన్ గెలిస్తే ప్లేఆఫ్ బెర్త్**

ఇక రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడు ఓటముల తర్వాత గెలిచి నిలవాల్సిన మ్యాచ్‌లో లక్నోపై గెలుపొంది ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ప్రస్తుతం 13మ్యాచ్‌ల్లో 7విజయాలు, 6 పరాజయాలతో 14పాయంట్లతో నాలుగో స్థానంలో ఉంది. నేడు ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్‌ను ఓడించిన రాయల్స్... ఈ మ్యాచ్‌లోనూ గెలుపొందితే 16 పాయిట్లతో ప్లే ఆఫ్‌కు చేరుకుంటుంది. పంజాబ్, కేకేఆర్, ఢిల్లీ ఇంటికే. రాజస్థాన్ ఓడితే 14పాయింట్లకే పరిమితమవుతుంది. అపుడు నేటి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓడిపోతే 13 పాయింట్ల వద్దే నిలిచిపోతుంది. ఆదివారం జరిగే రెండో మ్యాచ్ కీలకమవుతుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌లో ఢిల్లీ గెలవాలని కోరుకోవాల్సి ఉంటుంది. అపుడు తక్కువ నెట్‌రన్‌రేట్ ఉన్న ఢిల్లీకి బదులు రాజస్థాన్ ముందంజ వేస్తుంది.

**రాయల్స్ ఓడితేనే కోల్‌కతాకు ఛాన్స్**

13 పాయింట్లతో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతగడ్డ ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. అంతకు ముందు మ్యాచ్‌లో రాజస్థాన్ గెలిస్తే మాత్రం ఈ మ్యాచ్ నామమాత్రమే. పంజాబ్, రాజస్థాన్ ఓడిపోయి.. కేకేఆర్ విజయం సాధిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. ఢిల్లీ గెలిస్తే మాత్రం మళ్లీ నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది. ఢిల్లీతో పోరు వర్షం కారణంగా రద్దైనా సరే కోల్‌కతాకు నాకౌట్ బెర్తు ఛాన్స్ ఉంటుంది. అప్పుడూ ఏ జట్టు నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉంటే వారిదే నాలుగో ప్లేస్. మొత్తానికి నాలుగో బెర్త్ సాధించేదెవరు అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# ఆర్సీబీపై సన్‌రైజర్స్ ఘనవిజయం



**హైదరాబాద్, మే 22(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్‌లో సన్‌రైజర్స్ బ్యాట్స్‌మెన్ పరుగుల సునామీ సృష్టించారు. ఓపెనర్ అభిషేక్ (22 బంతుల్లో 56; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 79; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్లాసెన్ (24 బంతుల్లో 51; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో విశ్వరూపం చూపారు. వీరికి తోడుగా ట్రావిస్ హెడ్(16 బంతుల్లో 26; 5 ఫోర్లు), నితీష్‌కుమార్ రెడ్డి(12 బంతుల్లో 29 నాటౌట్; 1ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం లక్ష్య ఛేధనలో ఆర్సీబీని ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 200 పరుగులకు పరిమితం చేసింది. ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ(15) నిరాశపరచగా, ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. వెంకటేశ్ అయ్యర్(44), దేవ్‌దత్ పడిక్కల్(21) రాణించారు. రజత్ పాటిదార్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు కృనాల్ పాండే(41 నాటౌట్) ధాటిగా ఆడినా భారీ స్కోరును అందుకోలేకపోయారు. 55పరుగుల తేడాతో నెగ్గి లీగ్ స్టేజ్‌ను సన్‌రైజర్స్ విజయంతో ముగించింది. సన్‌రైజర్స్ 18 పాయింట్లతో ఆర్సీబీ, గుజరాత్‌తో సమంగా నిలిచినా నెట్‌రన్ రేట్‌లో వెనకబడింది. టేబుల్‌లో ఆర్సీబీ మొదటి స్థానంలో.. గుజరాత్, సన్‌రైజర్స్ వరుసగా 2,3 స్థానాల్లో నిలిచాయి.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆరెంజ్ టీమ్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. ట్రావిస్ హెడ్, అభిషేక్ తొలి ఓవర్ నుంచే దంచడం మొదలుపెట్టారు. భువీ వేసిన తొలి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదారు. ఇక రసిఖ్ ఓవర్లో మూడు ఫోర్లు బాదిన హెడ్... చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో తొలి వికెట్ 45 పరుగుల వద్ద పడింది. ఈ దశలో ఇషాన్ తో జతకట్టిన అభిషేక్ మరింత జోరు చూపాడు. సుయాంష్ ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ రెండు సిక్స్‌లు, షెఫర్డ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కురిపించాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అదే క్రమంలో సుయాంష్ బంతికి భారీ షాట్ ఆడబోయి అభి పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో జతకట్టిన ఇషాన్, క్లాసెన్.. ఎస్ఆర్‌హెచ్ ఇన్నింగ్స్‌ను మరో రేంజ్‌కు తీసుకెళ్లారు. తొలుత ఆచితూచి ఆడిన ఇద్దరూ ఆ తర్వాత గేర్ మార్చారు. పోటాపోటీగా ఫోర్లు, సిక్సర్లతో ఆర్సీబీ బౌలర్లను ఊచకోత కోశారు. హేజిల్‌వుడ్ వేసిన 13వ ఓవర్లో క్లాసెన్ మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో సహా 27 రన్స్ సాధించాడు. ఈ క్రమంలో క్లాసెన్ 23 బంతుల్లో ఇషాన్ 31 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేశారు. ఎస్ఆర్‌హెచ్ స్కోరును 200 మార్కు దాటించారు. మాంచి ఊపుమీదున్న క్లాసెన్ (51) మరింత వేగంగా ఆడే క్రమంలో కృనాల్ పాండ్యా బౌలింగ్ లో వెనుదిరిగాడు. క్లాసెన్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 12 బంతుల్లోనే ఒక ఫోర్, మూడు సిక్సర్లు బాది 29 పరుగులు చేశాడు. ఫస్ట్ డౌన్ లో బ్యాటింగ్ కు వచ్చిన ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ లాస్ట్ బౌల్ కు ఔట్ అయ్యాడు. 46 బంతుల్లో 8 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టి హైదరాబాద్ కు భారీ స్కోర్ అందించాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలాందార్ రెండు, సుయాష్, కృనాల్ పాండ్యా చెరో వికెట్ తీశారు.





# క్వార్టర్స్‌లో అష్మిత ఓటమి ముగిసిన భారత్ సవాల్

**కౌలాలంపూర్:** మలేషియా మాస్టర్స్ 2026 బ్యాడ్మింటన్‌లో భారత్ సవాల్ ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న భారత రైజింగ్ స్టార్ అష్మిత చలిహా క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పొందింది. డెన్మార్క్‌కు చెందిన మాజీ యూరోపియన్ ఛాంపియన్ లైన్ కెర్స్‌ఫెల్డ్ చేతిలో 23-21, 21-18, 21-11తో ఓడింది. చలిహా మొదటి గేమ్ నెగ్గి శుభారంభం చేసింది. రెండో సెట్‌లోనూ ఇద్దరూ పోటాపోటీగా పాయింట్లు రాబట్టారు. 17-17తో సమవుజ్జీగా నిలిచారు. ఈ దశలో అష్మిత ఒత్తిడికి లోనై పొరపాట్లు చేయగా, పుంజుకున్న కెర్స్ ఫెల్డ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి సమం చేసింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో కెర్స్‌ఫీల్డ్ జోరు ముదు అష్మిత నిలవలేకపోయింది. హోరాహోరీగా సాగిన నిర్ణయాత్మక గేమ్ ఏకపక్షంగా మారింది. బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో అష్మిత ప్రస్తుతం 71వ స్థానంలో ఉంది. అంతకుముందు ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండుసార్లు జూనియర్ ప్రపంచ ఛాంపియన్ మలేషియాకు చెందిన గో జిన్ వెయ్‌ను అష్మిత వరుస గేమ్‌లలో ఓడించింది. కాగా మహిళల సింగిల్స్‌లో మాళవిక, దేవిక సిహాగ్ ప్రి క్వార్టర్ ఫైనల్లో వెనుదిరగారు. ఇక లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమితో పురుషుల సింగిల్స్‌లో భారత ప్రయాణం మొదటి రౌండ్‌లోనే ముగిసింది. భారత షట్లర్లు మంగళవారం నుంచి ప్రారంభమయ్యే సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నారు.

# ఐపిఎల్‌లో ధోనీ స్కామ్ : సీఎస్కేపై మండిపడ్డ శ్రీకాంత్

చెన్నై: ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆట కోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడతాడు అని ఊరించిన చెన్నై యాజ మాన్యం.. చివరికి అభిమానులను పిచ్చోళ్లను చేసింది. సీఎస్‌కే యాజమాన్యం తీరుపై టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఓ రేంజ్‌లో మండిపడ్డాడు. ఐపీఎల్‌లో ధోనీ స్కామ్‌కు సీఎస్‌కే పాల్పడిందని విమర్శించారు. ఎంఎస్ ధోనీ ఫిటినెస్ మొత్తం ఓ మాయ అని పేర్కొన్నాడు. మొత్తానికి క్రికెట్ అభిమానులను సీఎస్కే యాజమాన్యం పిచ్చోళ్లను చేసిందని మండిపడ్డారు. ఎంఎస్ ధోనీ ఈ ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడతాడని చెన్నై కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్దాలని తేలిందన్నారు.



# కేంద్రానికి ఆర్బీఐ 2.87 లక్షలకోట్ల డివిడెండ్




**ముంబయి, మే 22:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి భారీ మొత్తంలో మిగులు నిధులు బదలీ అవుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వానికి బదిలీ చేయాల్సిన మిగులు నిధులపై (డివిడెండ్) ఆర్బీఐ సెంట్రల్‌బోర్డు నిర్ణయం వెలువరించాల్సి ఉంది. ఈసారి డివిడెండ్ మొత్తం గత ఏడాది రికార్డును అధిగమించి రూ.3 లక్షల కోట్లకు పైగా ఉండవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

ఇది ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు పెద్ద ఊరటనివ్వనుంది. గతేడాది ఆర్బీఐ రూ.2.68 లక్షల కోట్ల రికార్డు స్థాయి డివిడెండ్‌ను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఈసారి అంతకుమించి సుమారు రూ.2.87 లక్షల కోట్ల నుంచి రూ.3.3 లక్షల కోట్ల మధ్య డివిడెండ్ ఉండవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎంకే గ్లోబల్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. పన్నేతర ఆదాయం రూపంలో అందే ఈ భారీ మొత్తం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నడుమ ప్రభుత్వానికి ఎంతగానో తోడ్పడనుంది. మార్కెట్ నుంచి అదనపు రుణాలు సమీకరించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక లోటును అదుపులో ఉంచేందుకు మేలుచేస్తుంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి, ఆర్బీఐ నుంచి డివిడెండ్ల రూపంలో రూ.3.16 లక్షల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈసారి అధిక డివిడెండ్‌కు ప్రధాన కారణం కంటింజెన్సీ రిస్క్ బఫర్(సీఆర్‌బీ)ను తగ్గించే అవకాశం ఉండటమేనని అంచనా. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ మాట్లాడుతూ గతేడాది విదేశీ మారక నిల్వల వినియోగం ద్వారా వచ్చిన అధిక ఆదాయం వల్ల డివిడెండ్ పెరిగింది. కానీ ఈసారి సీఆర్‌బీని తగ్గించడం ద్వారా మిగులు నిధులు పెరిగే అవకాశం ఉంది. ఈసారి డివిడెండ్ రూ.3 3.2 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చని వివరించారు.

ఆర్బీఐ ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం కంటింజెన్సీ రిస్క్ బఫర్‌ను 4.5 శాతం నుంచి 7.5 శాతం మధ్యలో నిర్వహించాలి. ప్రస్తుతం ఇది గరిష్ఠ స్థాయిలో అంటే 7.5 శాతం వద్ద ఉంది. దీనిని స్వల్పంగా 7 శాతానికి తగ్గించినా కూడా ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు భారీగా నిధులు అందుబాటులోకి వస్తాయి. అధిక వడ్డీ ఆదాయం, బఫర్ అవసరాలు తగ్గడం వంటి కారణాలు ఈసారి అధిక చెల్లింపులకు మద్దతుగా నిలుస్తాయని ఎంకే గ్లోబల్ చీఫ్ ఎకనమిస్ట్ మాధవి అరోరా పేర్కొన్నారు.




## స్వల్ప లాభాలతో ముగిసిన

# సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మే 22:** ఈక్విటీ మార్కెట్లు వారాంతంలో స్వల్పలాభాలతోనే సరిపెట్టాయి. సానుకూలంగా న్న ప్రపంచ మార్కెట్‌ధోరణులు, ఇరాన్ అమెరికామధ్య శాంతి ఒప్పందం జరుగుతుందన్న అంచనాలు ఇన్వెస్టర్లలో పెట్టుబడులకు సానుకూలత కనిపించింది. అయితే చివరిదశలో ఎంపిక చేసిన షేర్లలో లాభాల స్వీకరణ కూడా జరిగింది. ప్రైవేటు బ్యాంకులు, ఆర్థికరంగ స్టాక్స్ లాభాల్లో వెళ్లాయి. హెల్త్‌కేర్, ఫార్మారంగషేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మొత్తంగాచూస్తే ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. బిఎస్ఇ ఎస్సెక్స్ 231.99 పాయింట్లుపెరిగి 75,415.35 పాయింట్లవద్ద స్థిరపడితేనిఫ్టీ 50 సూచీ 64.60 పాయింట్లవద్దకు చేరి 23,719.30 పాయింట్లవద్దట్రేడింగ్ ముగించింది.

బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.11శాతంపెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 0.26శాతం క్షీణించింది. బిఎస్ఇలో 2168 కంపెనీల షేర్లుపెరిగితే 2027 షేర్లుక్షీణించగా మరో 174షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 95.68వద్ద నిలిచాయి. అంతకుముందు రోజు 96.36వద్ద ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటి సెటిల్‌మెంట్ ధరలు లక్షా 59వేల 127కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 2.32 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 104.90 చొప్పున ట్రేడ్ అయింది. అమెరికా డౌజోన్స్ ఫ్యూచర్లు 151 పాయింట్లు పెరిగింది. యూరోపియన్ షేర్లు వారాంతంలో గరిష్ఠంగానే ట్రేడ్ అయ్యాయి. యుకె మార్కెట్‌షేర్లు ఒత్తిడులకులోను కాగా ఆసియా షేర్లు మాత్రం గరిష్ఠ స్థాయిలోనే ట్రేడ్ అయ్యాయి. అమెరికా ఇరాన్ దౌత్య చర్చలే ఇందుకు కారణమని తెలుస్తోంది. వాల్‌స్ట్రీట్ డౌజోన్స్ పారిశ్రామిక సగటు 276.31 పాయింట్లుపెరిగితే ఎస్అండ్‌పి 500 సూచీ 0.17 శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.09శాతంపెరిగాయి. ఇక నిఫ్టీలోప్రైవేటు బ్యాంక్‌సూచీ 1.49శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.96 శాతం, బంధన్‌బ్యాంకు 1.79, యస్‌బ్యాంకు 1.44, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.30, ఇండస్‌ఇండ్ 1.13, ఫెడరల్ బ్యాంకు 1.06, కోటక్ మహీంద్ర 0.908, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు 0.95శాతం పైపైకి వెళ్లాయి. ఎస్‌ఐసి షేర్లు 1.59శాతంపెరిగాయి. గెయిల్ 3.12,3ఎం ఇండియా 3.46శాతం పెరిగితే మారుతిసుజుకి 0.18 శాతం క్షీణించింది. లక్ష్మీడెంటల్ 20శాతంపెరిగింది. రామ్‌కో సిస్టమ్స్ కూడా 20శాతానికి వెళ్లింది. సెంట్రల్ బ్యాంక్ 7.81శాతంపెరిగింది. క్విక్ హీల్ టెక్నాలజీస్ 7.06 శాతం, విఎ టెక్ వాబాగ్ 1.48శాతంచొప్పున పెరిగాయి.

# స్వల్పంగా తగ్గిన పసిడి వెండి మాత్రం అదే జోరు



**ముంబయి, మే 22:** కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు శుక్రవారం స్వల్పంగా బ్రేక్ పడింది. పసిడి ధర కాస్త తగ్గడంతో కొనుగోలుదారులకు కొద్దిగా ఊరట లభించింది. అయితే, వెండి ధర మాత్రం తన పరుగును కొనసాగిస్తూ మరోసారి భారీగా పెరిగింది. ఈరోజు ఉదయం 10.30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరరూ.440 తగ్గి రూ.1,59,490 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.400 తగ్గి రూ.1,46,200కు చేరింది. మరోవైపు కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.5,000 పెరిగి రూ.2,95,000కు చేరుకుంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే ధరలు కొనసాగాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధరరూ.1,61,240గా ఉండగా, ముంబైలో రూ.1,59,490గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,640 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశవ్యాప్తంగా వెండి ధరలు కిలోకు రూ.2.85 లక్షల నుంచి రూ.2.95 లక్షల మధ్య కొనసాగాయి. హైదరాబాద్‌లో రూ.2.95 లక్షలుగా కొనసాగింది. ఏడాదిపాటు బంగారం కొనుగోలు చేయవద్దన్న ప్రధాని పిలుపుతో బులియన్ మార్కెట్ ఒక్కసారిగా ధమాల్ మంది. అయితే వెండిపరంగా పారిశ్రామిక వినియోగం పెరుగుతుండటంతో డిమాండ్ ఏర్పడింది. చిప్స్ తయారీ, సోలార్ ఫోటోవోల్టాయిక్ ప్యానెళ్ల తయారీలోను వెండి వినియోగం భారీగా పెరిగిన సంగతి తెలిసిందే.

# కాల్గేట్ పామోలివ్ రాబడులు రూ.1595 కోట్లు




**ముంబయి, మే 22:** కాల్గేట్ పామోలివ్ ఇండియా త్రైమాసిక ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. రాబడులు మాత్రం ఏడుశాతం పెరిగాయి. రాబడులు పెరగడంతో కంపెనీ రూ.24 డివిడెండ్ ప్రకటించింది. మార్జిన్లపై ఎక్కువ వ్యయాలు ప్రభావంచూపించాయి, ఎఫ్‌ఎంసిజి విభాగంలో రూ.353 కోట్లు లాభం వచ్చింది. గత ఏడాదికంటే స్వల్పంగా తగ్గింది. రాబడులు మాత్రం 7.3 శాతం పెరిగి రూ.1486 కోట్ల నుంచి రూ.1595 కోట్లకు పెరిగాయి. ఎబిడిటా కూడా 2.3శాతం క్షీణించింది. 522 కోట్లనుంచి రూ.510 కోట్లకు పడిపోయింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 35.1 నుంచి 31.9శాతానికి తగ్గింది. నాలుగోత్రైమాసికంలో నికర అమ్మకాలు 9శాతం వృద్ధితో ఉంది. ప్రీమియం పోర్టుఫోలియోల్లో అమ్మకాలుపెరిగాయి. వ్యాపార ప్రకటనలు కూడా ఈ త్రైమాసికంలో వ్యయం 10శాతంపెరిగాయి. ఎక్కువగా ప్రీమియం కేటగిరీపైనే కంపెనీ ఫోకస్ పెంచింది. ప్రతి రూపాయి విలువ కలిగిన షేరుపై బోర్డు రూ.24 డివిడెండ్ సిఫారసుచేసింది. జూన్ 17న చెల్లిస్తారు. రికార్డు తేదీ జూన్ 1గా తేలింది. ఎండి ఇఇఒ ప్రభా నరసింహమ్ మాట్లాడుతూ కంపెనీ ఈ ఏడాది అమ్మకాల్లో వృద్ధి నమోదుచేసింది. దేశీయంగా బిజినెస్ 9.2శాతం పెరిగిందన్నారు. కంపెనీ ప్రీమియం పోర్టుఫోలియో అమ్మకాల్లో మంచి వృద్ధి కనిపించిందని, కంపెనీ వృద్ధి మూడురెట్లు పెరుగుతుందన్న నమ్మకాన్ని వ్యక్త చేసారు.

## క్షీణించిన ఫోరెక్స్ ఖజానా

ముంబయి, మే 22:భారత ఫోరెక్స్ నిల్వలు 8.094 బిలియన్ డాలర్లు క్షీణించి 688.894 బిలియన్ డాలర్లకు చేరాయి. మే 15తో ముగిసిన వారంలో నిల్వలు కొంత మేర కరిగాయి. డాలర్ చెల్లింపులు పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గత వారంలో ఆర్బీఐ రిజర్వులు 6.295బిలియన్ డాలర్లు పెరిగి 696.988 బిలియన్ డాలర్లకు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో ఆర్బీఐ కరెన్సీ రిజర్వులు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. 728.494 బిలియన్ డాలర్లకు చేరాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, డాలర్ చెల్లింపులు పెరగడంతో విదేశీ కరెన్సీ ఖజానా ఒత్తిడికి లోనయింది. విదేశీ కరెన్సా ఆస్తులు పరంగాచూసినా 6.483 బిలియన్ డాలర్లు క్షీణించి 545.904బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ ఇతరవిదేశీ కరెన్సీ మార్పిడిలో వచ్చే హెచ్చుతగ్గుల విలువలే విదేశీ కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారు. ఇక బంగారం నిల్వలపరంగా చూస్తే 1.536 బిలియన్‌డాలర్లు క్షీణించి 119.317 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద స్పెషల్ డ్రాయింగ్ హక్కులు కూడా 49 మిలియన్ డాలర్లు తగ్గి 18.824బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఐఎంఎఫ్ వద్ద రిజర్వుస్థాయి కూడా 25 మిలియన్ డాలర్లు క్షీణించి 4.85 బిలియన్ డాలర్లకు చేరాయి.







# ఎల్‌ఐసి నికరలాభం 57,419 కోట్లు

**ముంబయి, మే 22:** ప్రభుత్వరంగంలోని జీవితబీమా సంస్థ పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.57,419 కోట్లు నికరలాభం ఆర్జించింది. గత ఏడాది కంటే 19.25 శాతం లాభాలు పెంచుకోవడంతో ఎల్‌ఐసి బోర్డు తుది డివిడెండ్ ప్రతి పది రూపాయల ఈక్విటీ షేరుకు రూ.10 డివిడెండ్ ప్రకటించింది. వ్యక్తిగత బిజినెస్ 43.78శాతం పెరిగి రూ.15,214కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ విలువలు 41.63శాతం పెరిగి రూ.14,179 కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ ప్రీమియం కూడా 8.29శాతం పెరిగి రూ.67,676 కోట్లకు చేరింది. మొత్తం ప్రీమియం ఆదాయి 9.80శాతం పెరిగి రూ.5,35,984 కోట్లుగా ఉందని ఎల్‌ఐసి పెరిగింది. భారత్ బీమా విలువలు 1.58శాతంపెరిగి రూ.7,89,185 కోట్లకు చేరింది. అలాగే ప్రీమియం కూడా 5.59శాతంనుంచి 7.51శాతానికి పెరిగింది.

వ్యయ నిష్పత్తి కూడా 51 బేసిస్ పాయింట్లు తగ్గింది. 12.42శాతం నుంచి 11.91శాతానికి చేరింది. పాలసీ దారులకు బోనస్ రూపంలోనే ఈ ఏడాది రూ.59,726 కోట్లు చెల్లించినట్లు ఎల్‌ఐసి వివరించింది. సంస్థ ఎండిసిఇఒ ఆర్.దరైస్వామి మాట్లాడుతూ సంవత్సరంలో పనితీరు సంతృప్తికరంగానే మారిందని అన్నారు. అకౌంటింగ్ ప్రమాణాలు భారతీయ ప్రమాణాలకు అనుసరించి ఇండాస్ వ్యవస్థనే అనుసరిస్తున్నట్లు తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని కొత్త మైలురాళ్లు చేరుకోగలమని దొరైస్వామి చెప్పారు. మొత్తం 20 కోట్లమందికిపైగా పాలసీదారుల విశ్వాసం చూరగొన్నామని, భవిష్యత్తులో కూడా ఇదే తీరులో ముందుకు వెళతామన్నారు. ప్రస్తుతం నిర్వహణ ఆస్తులు ఎల్‌ఐసికి రూ.57,29,396కోట్ల వరకూ ఉన్నాయి. గతఏడాది కొంటే 5.08శాతంపెరిగినట్లు తెలిపారు. వాటాదారుల నమ్మకాన్ని వమ్ముచేకుండా 1:1 నిష్పత్తిలోనే బోనస్ ప్రకటించినట్లు సిఇఒ ఎండి గుర్తుచేసారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps